అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శుక్రవారం 01-12-2023



ఓటువేసి సిరా చుక్క చూపుతున్న కొత్త ఓటర్లు

సంపుటి : 9 | సంచిక : 280 | Published from Rangareddy, Hyderabad, Khammam, Karimnagar | 8 పేజీలు + టాబ్లాయిడ్ 8 పేజీలు | వెల : 6.50



తీర్పు ఎటు?

అంతుచిక్కని ఓటరు నాడి

- పోలింగ్ ప్రశాంతం
- సాయంత్రం ఐదు గంటల వరకు..63.94 శాతం ఓటింగ్
- డిసెంబర్ 3న కౌంటింగ్
- బద్ధకించిన రాజధాని ఓటర్లు
- అత్యధికంగా జనగాంలో పోలింగ్
- అత్యల్పంగా యాకుత్‌పురాలో...

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. అయితే నువ్వా నేనా అన్నట్టుగా సాగిన ఎన్నికల సంగ్రామంలో తీర్పు ఎటు ఉండబోతుందన్న దానిపైనే సర్వత్రా చర్చ నెలకొంది. రహస్య ఓటింగ్ వల్ల..ఓటరు నాడి అంతు చిక్కట్లేదు. మరోవైపు ఎగ్జిట్ పోల్స్ వచ్చినా..బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు గెలుపు మాదంటే..మాదేనని మీడియా ముందుకు రావటంతో ఈ ఎన్నికల ఫలితాలపై ఆసక్తి నెలకొంది.

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఆధ్వర్యంలో భారీ బందోబస్తు మధ్య రాష్ట్రవ్యాప్తంగా 35,655 పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు ఓట్లు వేశారు. గురువారం ఉదయం 7 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ ప్రారంభమైంది. మధ్యాహ్నం ఒంటిగంట లోపే పలు పోలింగ్ స్టేషన్లలో 48 నుంచి 50 శాతం పోలింగ్ పూర్తయ్యింది. ఆ తర్వాత మందకొడిగా సాగింది. సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 63.94 శాతం పోలింగ్ జరిగినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే సాయంత్రం 5 గంటల సమయంలో క్యూలైన్లలో ఉన్న వారు కూడా ఓటుహక్కు వినియోగించుకొనే వరకు వెసులుబాటు కల్పించారు. దీనితో కొన్ని చోట్ల రాత్రి 7 గంటలు దాటాక కూడా పోలింగ్ జరుగుతూనే ఉంది. అవన్నీ పూర్తయ్యాక పోలింగ్ శాతంలో స్వల్ప మార్పులు ఉంటాయని ఎన్నికల సంఘం తెలిపింది. రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌లో గతంలో మాదిరే ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఓటింగ్ శాతం పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చేసిన ప్రయత్నాలు ఏవీ పెద్దగా ఫలితాలు ఇవ్వలేదు. పాతబస్తీలోని యాకుత్‌పురా నియోజకవర్గంలో కేవలం 27.87 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. అత్యధికంగా జనగాం నియోజకవర్గంలో 83.34 శాతం పోలింగ్ నమోదైంది. పలుచోట్ల ఓటింగ్ యంత్రాలు మొరాయించాయి. ఓటింగ్ ఆలస్యం అవుతుండటంతో కొన్ని పోలింగ్ స్టేషన్ల నుంచి ఓటర్లు వెనుదిరిగి వెళ్లిపోయారు. డిసెంబర్ 3వ తేదీ 49 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

ముందే ముగిసిన పోలింగ్

రాష్ట్రంలోని 13 సమస్యాత్మక నియోజకవర్గాల్లో పోలింగ్ సాయంత్రం 4 గంటలకే ముగిసింది. అయితే అక్కడ కూడా సాయంత్రం 4 గంటల లోపు క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశం కల్పించారు. సిర్పూర్, బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల, ఆసిఫాబాద్, ...2లో

రూరల్‌లో పోటెత్తిన ఓటర్లు

అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు

- రాజకీయ పార్టీల మధ్య ఘర్షణ
- చెదరగొట్టిన పోలీసులు
- సమస్యలపై పోలింగ్‌ను బహిష్కరించిన పలు గ్రామాలు
- సర్దిచెప్పిన అధికారులు వివరాలు 2లో..
- నిబంధనలు ఉల్లంఘించిన నేతలు
- విచారించి ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు
- మొదటిసారి ఓటేసిన చెంచులు



మనదే విజయం

ఎగ్జిట్‌పోల్స్‌తో కంగారొద్దు..

- 70కిపైగా సీట్లతో అధికారంలోకి వస్తాం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మూడో తేదీన ఎన్నికల ఫలితాలు వస్తాయనీ, ఆ రోజున విజయం సాధించేది బీఆర్ఎస్సేనని ఆపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ...7లో



కాంగ్రెస్‌దే గెలుపు

ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తాం

- ఓటమి అంచున ఉంటే కేసీఆర్ స్థానాలు మారుస్తారు : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

ఎప్పుడైతే ఆ స్థానంలో ఓడిపోతానని కేసీఆర్‌కు తెలుస్తుందో అప్పుడే స్థానాలు మారుస్తాడని, కాంగ్రెస్ గెలుపు ఖాయమని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పోలింగ్ ముగిసిన తర్వాత నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 9న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తుందన్నారు. కేసీఆర్‌ను కామారెడ్డిలో ఓడిస్తున్నందుకు ...2లో

మరిన్ని వివరాలు లోపలి పేజీల్లో..

హస్తం వైపే ఎగ్జిట్‌పోల్స్

ఒకటెండ్రు బీఆర్ఎస్ వైపు మొగ్గు **కొన్నింటిలో హంగ్**

- కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఓటమి అంటూ ఆరా సంచలన ప్రకటన

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

ఎగ్జిట్‌పోల్స్ వచ్చేశాయి. కాంగ్రెస్ పార్టీవైపు మొగ్గుచూపాయి. మెజార్టీ సర్వే సంస్థలు అధికారం 'హస్త'గతం కాబోతున్నదని ప్రకటించాయి. అధికార బీఆర్ఎస్ ఈసారి రెండో స్థానానికే పరిమితం కాబోతున్నట్టు స్పష్టం చేశాయి. మూడో స్థానం కోసం బీజేపీ-ఎంఐఎం పోటీపడుతున్నట్టు చెప్పాయి. ఒకటెండ్రు సర్వే సంస్థలు మాత్రం రాష్ట్రంలో వరుసగా మూడోసారీ బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పాటు కాబోతున్నదని చెప్పాయి. రాష్ట్రంలో హంగ్



రాబోతున్నదనీ, ప్రభుత్వ ఏర్పాటులో ఎంఐఎం, బీజేపీ కీలకపాత్ర పోషించబోతున్నాయని కూడా కొన్ని వెల్లడించాయి. ఇదిలా ఉండగా, కామారెడ్డిలో సీఎం కేసీఆర్, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఓడిపోతున్నారనీ, అక్కడ బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి గెలువబోతున్నారని 'ఆరా' సంస్థ చేసిన ప్రకటన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నది. ఇప్పటిదాకా ఒకటెండ్రు సందర్భాల్లో మినహా ఎగ్జిట్‌పోల్ ఫలితాలు దాదాపు సక్సెస్ అవుతూ వస్తున్నాయి. ఎగ్జిట్ పోల్స్ ...7లో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఎగ్జిట్ పోల్స్

	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ	ఇతరులు
చాణక్య స్ట్రాటజీస్	22 - 31	67 - 78	6 - 9	6 - 7
ఆరా ప్రీ పోల్	41 - 49	58 - 67	5 - 7	9
జన్ కీ బాత్	40 - 55	48 - 64	7 - 13	4 - 7
పీపుల్స్ పల్స్	35 - 46	62 - 72	3 - 8	7 - 9
రేస్	45 - 51	57 - 67	1 - 5	6 - 7
సీఎన్ఎన్	48	56	10	5
ఇండియా TV - CNX	31 - 47	63 - 79	2 - 4	5 - 7
పోల్ స్ట్రాట్	48 - 58	49 - 59	5 - 10	6 - 8
స్మార్ట్ పోల్	24 - 36	70 - 82	3 - 8	6 - 8
రిపబ్లిక్ టీవీ	46 - 56	58 - 68	4 - 9	5 - 7



పాలేరు నియోజకవర్గం లోని కూసుమంచి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి తమ్మినేని వీరభద్రం

సాగర్ డ్యాంపై ఉద్రిక్తత

ప్రాజెక్టు భద్రతా బలగాలు,ఆంధ్ర పోలీసుల మధ్య ఘర్షణ

- డ్యాంపై కంచె ఏర్పాటు
- అదే సమయంలో కుడి కాలువకు నీటి విడుదల
- తెలంగాణ ప్రభుత్వానికి అధికారుల లేఖ



నవతెలంగాణ-పెద్దవూర

తెలంగాణ రాష్ట్రంలో తెల్లవారితే అసెంబ్లీ ఎన్నికలు.. అధికారులు ఆ ఏర్పాట్లలో నిమగ్నమై ఉండగా.. బుధవారం అర్ధరాత్రి నాగార్జున సాగర్ డ్యామ్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. గురువారం తెల్లవారు జామున 2గంటల సమయంలో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్‌పై ఆంధ్రప్రదేశ్ ...7లో

4 నుంచి పార్లమెంట్


18 బిల్లులు ప్రవేశపెట్టనున్న కేంద్ర ప్రభుత్వం 7లో..



బీజేపీకి ఎదురుగాలి

హిందీ రాష్ట్రాల్లో కాంగ్రెస్,బీజేపీల మధ్యే ప్రధాన పోరు

- ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో నువ్వా నేనా?
- మిజోరంలో హంగ్ : ఎగ్జిట్ పోల్స్ వెల్లడి



న్యూఢిల్లీ : ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాషాయ పార్టీకి ఎదురుగాలి వీస్తుందని ఎగ్జిట్‌పోల్స్ చెబుతున్నాయి. నవంబరు 30తో రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరంలలో ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెలువడ్డాయి. హిందీ మాట్లాడే రాష్ట్రాలైన రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెస్, బీజేపీల మధ్యే గట్టి పోటీ నెలకొందని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఈ రెండు పార్టీల్లో ఏదో ఒక దానికి స్వల్ప మెజారిటీ ఇస్తూ వివిధ ఎగ్జిట్ పోల్ సంస్థలు తమ సర్వే వివరాలను వెల్లడించాయి. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వాలు కాగా, మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం వుంది. మిజోరంలో ప్రాంతీయ మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) ప్రభుత్వం వుంది. రాజస్థాన్‌లో అశోక్ గెహ్లాట్ నేతృత్వంలోని కాంగ్రెస్ స్వల్ప మెజారిటీతో బీజేపీ కన్నా ముందంజలో వుంటుందని యాక్సిస్ ఇండియా టుడే అంచనా వేసింది. ఇంతకుముందు వెలువడిన ఒపీనియన్ పోల్స్ చూసినట్లైతే రాష్ట్ర ప్రజలు తమ చారిత్రక సాంప్రదాయాన్ని అనుసరించి, ప్రస్తుతం అధికారంలో వున్న కాంగ్రెస్ పార్టీని ...7లో

ఛత్తీస్‌గఢ్-90

సర్వే సంస్థ	బీజేపీ	కాంగ్రెస్	ఇతరులు
యాక్సిస్ మై ఇండియా	36-46	40-50	1-5
పీపుల్స్ పల్స్	29-39	54-64	0-2
టీవీ5 న్యూస్	29-39	54-66	0-2
ఇండియాటీవీ -CNX	30-40	46-56	3-5
జన్‌కీబాత్	34-45	42-53	0-3
సీ ఓటర్	36-48	41-53	0-4
టుడేస్ చాణక్య	25-41	49-65	0-3
దైనిక్ భాస్కర్	35-45	46-55	0

మధ్యప్రదేశ్-230

సర్వే సంస్థ	బీజేపీ	కాంగ్రెస్	ఇతరులు
పీపుల్స్ పల్స్	91-113	117-139	0-8
జన్‌కీ బాత్	100- 123	102-125	0-5
రిపబ్లిక్ టీవీ	118-130	97-107	0-2
పోల్‌స్ట్రాట్	106-116	111-121	0
మ్యాట్రిజ్	118-130	97-107	0-2
దైనిక్ భాస్కర్	95-115	105-120	0

రాజస్థాన్ ఎగ్జిట్ పోల్స్ - (200)-199

సర్వే సంస్థ	బీజేపీ	కాంగ్రెస్	ఇతరులు
జన్‌కీ బాత్	100-112	62-85	14-15
పీపుల్స్ పల్స్	95-115	73-95	8-21
పోల్ స్ట్రాట్	100-110	90-100	5-15
టైమ్స్ నౌ- ఈటీజీ	108-128	56-72	0
P-Marq	105-125	69-91	0
దైనిక్ భాస్కర్	95-105	85-95	0

రాష్ట్ర శాసనసభకు ఎన్నికల ప్రక్రియ గురువారం పూర్తయింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎమ్)లో పార్టీలు, అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తమైంది. ఈనెల మూడున అసలు విషయం తేలనుంది. ఈలోపే అధికారం తమదంటే తమదేనంటూ అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ ప్రకటనలు గుప్పిస్తుండటం గమనార్హం. ఎగ్జిట్‌పోల్స్‌ను చూసి కార్యకర్తలు, నాయకులు నిరాశ చెందకుండా ఉండేందుకే నేతలు ఈ రకమైన ప్రకటనలు గుప్పిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ ఎన్నికల్లో ధన ప్రవాహం కట్టలు తెంచుకుంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన నేతలు ముక్కున వేలేసుకునేలా అత్యంత ఖరీదైన ఎలక్షన్‌గా ఇది మారింది.

ఈవీఎంలలో భవితవ్యం...

తేలేది మూడున **పార్టీలు, అభ్యర్థుల్లో టెన్షన్ టెన్షన్**

గెలుపుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ధీమా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆ పార్టీ ఈ పార్టీ అనే తేడా లేకుండా ధనస్వామ్య పార్టీలన్నీ నియోజకవర్గాల్లో ఓట్ల కోసం డబ్బుల్ని మంచినీళ్ల ప్రాయంలా ఖర్చు పెట్టాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎలక్షన్లలో పోలింగ్ శాతం సుమారు నాలుగు శాతం తగ్గటం గమనార్హం. ఇది ఓటేయటంపై ప్రజల ఆసక్తిని తెలియజేస్తోంది. ఎవరు గెలుస్తారు.. ఎవరు ఓడతారనే విషయాలను పక్కనబెడితే ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్రంలోనే కాదు.. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. గులాబీ, హస్తం పార్టీలు ఈ ఎలక్షన్లను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. సంవత్సర కాలం నుంచి వ్యూహాలు, ప్రతి వ్యూహాలు, విమర్శలు, ప్రతి విమర్శలు, దూషణ భాషణలతో 'తగ్గేదేలే...' అన్నట్టు వ్యవహరించాయి. సీఎం కేసీఆర్ 115 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించిన ఆగస్టు 21 నాటి నుంచి వాతావరణం మరింత హీటెక్కింది. ఆ తర్వాత ...2లో



నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	62,730	▼	650
22 క్యారెట్లు	57,500	▼	600
కిలో వెండి	82,200	-	---



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 86
రిటైల్ (లైవ్)	రూ. 108
స్కిన్‌తో	రూ. 157
స్కిన్‌లెస్	రూ. 178

గుజరాత్‌లో మాజీ ఐఏఎస్ అధికారి అరెస్టు

గాంధీనగర్ : రూ. 18.6 కోట్ల విలువైన ప్రభుత్వ గ్రాంట్‌లను ఆరు నకిలీ కార్యాలయాల బ్యాంకు ఖాతాలకు మళ్లించే కుంభకోణంలో భాగమైనందుకు గానూ గుజరాత్‌లోని దాహెూద్ జిల్లాలో మాజీ ఐఏఎస్ అరెస్టయ్యారు. గుజరాత్-క్యాడర్ మాజీ అధికారి బి.డి నిమానాకు జిల్లా కోర్టు 4 వరకు పోలీసు కస్టడీకి రిమాండ్ విధించింది. "ఆయన 2019 నుంచి 2022 మధ్య దాహెూద్‌లో రాష్ట్ర ప్రభుత్వ గిరిజన ప్రాంత సబ్ ప్లాన్ ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా ఉన్నప్పుడు కుంభకోణంలో ఇతర నిందితులకు సహాయం చేశాడని ఆరోపణలున్నాయి. దీంతో అతన్ని అరెస్టు చేశారు" అని పోలీసు సూపరింటెండెంట్ రాజ్‌దీప్‌సింగ్ జాలా తెలిపారు.

రూరల్‌లో పోటెత్తిన ఓటర్లు



హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల సమరం చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించగా.. వాటిని మార్చారు. ఉదయం పోలింగ్ కాస్త మొందకొండిగా సాగినా సాయంత్రానికి కేంద్రాల వద్ద గంటల తరబడి బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాలుగు గంటల వరకు సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ ముగిసింది. ఐదు గంటల వరకు అందిన సమాచారం మేరకు 63.94 శాతం పోలింగ్ నమోదైంది. ఆ సమయానికి కేంద్రాల్లో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం ఉంది. పోలింగ్ శాతం పూర్తి వివరాలు రావడానికి సమయం పడుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు. రూరల్ ప్రాంతాల్లో ఓటేసేందుకు ఉదయం నుంచే బారులుతీరారు. నగరంలో మాత్రం ఆలస్యంగా స్పందించారు. పోలింగ్ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీఎస్పీ నాయకుల మధ్య ఘర్షణలు జరిగాయి. పోలీసులు సర్దిచెప్పి.. చెదరగొట్టారు. ఇబ్రహీంపట్నంలో లాఠీచార్జి చేశారు. ఏజెన్సీ, మారుమూల గ్రామాల్లో కొన్నిచోట్ల పోలింగ్‌ను బహిష్కరించారు. ఏండ్ల తరబడి సమస్యలను పట్టించుకోవడం లేదంటూ ఓటు వేయడానికి నిరాకరించారు. అధికారులు సర్దిచెప్పి పంపించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసుల సమస్య పరిష్కారానికి బాధ్యత తనదేనంటూ తహసీల్దార్‌తో రాతపూర్వకంగా రాయించుకున్నారు. నల్లమలలో చెంచులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. హిజ్రాలూ తొలిసారి ఓటు వేశారు. మొదటి గంటలోనే ముఖ్య నేతలు, ఉన్నతాధికారులు, ప్రముఖులు ఓటేవారు. ఆదిలాబాద్‌లో ఇద్దరు, పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్‌లో 248 పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సుధాకర్(48) తెల్లవారుజామున మాక్ పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తూ అస్వస్థతకు గురై మరణించారు.

నవతెలంగాణ - విలేకరులు

డబ్బులు ఇవ్వలేదని ....

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం నల్లమల పరిధిలోని మున్నూరులో కాంగ్రెస్,బీ ఆర్ఎస్‌లకు మధ్య ఘర్షణ జరిగింది. నల్లమల్లలోని మల్లాపూర్ అలహాబాద్ పరిధిలోని చెంచుపేటలో చెంచులు మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో కొన్నిచోట్ల రాజకీయ పార్టీలు డబ్బులు ఇవ్వలేదని ఓటర్లు ఓటు వేయబోమని మొండికేశారు. ద్వితీయ శ్రేణి నాయకులు వాళ్లను బతిమలాడి ఎంతోకొంత ఇచ్చి పోలింగ్ కేంద్రాలకు వచ్చేటట్టు చేశారు. సాయంత్రానికి ఎక్కువ మంది ఓటర్లు కేంద్రాలకు చేరుకోవడంతో రాత్రి ఏడు గంటల వరకు పోలింగ్ సాగింది. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలోని పోలింగ్‌బూత్‌లో ఈవీఎం 30 నిమిషాలపాటు మొరాయించింది. బేతవోలు గ్రామంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. మోతె మండలంలోని సిరికొండలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించేందుకు బీఆర్ఎస్ కోదాడ మాజీ ఇన్‌చార్జి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి రాగా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో స్వల్ప ఘర్షణ జరిగింది. నకిరేకల్ నియోజకవర్గంలో 20 నుంచి 30 పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగే అవకాశం ఉంది.

రోడ్డు కోసం నిలదీత...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోలింగ్ కేంద్రం లోపల ఉన్న ఓటర్లను చివరి వరకు అనుమతించడంతో రాత్రి 8గంటల వరకు కొనసాగింది. కొన్నిచోట్ల మరింత ఎక్కువ సమయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో పొలం పనులకు వెళ్లే వారు ఉదయమే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. పట్టణ ప్రాంతాల్లో మాత్రం మధ్యాహ్నం నుంచి పోలింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. ఖానాపూర్ మండలంలోని గుమ్మెన, ఎంగ్లాపూర్, నాయకపుగూడలో కరెంట్, రోడ్డు సౌకర్యం కల్పించాలని మధ్యాహ్నం వరకు నిరసన తెలిపారు. అధికారులు వారిని సముదాయించడంతో పోలింగ్‌లో పాల్గొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని 90వ పోలింగ్ కేంద్రం బీఆర్ఎస్, బీఎస్పీ మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. చెప్పులు, రాళ్లు విసురుకోవడంతో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి.

రంగారెడ్డి జిల్లాలో..

రంగారెడ్డి జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో సుమారు 57శాతం ఓటింగ్ నమోదైంది. గత ఎన్నికల్లో 62శాతం ఓటింగ్ నమోదు కాగా ఈసారి సుమారు 5శాతం ఓటింగ్ తగ్గింది. వికారాబాద్ జిల్లాలోని 4 నియోజకవర్గాల్లో మొత్తం.69.79శాతం ఓటింగ్ జరిగింది. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 44.3శాతం మాత్రమే శాతం ఓటింగ్ జరిగింది. మైలార్‌దేవ్‌పల్లిలో మాజీ సీఎస్ సోమేష్‌కుమార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేవెళ్ల మండలంలోని ఆలూరు ఊరెళ్ల, రేగడిగానాపూర్ తదితర గ్రామాలలో రాత్రి 7:30 వరకు పోలింగ్ కొనసాగింది. ఇబ్రహీంపట్నంలోని ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని రాత్రి వరకు ఓటింగ్ కొనసాగింది.

మహేశ్వరం నియోజకవర్గంలో ఉదయం నుంచి 58శాతం ఓటింగ్ జరగక ఉదయం నుంచి ఓటర్లు ఓటింగ్ వేసేందుకు బారులు తీరారు. కొన్ని చోట్ల రాత్రి వరకు ఓటింగ్ సాగింది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉదయం 9గంటల వరకు వేగంగా జరిగిన పోలింగ్ మధ్యాహ్నం, సాయంత్రానికి ఒక్కసారిగా పడిపోయింది. వికారాబాద్ జిల్లా పరిగిలో ఉదయం 9గంటల వరకు పోలింగ్ మందకోడిగా జరిగింది. అనంతరం వేగంగా పుంజుకుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా చూసుకుంటే అర్బన్ ప్రాంతంలో ఓటింగ్ తగ్గగా.. గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ పెరిగింది.

ఓటేసిన ట్రాన్స్‌జెండర్లు

వేములవాడ నియోజకవర్గంలో ట్రాన్స్‌జెండర్లు మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వేములవాడ నియోజకవర్గం కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామంలో ఏనుగు రాజవ్వ ఓటరు, ఆధార్ కార్డులో పేరు వేరుగా ఉందని ఓటు వెయ్యనివ్వకపోవడంతో ఏడ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాలకిషన్ గులాబీ చొక్కాతో పోలింగ్ బూత్ వద్ద కారు గుర్తుకు ఓటు వేయాలని అడిగారని మహిళలు ఆరోపించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఉద్రిక్తతకు దారి తీసింది. కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి తమ్ముడు.. మున్సిపల్ కార్యాలయం వద్ద ఓటర్లను ప్రభావితం చేస్తున్నాడని బీఆర్ఎస్ నాయకులు బైటాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కలగజేసుకొని సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది.

మానకొండూర్‌లో ఈవీఎంల మొరాయింపు

కరీంనగర్ జిల్లాలో 69.22శాతం, జగిత్యాల జిల్లాలో 74.87, పెద్దపల్లి జిల్లాలో 69.83, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 71.87శాతం ఓట్లు పడ్డాయి. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 144 పోలింగ్ కేంద్రంలో మాక్‌పోలింగ్ నిర్వహించే సమయంలో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గంలోని గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ 247 బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో గంట పోలింగ్ ఆలస్యమైంది. చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండల కేంద్రంలోని 86వ పోలింగ్ కేంద్రంలో వెయ్యికి పైగా ఓటర్లకు సరిపడా సిబ్బంది లేక ఒకటే ఈవీఎం మిషన్ పెట్టడంతో ఓటర్లు చాలా ఇబ్బందులకు గురయ్యారు.

సంగారెడ్డిలో జగ్గారెడ్డి, దుబ్బాకలో రఘునందన్‌రావు నిరసన

సంగారెడ్డిలో పలువురు కాంగ్రెస్ నాయకుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. దుబ్బాకలో రఘునందన్‌రావు కూడా స్టేషన్ ముందు ఆందోళన చేశారు. పలు చోట్ల పోలీస్‌లు చెదరగొట్టేందుకు లాఠీలకు పనిచెప్పారు. సిద్దిపేట జిల్లాలోని చింతమడకలో సీఎం కేసీఆర్ దంపతులు, మంత్రి హరీశ్‌రావు దంపతులు సిద్దిపేట పట్టణంలోని భారత్ నగర్‌లోని పోలింగ్ బూత్ నంబరు 114లో ఓటేశారు. సంగారెడ్డి జిల్లాలో సాయంత్రం 5 గంటల వరకు 73.83 శాతం పోలింగ్ నమోదైంది. మెదక్ జిల్లాలో 80.28 శాతం, సిద్దిపేట జిల్లాలో 73.03 శాతం పోలింగ్ నమోదైంది. తొలిసారి ఓటు హక్కు వచ్చిన యువత పెద్ద ఎత్తున ఓటు వేశారు. తూప్రాన్ పరిధిలోని కొల్చారంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకుల్ని కొట్టడాన్ని నిరసిస్తూ వాళ్ల పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు.

ఈవీఎంలలో భవితవ్యం...

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ దశల వారీగా జాబితాలు విడుదల చేయటం, ఆ పార్టీతోపాటు బీఆర్ఎస్ పలువురు అభ్యర్థులను మార్చటం తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. రెండు పార్టీల్లోనూ సీటు దక్కని సిట్టింగులు, ఆశావహులు, చివరి నిమిషంలో బీ-ఫామ్ దక్కని వారి ఏడుపులు, పెడబొబ్బలతో వారం రోజులపాటు నియోజకవర్గాల్లో పలు ఆసక్తికర సన్నివేశాలు రక్తికట్టించాయి. ఇక అక్టోబరు రెండో వారం నుంచి ప్రచారపర్వం మొదలైంది. నవంబరులో అది ఊపందుకుని, ఆ నెల చివరి వారానికి తారాస్థాయికి చేరింది.

ఈ క్రమంలో తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్, ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్... తమ ఘనతను చెప్పుకునేందుకు, తద్వారా ప్రజల మనసులను గెలుచుని, ఆ రకంగా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు శతవిధాలా ప్రయత్నించాయి. ఈసారి కూడా ఎలాగైనా గెలిచి, హ్యాట్రిక్ కొట్టాలని బీఆర్ఎస్ సర్వశక్తులూ ఒడ్డింది. ఇదే సమయంలో తెలంగాణ ఏర్పడ్డాక ఇంతవరకూ 'అధికార బోణీ' కొట్టని హస్తం.. పార్లమెంటు ఎన్నికలకు ముందు ఇక్కడ గెలవటం ద్వారా కొంతలో కొంత ఊపిరి పీల్చుకోవాలని భావించి ఎన్నికల గోదాలోకి దిగింది. కర్నాటక గెలుపు ఇచ్చిన ఊపూ, ఉత్సాహంతో తెలంగాణలో అధికార పీఠాన్ని కైవసం చేసుకునేందుకు వీలుగా మొదటి నుంచి 'అత్యంత జాగ్రత్త'గా వ్యవహరించింది. ఈ క్రమంలో ఇరు పార్టీలూ... అభ్యర్థుల ఎంపిక దగ్గర్నుంచి చేరికలు, అసంతృప్తులను బుజ్జగించటం, వైరి వర్గాలను దగ్గరకు తీయటం, రెబల్స్‌తో నామినేషన్లను ఉపసంహరింపజేయటం, ఆఖరికి పోల్ మేనేజ్‌మెంట్ వరకూ అన్ని విషయాల్లోనూ ఆచితూచి అడుగులేస్తూ వ్యూహాత్మకంగా వ్యవహరించాయి. ఈ మొత్తం సీనులో బీజేపీ చతికిలబడటం ఆ పార్టీకే మింగుడు పడని విషయం. కన్నడ నాట కాంగ్రెస్ గాలితో ఆదిలోనే ఖంగుతిన్న కమలం పార్టీ... ఆ తర్వాత అంతర్గత కుమ్ములాటలతో మరింత చప్పబడింది. ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన పెద్ద తలకాయలన్నీ వీడటంతో కమలం రేకులు ఒక్కోటిగా ఊడిపోయాయి.

ఫలితాలు రావటానికి ఇంకా రెండు రోజుల సమయమున్నప్పటికీ బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ తమ క్యాడర్ 'కాన్ఫిడెన్స్ లెవల్స్' దెబ్బతినకుండా చూసుకునేందుకు యత్నించటం చివరి అంకంలో ఆసక్తికర అంశం. 'కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారు.. నూతన సచివాలయంలో ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు.. పోడు పట్టాల పంపిణీకి సంబంధించిన ఫైలుపై తొలి సంతకం చేయబోతున్నారు...' అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ఒక ప్రకటనను వదిలితే, 'మా పార్టీ నుంచి ఎనిమిది మంది సీఎం రేసులో ఉన్నారు... కానీ లీడర్, కెప్టెన్ మాత్రం నేనే, కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకోవచ్చు...' అంటూ రేవంత్ వ్యాఖ్యానించటం గెలుపుపై ఆయా పార్టీలకున్న ధీమాను, అధికార పీఠంపై ఆశను తెలియజేస్తున్నాయి. చూద్దాం... ఓటరన్న ఎవరికి పట్టం గట్టాడనేది రెండు రోజుల్లో తేలనుంది. అప్పటి వరకూ ఈవీఎమ్‌లకు కాపలా కాసే సెక్యూరిటీ సిబ్బందితోపాటు మనమూ ఎదురు చూద్దాం.

కాంగ్రెస్‌దే గెలుపు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఓటమి అంచున ఉన్నప్పుడల్లా కేసీఆర్ స్థానాలు మారుస్తాడని గుర్తు చేశారు. అధికార పార్టీ ప్రలోభాలకు గురిచేసినా వారిని ప్రజలు ఓడించారన్నారు. శ్రీకాంతాచారి ఆత్మకు ప్రగాఢ నివాళులర్పిస్తున్నట్టు ప్రకటించారు. శ్రీకాంతాచారి డిసెంబర్ 3న తుది శ్వాస వదిలాడని, ఆరోజే ఎన్నికల ఫలితాలు రానున్నాయని తెలిపారు.

సమాజంలోని చైతన్యంపై మాకు పూర్తి నమ్మకం ఉందని, ఎవరెన్ని రకాలుగా కుట్రలు చేసినా వెనుకడుగు వేయకుండా పోరాడామన్నారు. ఎగ్జిట్ పోల్స్ ఏవీ కాంగ్రెస్‌కు అధికారం రాదని చెప్పడం లేదని కొన్ని స్థానాలు మారుతున్నాయని మాత్రమే చెబుతున్నాయన్నారు. ఫలితాలు తమకు అనుకూలంగా లేవనే కేసీఆర్ మీడియా ముందుకు రాలేదన్నారు. ఇవాళ చంద్రుడికి మబ్బులు పట్టాయి అన్నారు. "ఎగ్జిట్ పోల్స్ తప్పు అంటున్నావ్ కదా ఒకవేళ అవి నిజమైతే నువ్వు ప్రజల ముందుకు వచ్చి క్షమాపణ చెప్తావా" అని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. మీడియాకు ఈ రోజు నుంచి స్వేచ్ఛ లభిస్తుందన్నారు. తాము పాలకులం కాదు సేవకులమని తెలిపారు. 4 కోట్ల మంది ప్రజలు మనకు సేవ చేసుకునే అవకాశం ఇచ్చారన్నారు. మనకు మొదటి, చివరి శత్రువు కేసీఆర్ కుటుంబంలోని ఆ నలుగురేనని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి 25 సీట్లు దాటబోవన్నారు. సమావేశంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాస శ్రీనివాసరావు, వేణుగోపాల్ రెడ్డి, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్, గూడెం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో ఘర్షణ, లాఠీఛార్జి

- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఘర్షణ
- మొరాయించిన ఈవీఎంలు

పోలింగ్ నేపథ్యంలో గురువారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల గొడవలు జరిగాయి. ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకున్నది. ఒక పార్టీపై మరో పార్టీ నేతలు, కార్యకర్తలు దాడులు చేశాయి. మరికొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయి.



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుదారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దాంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఇబ్రహీంపట్నం మండలంలోని ఖానాపూర్‌లోని 105 పోలింగ్ కేంద్రంలో ఉదయం జరిగిన మాక్ పోలింగ్‌లో ఈవీఎం మొరాయించింది. దాంతో పోలింగ్ ప్రారంభానికి ఆలస్యం అవుతుండటంతో ఆయా రాజకీయ పార్టీల ఏజెంట్లు, ఓటర్లు ఆందోళనకు దిగారు. ఇదే సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. దాంతో పోలీసులు ఇరు గ్రూపులను చెదరగొట్టేందుకు లాఠీచార్జి చేశారు. అదే విధంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో ఘర్షణకు దారి తీసింది. దాంతో పోలీసులు ఇరు గ్రూపులను చెదరగొట్టారు. విషయం తెలుసుకున్న డీసీపీ అనురాధ, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శేరిగూడ గ్రామానికి చేరుకొని గుంపులు, గుంపులుగా ఉన్న రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలను వెళ్లగొట్టారు. రాయపోల్ గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి గుర్తుకు స్పష్టంగా మార్కు చేసి ఉన్నట్టు కనిపిస్తూ ఉండటంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు అభ్యంతర వ్యక్తం చేశారు. వెంటనే మార్కును తీసివేయాలని కోరారు. దాంతో రాయపోల్‌లోనూ ఘర్షణ చోటుచేసుకుంది. బ్యాక్ సైడ్ వేసిన స్టాంపు తిక్కుగా పడటం వల్ల లైను కనిపిస్తుందే తప్ప ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించలేదని తెలిపారు. అయినా కాంగ్రెస్ నాయకులు వినకపోవడంతో మరో బ్యాలెట్ పేపర్‌ను అమర్చారు. నాగన్‌పల్లిలోనూ బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నంలో రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఖానాపూర్ ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలను తనిఖీ చేశారు.

తీర్పు ఎటు?

(మొదటిపేజీ తరువాయి)

మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, కొత్తగూడెం, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాలను సమస్యాత్మకమైనవిగా ఎన్నికల సంఘం గుర్తించింది.

తగ్గిన పోలింగ్

గత ఎన్నికలతో పోలిస్తే రాష్ట్రంలో పోలింగ్ శాతం గణనీయంగా తగ్గింది. 2014 ఉమ్మడి రాష్ట్రంలో 294 అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో 74.68 శాతం పోలింగ్ నమోదైంది. ఆ తర్వాత 2018లో జరిగిన ఎన్నికల్లో 73.74 శాతం పోలింగ్ జరిగింది. ఇప్పుడు (2023లో) 63.94 శాతానికే ఓటింగ్ పరిమితమైంది. మొత్తం 119 అసెంబ్లీ స్థానాలకు జరిగే ఎన్నికల్లో 60 సీట్లు ఎవరికి వస్తే వారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు. 2018 ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్‌కు 88 సీట్లు రాగా, కాంగ్రెస్‌కు 19, టీడీపీ 2, బీజేపీ 1, ఎంఐఎం 7 స్థానాల్లో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఇద్దరు టీడీపీ సభ్యులు, కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయారు. కాంగ్రెస్ నుంచి 12 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరారు. మరో కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీజేపీలోకి వెళ్లి, ఆ తర్వాత రాజీనామా చేసి, మునుగోడు ఉప ఎన్నికల్లో ఓడిపోయిన విషయం తెలిసిందే.

కంటి చికిత్సకు ఓకే

వరవరరావుకు ఎన్ఐఏ కోర్టు అనుమతి

న్యూఢిల్లీ : 2018 ఎల్గార్ పరిషత్-మావోయిస్ట్ లింకుల కేసులో నిందితుడైన సామాజిక కార్యకర్త వరవరరావును కంటిశుక్లం శస్త్రచికిత్స కోసం హైదరాబాద్ వెళ్లేందుకు ముంబయిలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు అనుమతించింది. తన ఎడమ కంటి శస్త్రచికితకు డిసెంబర్ 5 నుంచి 11 మధ్య హైదరాబాద్ వెళ్లేందుకు న్యాయమూర్తి రాజేష్ కటారియా బుధవారం అనుమతించారు. డిసెంబరు 4న జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కి రిపోర్టు చేయాలనీ, తన ప్రయాణ వివరాలను, హైదరాబాద్‌లో తాను బస చేయబోయే ప్రదేశానికి సంబంధించిన చిరునామా, సంప్రదింపు నంబర్‌ను తప్పనిసరిగా అందించాలని కోర్టు పేర్కొన్నది. ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయవద్దని కోర్టు హెచ్చరించింది. 2018లో ఎల్గార్ పరిషత్-మావోయిస్ట్ లింకుల కేసులో వరవరరావు అరెస్టయ్యారు. బాంబే హైకోర్టు 2021 మార్చిలో వైద్య కారణాలపై తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన విషయం విదితమే. 2022, ఆగస్టులో, వైద్య కారణాలతో సుప్రీంకోర్టు అతనికి సాధారణ బెయిల్ మంజూరు చేసింది.

విముక్త పాలస్తీనా కావాలి

పాలస్తీనియన్లకు బాసటగా నిలిచిన ప్రపంచ ప్రజలు

- అంతర్జాతీయ సంఘీభావం దినోత్సవం సందర్భంగా నిరసనలు, ర్యాలీలు



శావో పాలో : బుధవారం అంతర్జాతీయ పాలస్తీనియన్ల సంఘీభావ దినోత్సవం సందర్భంగా పాలస్తీనాకు పూర్తి విముక్తి కల్పించాలని ప్రపంచ దేశాలు డిమాండ్ చేశాయి. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాలన్నీ పాలస్తీనా ప్రజలకు బాసటగా నిలబడుతున్నాయి. ఇప్పటి వరకు గాజాలో సాగుతున్న నరమేధంలో 15వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. కాల్పుల విరమణకు తాత్కాలికంగా విరామం ఇచ్చినప్పటికీ ఇజ్రాయిలీ బలగాలు పాలస్తీనియన్ల ను చంపుతునే వున్నాయి.

బుధవారం రాత్రి జరిగిన దాడిలో జెనిన్ శరణార్ధి శిబిరాన్ని లక్ష్యంగా చేసుకుని ఇద్దరు చిన్నారులను చంపేశారు. అరబ్, మాగెరబ్ ప్రాంతంవ్యాప్తంగా నిరసనలు, ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఇజ్రాయిల్‌తో సాధారణ సంబంధాల ప్రక్రియకు ముగింపు పలకాలని తమ ప్రభుత్వాలను ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మొరాకోలో 17 నగరాల్లో నిరసన కార్యాచరణకు మొరాకన్ ఫ్రంట్ అగైనెస్ట్ నార్మలైజేషన్ అండ్ ఇన్ సపోర్ట్ ఆఫ్ పాలస్తీనా పిలుపిచ్చింది. విముక్త పాలస్తీనా కావాలంటూ రబత్ నగరంలో జరిగిన నిరసన కార్యాచరణలో ప్రజలు పిలుపిచ్చారు.

పాలస్తీనాకు సంఘీభావంగా ట్యునిస్‌లో నవంబరు 29న వర్కర్స్ పార్టీ ఆఫ్ ట్యునీషియా పెద్ద ఎత్తున ప్రజా సమీకరణను చేపట్టింది. మాతృభూమిని దోచుకుంటున్న, ప్రజల గౌరవానికి భంగం కలిగిస్తున్న, సామ్రాజ్యవాదం నిస్సిగ్గుగా అందించే మద్దతుతో ఆటవిక యుద్ధాన్ని చేస్తూ ప్రపంచ ప్రజల వివేకాన్ని సవాలు చేస్తున్న యూదు వలసవాదాన్ని పార్టీ తీవ్రంగా ఖండిస్తూ ట్యునీషియా వర్కర్స్ పార్టీ ఒక ప్రకటన జారీ చేసింది. అణచివేతకు గురవుతున్న ప్రజల తరపున, అరబ్బుల తరపున పోరాడుతున్న పాలస్తీనా ప్రజలు విజయం సాధించాలని కోరుతూ అన్ని నగరాలు, గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించాల్సిందిగా ప్రజలకు పిలుపిచ్చింది. సెంట్రల్ వెస్ట్ బ్యాంక్ నగరమైన రమల్లాలో కూడా పెద్ద సంఖ్యలో జాతీయ, ఇస్లామిక్ బలగాలు, కార్మిక సంఘాలు, పౌర సంస్థలు, ప్రజా కమిటీలు ర్యాలీలు నిర్వహించాయి. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించాయి.

ఇటలీవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు సమ్మెలు నిర్వహించారు. ఇజ్రాయిల్ విద్యా సంస్థలతో సంబంధాలె తెగతెంపులు చేసుకోవాలని డిమాండ్ చేశారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావాన్ని ప్రకటించారు.

భూముల అమ్మితే తప్ప సర్కారు నడవదు

గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

నవ తెలంగాణ- గజ్వేల్

'ప్రస్తుతం ప్రభుత్వ భూములు అమ్మితే తప్ప సర్కారు నడవదు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రతినెలా ఏదో ఒక చోట ప్రభుత్వ భూములు అమ్మితేనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నారు. పెన్షన్స్ ఇతర వాటికి డబ్బులు ఇవ్వలేకపోతున్నారు' అని గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం సాయంత్రం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆయన పోలింగ్ సరళిని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే ప్రజల భూములను తీసుకోవాలి లేదా ప్రభుత్వ భూములు అమ్మితే తప్ప కేసీఆర్‌కు సకాలంలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. సంక్షేమ పథకాలన్నీ భూముల అమ్మకాలతో వచ్చిన డబ్బులనే పేదలకు పంచుతున్నారని తెలిపారు. మద్యం రూపంలో ప్రజల నుంచి కేసీఆర్ డబ్బులు లాగుతున్నారని విమర్శించారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలతో పాటు తెలంగాణ ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని ఓట్ల శాతం బట్టి తెలుస్తోందన్నారు. కేసీఆర్ దౌర్జన్యాన్ని, దుర్మార్గాన్ని బొంద పెట్టడానికి లొంగిపోకుండా ప్రతి కార్యకర్త స్థానికంగా పని చేసినట్టు చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గంలో నిశ్శబ్ద విప్లవం ఉందని, సర్వేలకు అందని రిజల్ట్ ఉందన్నారు. హుజూరాబాద్‌లో ఒక సైకో శాడిస్టును కేసీఆర్ తనపై పోటీకి దించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తన వైఖరిని స్పష్టం చేస్తానన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు భాస్కర్, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడులో భారీ వర్షాలు..

నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

చెన్నై: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు తమిళనాడుని అతలాకుతలం చేస్తున్నాయి. బుధవారం సాయంత్రం నుండి కురుస్తున్న వర్షాలతో రాష్ట్ర రాజధాని చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, రాణీపేట జిల్లాల్లో సహా పలు జిల్లాల్లో వరదలు ముంచెత్తాయి. దీంతో ఈ నాలుగు జిల్లాల్లో గురువారం పాఠశాలలకు అధికారులు సెలవులు ప్రకటించారు.

డిసెంబర్ 2 మరియు 3 తేదీల్లో చెన్నై మరియు సమీప జిల్లాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితులతో వారాంతం వరకు మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి ప్రకటించింది. ఇది డిసెంబర్ 2 నాటికి తుఫానుగా బలపడుతుందని అంచనా వేసింది.













పోలింగ్ చిత్రాలు

ఓటు హక్కును వినియోగించుకున్న సీఎం కేసీఆర్, సీపీఐ(ఎం) అభ్యర్థులు, అధికారులు,ఇతరులు..









చుక్కా రామయ్య... మీరు ఆదర్శమయ్యా...

- 99 ఏండ్ల వయసులో ఓటేసిన ప్రముఖ విద్యావేత్త
- హైదరాబాద్‌లో ఆక్సిజన్ సిలిండర్‌తో పోలింగ్ కేంద్రానికి శేషయ్య
- కాగజ్‌నగర్‌లో కాలితోనే ఓటేసిన ఓ వికలాంగుడు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. యువత, మహిళలతోపాటు వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు సైతం పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. వృద్ధులు కొందరు చురుకుగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేయడం ద్వారా యువత ఇంట్లో కూర్చోకుండా రావాలంటూ సందేశమిచ్చారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు సైతం ఇంట్లో వాళ్ల సాయంతో ఓటింగ్‌లో పాల్గొన్నారు. కొందరు వృద్ధులు, రోగులు కుటుంబ సభ్యులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల సాయంతో ఓటేశారు. కొందరికి ప్రత్యేకంగా కార్లు, ఆటోలు వంటి వాహనాలను కేటాయించి పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చారు. హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో గల హిందీ మహావిద్యాలయ పోలింగ్ కేంద్రంలో ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య ఓటు హక్కును వినియోగించుకున్నారు. 99 ఏండ్ల వయసులో ఆయన పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలికి చెందిన 75 ఏండ్ల శేషయ్య తీవ్రమైన లివర్ సిరోసిస్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆక్సిజన్ సిలిండర్‌తో ఆయన పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటేయడం పౌరుడిగా తన బాధ్యతని చెప్పారు. 1966 నుంచి తాను తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకున్నాననీ, అందరూ ఓటేయాలని కోరారు. ముషీరాబాద్ గాంధీనగర్‌లోని ఎస్బీఐ కాలనీకి చెందిన ఆస్తమా రోగి లక్ష్మీ శ్యాంసుందర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఘంటసాల గ్రౌండ్‌లోని 83వ నెంబర్ పోలింగ్ కేంద్రంలో ఆమె ఓటేశారు. రెండు చేతులూ లేకున్నా కాలితోనే ఓటేసి ఆదర్శంగా నిలిచారు ఓ వికలాంగుడు. కొమురం భీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన జాకీర్‌పాషాకు పుట్టుకతోనే రెండు చేతులు లేవు. అయినప్పటికీ ఓటు వేసి ప్రజాస్వామ్య పరిరక్షణలో ఆయన తనవంతు పాత్ర పోషించారు. ఈ ఎన్నికల్లో బాధ్యతగా పాల్గొని కాలుతోనే ఓటేసి అందరికీ ఆదర్శమయ్యారు. అంబర్‌పేటలో 92 ఏండ్ల వృద్ధుడు ఓటు హక్కును వినియోగించుకున్నారు. యువత ఇంట్లో ఉండకుండా బయటికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అలాగే శివానంద రిహాబిలిటేషన్‌లో వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వికలాంగులు కూడా ఈ ఎన్నికల్లో ఓటేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. వైకల్యాన్ని సాకుగా చూపకుండా ఓటేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. రాష్ట్రంలో తొలిసారిగా ఓట్ ఫ్రమ్ హోం ద్వారా 27 వేల మందికిపైగా వృద్ధులు, వికలాంగులు ఓటు హక్కును వినియోగించుకున్న విషయం తెలిసిందే.

కేసీఆర్‌వి దింపుడు కల్లం ఆశలే

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఘటనపై రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజకీయ లబ్ది కోసం చేస్తున్న సీఎం కేసీఆర్ పన్నాగాలు ఫలించవని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఆయనవి దింపుడు కల్లం ఆశలేనని చెప్పారు. ఇలాంటి కుట్రలు ఎన్నికలపై ప్రభావం చూపాల్సిన అవసరం లేదన్నారు. వివాదాలను సామరస్యంగా సరైన పరిష్కారం చూపించే బాధ్యత మాది అన్నారు. గురువారం కొడంగల్ నియోజకవర్గంలో ఓటు వేసిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. నాగార్జున సాగర్ ఘటనపై స్పందించారు. తెలంగాణ ప్రజలు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని కోరారు. ఏం ఆశించి ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారో కండ్లకు కట్టినట్టు కనిపిస్తున్నదని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కోరారు.తొమ్మిదేండ్లుగా కేసీఆర్ ఈ సమస్యను పరిష్కరించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. వీటన్నింటికి శాశ్వత పరిష్కారం ప్రజామోదయోగ్యమైన ప్రభుత్వం ఏర్పడటమేనని చెప్పారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇతర రాష్ట్రాలతో ఉన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తామన్నారు. దేశాల మధ్య



నీటి వాటాలు పంచుకుంటామన్నారు. అలాంటిది రాష్ట్రాల మధ్య వాటాలు పంచుకోలేమా? అని ప్రశ్నించారు. నీటి వాటాలు, ఆస్తుల పంపకాల విషయంలో కాంగ్రెస్ సమయస్ఫూర్తి,సమన్వయంతో వ్యవహరిస్తుందన్నారు. అవసరమైనప్పుడు ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్‌ను కేసీఆర్ ఉపయోగించుకుంటున్నారని రేవంత్ ఎద్దేవా చేశారు.

సాగర్ డ్యామ్‌పై హైడ్రామా కేసీఆర్ పనే : కోమటిరెడ్డి వెంకటొరెడ్డి

సాగర్ డ్యామ్‌పై పోలీసుల హైడ్రామా సీఎం కేసీఆర్ పనేనని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటొరెడ్డి ఆరోపించారు. ఎన్నికల్లో ఓడిపోతున్నారంటూ కేసీఆర్‌కు అర్థమై తెలంగాణ సెంటిమెంట్ రగిలిస్తున్నారని విమర్శించారు. ఇన్ని రోజులు లేని హడావిడి పోలింగ్ రోజే ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ, ఏపీ పోలీసులు కలిసి చేసే డ్రామాలు ఎవరూ నమ్మవద్దని కోరారు. తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ ఎన్నికల కోసం వాడుతున్నారని విమర్శించారు. 90 సీట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఎమ్మెల్సీ కవిత ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్‌లోని డీఏవీ స్కూల్ పోలింగ్ స్టేషన్లలో తన ఓటును వినియోగించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత కోడ్ ఉల్లంఘించి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కోరారు.

ఓటేసేందుకు నగరవాసుల నిరాసక్తత

- హైదరాబాద్‌లో15 నియోజకవర్గాల్లో 40.23శాతం పోలింగ్

నవతెలంగాణ- సిటీబ్యూరో

హైదరాబాద్‌లో చదురు ముదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సారి కూడా నగర వాసులు చాలా మంది ఇంటి నుంచి కాలు బయట పెట్టలేదు. ఓటు వేయడానికి ఆసక్తి కనబర్చలేదు. నగరంలో ఓటింగ్ శాతం పెంచాలని అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా నగర పౌరులు ఓటింగ్‌పై నిర్లక్ష్యం వహించారు. దాంతో సాయంత్రం ఐదు గంటల వరకు హైదరాబాద్ జిల్లాలోని 15నియోజకవర్గాల్లో 40.23శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా సికింద్రాబాద్‌లో 47.14శాతం, యాకుత్‌పురాలో అత్యల్పంగా 27.87శాతం పోలింగ్ నమోదైంది.

వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలన

నగరంలోని 15 నియోజకర్గాల పరిధిలో మొత్తం 45,36,852 లక్షల మంది ఓటర్లుండగా, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతోపాటు సీపీఐ(ఎం) తదితర పార్టీలు, స్వతంత్ర్య అభ్యర్థులు కలిసి మొత్తం 312 మంది పోటీలో నిలిచారు. 15 నియోజకవర్గాల్లో 1677 ప్రాంతాల్లో 4119 పోలిస్



స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ మూడు కమిషనరేట్లతో పాటు కంమాండ్ కంట్రోల్ రూంలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడూ పరిస్థితులను పర్యవేక్షించారు. జీహెచ్ఎంసీ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని సీఈఓ వికాస్‌రాజ్, జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ పరిశీలించారు. 184ఏ పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ తీరుపై ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేశారు. పలు పోలింగ్ కేంద్రాల్లో కంపార్ట్ మెంట్లలోకి ఇతరులు వెళ్తున్న విషయాన్ని గమనించిన రోనాల్డ్ రోస్ అధికారులను అప్రమత్తం చేశారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఓటింగ్ సరళిపై రోనాల్డ్ రోస్ అధికారులపై సీరియస్ అయ్యారు. మలక్‌పేట్‌లో కాంగ్రెస్, ఎంఐఎం కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు చెదరగొట్టారు. సాయినాథ్ గంజ్‌లోని ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఇండిపెండెంట్ అభ్యర్థితో బీజేపీ ఏజెంట్ వాగ్వాదానికి దిగారు. గోడేకీకబుర్ వద్ద మహిళా పోలీస్‌పై ఓ యువకుడు దురుసుగా ప్రవర్తించాడు. గోషామహల్, హబ్సిగూడతోపాటు పలుప్రాంతాలల్లో ఉదయం కొద్దిసేపు ఈవీఎంలు మొరాయించాయి.

ఆసక్తికరంగా క్యూ మెగా సర్వే

- బీఆర్ఎస్‌కు 55 నుంచి 60 స్థానాలు
- కాంగ్రెస్‌కు 40 నుంచి 50 సీట్లు : ఖాదర్ ఖాన్ పఠాన్ వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ 55 నుంచి 60 సీట్లు, కాంగ్రెస్ 40 నుంచి 50 సీట్లలో గెలవొచ్చని క్యూ మెగా ప్రీ పోల్ సర్వే, ఒపీనియన్ పోల్ వెల్లడించింది. ఈ యేడాది మే 25 నుంచి నవంబర్ 25 వరకు రాష్ట్రంలో 10,22,500 మందితో చేసిన సర్వేతో పాటు ఒపీనియన్ పోల్‌ను క్రోడీకరించి వేసిన అంచనాలను క్యూ మెగా సర్వే వ్యవస్థాపక సీఈవో ఖాదర్ ఖాన్ పఠాన్ వెల్లడించారు. తాము చేసిన సర్వేలో అన్ని వయస్సులు, కులాలు, విద్యావంతులు, నిరక్షరాస్యులు, వివిధ వృత్తులు చేసుకునే వారు, పురుషులు, మహిళలు తదితరులున్నారని తెలిపారు. గురువారం హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీకి 2 నుంచి 5, ఎంఐఎంకు 5 నుంచి 7, ఇతరులకు ఒక సీటు రావొచ్చని తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు వచ్చే సీట్లలో ఐదు సీట్లు పెరగడం లేదా తగ్గడం జరగొచ్చన్నారు. 17 స్థానాల్లో తీవ్రమైన పోటీ నెలకొందని వాటి ఫలితాలు మారే అవకాశముందని తెలిపారు. ఓట్ల శాతం పరంగా బీఆర్ఎస్‌కు 43 శాతం, కాంగ్రెస్‌కు 40 శాతం, బీజేపీకి 5 శాతం, బీయస్పీకి 0.7 శాతం, సీపీఐ, సీపీఐ (ఎం)లకు 1.3 శాతం, ఎంఐఎంకు 4 శాతం, ఇతరులకు ఆరు శాతం ఓట్లు వస్తాయని అంచనా వేశారు.

కాంగ్రెస్ గట్టి పోటీని ఎదుర్కొంటున్న నియోజకవర్గాలివే...

చెన్నూరు, మంచిర్యాల, జగిత్యాల, ధర్మపురి, మానకొండూరు, మెదక్, ఉప్పల్, ఎల్.బీ.నగర్, అంబర్‌పేట, సికింద్రాబాద్ కంటోన్మెంట్, గద్వాల, కొల్లపూర్, దేవరకొండ, నాగార్జునసాగర్, నకిరేకల్, సూర్యాపేట, మహబూబాబాద్, వైరా, పినపాక, నియోజకవర్గాల్లో కాంగ్రెస్ స్వల్ప మెజారిటీతో గెలిచే అవకాశమున్నా... అక్కడ గట్టి పోటీ నెలకొని ఉన్న నేపథ్యంలో ఫలితాలు మారే అవకాశముందని తెలిపారు.

బీఆర్ఎస్ గట్టిపోటీని ఎదుర్కొంటున్న నియోజకవర్గాలివే...

ఆదిలాబాద్, వేములవాడ, కుత్బుల్లాపూర్, నర్సంపేట్, ఖమ్మం, , సత్తుపల్లి, అశ్వరావుపేట నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలిచే అవకాశాలున్నా గట్టిపోటీని ఎదుర్కొంటున్నది.

ఎంఐఎంను ఇబ్బంది పెడుతున్న నాంపల్లి

నాంపల్లి నియోజకవర్గంలో ఎంఐఎం గెలుపు సాధించే దిశగా ఉన్నప్పటికీ అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి ఫిరోజ్ ఖాన్ నుంచి గట్టిపోటీ ఎదుర్కొంటున్నది.

గజ్వేల్, కామారెడ్డిలో కేసీఆర్‌దే గెలుపు

గజ్వేల్, కామారెడ్డి రెండు స్థానాల్లో సీఎం కేసీఆర్ గెలుస్తారని ఖాదర్ ఖాన్ తేల్చారు. కొడంగల్‌లో రేవంత్ రెడ్డి, హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్ గెలుపు ఖాయమన్నారు.

గట్టిపోటీ ఎదుర్కొంటున్న మంత్రులు వీరే..

సీఎం కేసీఆర్ మంత్రివర్గంలో కొందరి గెలుపు నల్లేరు మీద నడకలా ఉండనుండగా, మరి కొంత మంది సమీప ప్రత్యర్థుల నుంచి గట్టిపోటీ ఎదుర్కొంటున్నారు. గట్టిపోటీ ఎదుర్కొంటున్న మంత్రుల్లో పువ్వాడ అజయ్ (ఖమ్మం), కొప్పుల ఈశ్వర్ (ధర్మపురి), జగదీశ్వర్ రెడ్డి (సూర్యాపేట) ఉన్నారు.

సంపాదకీయం

గాజాలో దాడుల నిలిపివేత దిశగా చర్చలు!

గాజా పౌరుల మీద నాలుగు రోజుల పాటు దాడులను నిలిపివేసేందుకు, ఇజ్రాయిల్ జైళ్లలో ఉన్న 150 మంది మహిళలు, పిల్లలను, హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారిలో 50 మంది మహిళలు, పిల్లలను విడుదల చేసేందుకు కుదిరిన ఒప్పందాన్ని మరో రెండు రోజులు పొడిగించారు. గాజా కాలమానం ప్రకారం గురువారం ఉదయం 5గంటలకు ఆ గడువు ముగిసింది. ఇప్పటి వరకు

> అమెరికన్లు అనేక మంది బందీలుగా ఉన్నందున వారి విడుదల వెంటనే జరగకపోతే అది ఎన్నికల అంశంగా మారినా ఆశ్చర్యం లేదు. ఇతరులను ఎంతమందిని చంపినా పర్వాలే దన్నట్లుగా ఉండే అమెరికన్లు తమవారి దగ్గరకు వచ్చేసరికి ఒక్కరికి హాని జరిగినా తీవ్రంగా స్పందించటం తెలిసిందే. దాడులను విరమిస్తే హమాస్ పలుకుబడి పెరుగుతుందని, దాని సాయుధ విభాగం మరింత పటిష్టవంత మౌతుందని ఇజ్రాయిల్ వెనక్కు తగ్గేది లేదని అంటున్నా బైడెన్ తన రాజకీయ ప్రయోజనాలకే పెద్ద పీటవేస్తున్నాడు. అందుకే కొత్త పల్లవి, ఇజ్రాయిల్ మీద ఒత్తిడి అన్నది స్పష్టం.

99 మంది బందీలు, 210 మంది ఖైదీలకు విముక్తి లభించింది. ఇజ్రాయిల్ దాడుల్లో ముగ్గురు బందీలు మరణించినట్లు హమాస్ ప్రకటించగా, పిల్లలతో సహా ఇంకా 161 మంది బందీలుగా ఉన్నట్లు ఇజ్రాయెల్ తెలిపింది. దాడుల నిలిపివేత మరికొంత కాలం లేదా పూర్తిగా నిలిపివేసేందుకు చర్చలు జరుగుతున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ ఇది రాస్తున్న సమయానికి ఎలాంటి నిర్ణయం జరగలేదు. అవగాహన పరిధికి మించి ఇతర కారణాలతో హమాస్ అదనంగా 21 మంది బందీలను విడుదల చేసింది. తాజా పరిణామాల వెనుక అమెరికా మీద వస్తున్న ఒత్తిడే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వవద్దని, మానవహక్కుల కార్యకర్తలు, చివరికి స్వంత డెమోక్రటిక్ పార్టీ నేతలు, మద్దతుదార్ల నుంచి ఒత్తిడి వస్తున్నప్పటికీ ఖాతరు చేయకుండా 'కొట్టండి, నరకండి, చంపండి, నాశనం చేయండి' అంటూ అక్టోబరు ఏడు నుంచి ఇజ్రాయిల్‌ను ప్రోత్సహించిన జోబైడెన్ తాజాగా సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు. ఇజ్రాయిలీ, పాలస్తీనియన్ల దీర్ఘకాల భద్రతకు రెండు దేశాలు ఏర్పడటమే హామీ ఇవ్వగలదని ట్వీట్ చేశాడు. కాల్పులను విరమించాలని డిమాండ్ చేస్తున్న అమెరికన్ పౌరుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. కొన్ని రాష్ట్రాల ప్రజాప్రతినిధులతో సహా ప్రముఖులు నిరహార దీక్షలను ప్రారంభించారు. పది లక్షల సంతకాలతో కూడిన మహజరును అందజేశారు.

ఇల్లు కాలుతుంటే బొగ్గులేరుకునే బాపతు అమెరికా అన్నది తెలిసిందే. గాజాలో పరిణామాల గురించి అది వేసు



కున్న లెక్కలు తప్పాయి. ఆయుధాలు అమ్ముకోవటానికి వివాదాన్ని ప్రాంతీయ యుద్ధంగా మార్చేందుకు అది విసిరిన వలలో అరబ్బు, ఇస్లామిక్ దేశాలు పడలేదు. ప్రాణ నష్టం పరిమితంగా ఉండేట్లు చూడండి అన్న మాటలను యూదు దురహంకారులు ఖాతరు చేయలేదు. చివరికి ఆసుపత్రులు, ఐరాస సహాయ కేంద్రాలు, శరణార్థుల శిబిరాలనూ వదల్లేదు. అన్ని రకాల యుద్ధ నేరాలకు పాల్పడ్డారు. హమాస్ తీవ్రవాదులను ఏరివేసే పేరుతో ప్రారంభించిన దాడులు 70శాతం పైగా పిల్లలు, మహిళలతో సహా 15 వేల మంది అమాయక పౌరుల ప్రాణాలు తీయటం, హమాస్ వద్ద ఉన్న బందీల జాడను కనుగొనటంలో వైఫల్యం, మరికొన్ని వేల మందిని చంపినా హమాస్ కార్యకర్తలు జాడదొరకదనే అభిప్రాయం బలపడుతుండటంతో గౌరవప్రదంగా వెనక్కు తగ్గేందుకు అమెరికా సూచన మేరకే ఖైదీల విడుదలకు ఇజ్రాయిల్ అంగీకరించింది. సహజంగానే పాలస్తీనియన్ల ఒత్తిడి హమాస్ మీద కూడా పనిచేసింది.

గడచిన ఏడున్నర దశాబ్దాలుగా ఇజ్రాయిల్ మూకలు ఎన్ని పాలస్తీనా విముక్తి సంస్థలను అణచివేసినా, ఎందరిని చంపినా కొత్త యోధులు ఉద్భవిస్తూనే ఉన్నారు, కొత్త సంస్థలు ఉనికిలోకి వస్తున్నాయి. అందువలన అపరిమిత బలంతో ఒకవేళ హమాస్‌ను అణచివేసినా మరో కొత్త సంస్థ పుట్టుకురాదనే హామీ లేదు. గత చరిత్ర చెప్పింది అదే. దశాబ్దాల తరబడి గాజా, వెస్ట్‌బాంక్‌లను దిగ్బంధించినా, ఆక్రమించినా సాధించిందేమీ లేదు. ఇటువంటి స్థితిలో మరి కొద్ది వారాల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం ప్రారంభం కానున్నది. మారణకాండ కొనసాగితే సమర్థించుకోవటం మరింత కష్టమవుతుంది. అమెరికన్లు అనేక మంది బందీలుగా ఉన్నందున వారి విడుదల వెంటనే జర గకపోతే అది ఎన్నికల అంశంగా మారినా ఆశ్చర్యం లేదు. ఇతరులను ఎంతమందిని చంపినా పర్వాలే దన్నట్లుగా ఉండే అమెరికన్లు తమవారి దగ్గరకు వచ్చేసరికి ఒక్కరికి హాని జరిగినా తీవ్రంగా స్పందించటం తెలిసిందే. దాడులను విరమిస్తే హమాస్ పలుకుబడి పెరుగుతుందని, దాని సాయుధ విభాగం మరింత పటిష్టవంతమౌతుందని ఇజ్రాయిల్ వెనక్కు తగ్గేది లేదని అంటున్నా బైడెన్ తన రాజకీయ ప్రయోజనాలకే పెద్ద పీటవేస్తున్నాడు. అందుకే కొత్త పల్లవి, ఇజ్రాయిల్ మీద ఒత్తిడి అన్నది స్పష్టం. గతంలో కూడా ఇలాగే కొన్ని వారాల తరువాత దాడుల నిలిపివేత, తిరిగి అణచివేత జరిగింది.ఎవరు ఎలాంటి ఉద్దేశ్యంతో ఉన్నప్పటికీ మారణకాండ నిలిపివేత పాలస్తీనియన్లకు ఉపశమనం కలిగిస్తుంది. అందుకే శాంతి శక్తులు ఒప్పందాన్ని హర్షించాయి. అది శాశ్వతంగా కుదరాలని ఆశిద్దాం.

ఛాందసవాది కుమారుడైన అభ్యుదయవాది శ్రీధర్ తిలక్



డాక్టర్ దేవరాజు మహారాజు

25మే 1928న పూనా- బొంబాయి ఎక్స్‌ప్రెస్ ట్రైన్ కిందపడి శ్రీధర్ పంత్ తిలక్ ఆత్మహత్య చేసుకున్నారు. చేసుకోవడానికి ముందు ఆయన ముగ్గురికి సుసైడ్ నోట్స్ పంపారు. ఒకటి పూనె కలెక్టర్‌కి, రెండోది వార్తాపత్రికకు, మూడోది డా.బి.ఆర్. అంబేద్కర్‌కు. ఆయన మరణం తర్వాత ఆ ఉత్తరాన్ని 'సమతా' అనే పత్రిక 29 జూన్, 1928 న ప్రచురించింది. అంబేద్కర్‌కు రాసిన ఉత్తరం లోని సారాంశం ఇలా ఉంది.

"ఈ ఉత్తరం మీకు చేరేసరికి నా మరణవార్త వింటారు. మీరు ఆశిస్తున్న సమతా - సమాజ్ - సంఘ్ ఇంకా ముందుకు సాగాలంటే విద్యావంతులను, సమాజంలో మార్పు ఆశించే యువకులను ఉద్యమం వైపు ఆకర్షించాలి. లక్ష్యసాధన కోసం మీరు నిరంతరం పడుతున్న శ్రమ, పట్టుదల నాకెంతో ఆనందాన్ని కలిగించింది. మీకు విజయం కలుగుతుందని నాకు పూర్తి నమ్మకముంది. మహారాష్ట్రలో ఉన్న యువత అంటరానితనాన్ని నిర్మూలించడా

> మతం, దేవుడు వంటి వ్యక్తిగత విషయాల్ని రాజకీయాల్లోకి తెచ్చి, ఈ రోజు గణపతి విగ్రహాల్ని చెత్తకుండీల పక్కన పెట్టించి, ఐటమ్ సాంగ్స్‌కు డాన్సులు చేయిస్తున్న లోకమాన్యుడు ఈ తరానికి మాన్యుడేమీ కాదు. ఆయన కుమారుడు శ్రీధర్ తిలకే మాన్యుడు! కాలం పెట్టిన పరీక్షలో తండ్రి బాల గంగాధర తిలక్ అపజయుడయితే - కొడుకు శ్రీధర్ తిలకే విజయుడయ్యాడు "లోకమాన్య" అనే బిరుదుకు అర్హులైన వారు ఎవరైనా ఉన్నారంటే - అది శ్రీధర్ పంత్ (బల్వంత్) తిలకే" అని అన్నారు. డా.బి.ఆర్. అంబేద్కర్. నిజమే! ప్రజా వ్యతిరేక విధానాలున్న వారికి ఇచ్చే బిరుదులు అనర్థదాయకం.-

నికి పూనుకుంటే, సమస్య కేవలం ఐదు సంవత్సరాల్లో పరిష్కారమౌతుంది - అందరికీ నా అభినందనలు".

ఇంతకీ శ్రీధర్ పంత్ తిలక్ ఎవరో ఈ తరం యువతీయువకులకు తెలిసి ఉండకపోవచ్చు. చాలా మంది లోకమాన్య బాల గంగాధర తిలక్ పేరు వినే ఉంటారు కదా? ఆయన మూడవ కుమారుడే శ్రీధర్ బల్వంత్ తిలక్. శ్రీధర్ పంత్ తిలక్ (1896-25 మే1928)గా ప్రసిద్ధులు. తండ్రి ఆలోచనా ధోరణికి పూర్తి భిన్నమైన ఆలోచనా ధోరణి గలవారు. పైగా డా.బి.ఆర్. అంబేద్కర్‌కు చాలా సన్నిహిత మిత్రులు. తండ్రి బాల గంగాధర తిలక్ కులవ్యవస్థ, అంటరానితనం ఉండాలన్నారు కానీ, కొడుకు శ్రీధర్ తిలక్ వాటిని బద్దలు కొట్టాలన్నారు. హిందువులను ఏకం చేయడానికి ఇళ్ళలో ఉన్న గణపతిని వీధుల్లోకి తెచ్చిన ఘనుడు బాల గంగాధర తిలక్. దాని వికృత రూపాలు మనం ఈ నాటికీ అనుభవిస్తున్నాం. తండ్రి బాల గంగాధర తిలక్ ప్రభావంలో పడకుండా అంటరాని తనాన్ని నిర్మూలించడానికి, సమాజంలో సమానత్వం సాధించడానికి శ్రీధర్ పంత్ తిలక్ సమాజ్ సమతా సంఘ్ ను స్థాపించారు. అంబేద్కర్‌కు సన్నిహితుడు కావడానికి ఇదొక ప్రధాన కారణం. అంబేద్కర్ నిర్వహించే దాదాపు అన్ని కార్యక్రమాలలో శ్రీధర్ తిలక్ చాలా చురుకుగా, ఉత్సాహంగా పాల్గొనేవారు. 2 అక్టోబర్ 1927 రోజున పూనాలో ఒక పెద్ద సమావేశం జరిగింది. అది అణగారిన వర్గాల విద్యార్థుల సమావేశం దానికి అంబేద్కర్ అధ్యక్షత వహించారు. శ్రీధర్ పంత్ తిలక్ అందులో ఒక ముఖ్య వక్తగా పాల్గొన్నారు.

అలాగే, అంటరాని బాలురను శ్రీధర్ తిలక్ ప్రత్యేకంగా తన ఇంటికి భోజనానికి ఆహ్వానించి, తరచూ సహభోజన కార్యక్ర మాలు నిర్వహించే వారు. ఆ రకంగా బ్రాహ్మణ ధర్మకర్తలను ధిక్కరించి, వారి ఆగ్రహానికి గురయ్యేవారు. లోకమాన్య బాల గంగాధర తిలక్ ఉన్నప్పుడు. ఆయన నివాసాన్ని లోకమాన్య నివాస్‌గా అందరూ గుర్తించేవారు. ఆయన మరణం తర్వాత కొడుకు శ్రీధర్ తిలక్ కూడా అదే ఇంట్లో నివాసముండేవారు. అయితే ఈయన అదే లోకమాన్య నివాస్ ఇంటి ముందు 'చతుర్వర్ణ విధ్వంసక సమితి' అనే బోర్డు తగిలించారు. ఫలితంగా తన తండ్రి ప్రారంభించిన 'కేసరి' పత్రికలోనే తనను విమర్శిస్తూ, ఒక్కోసారి అవమానిస్తూ వ్యాసాలు ప్రకటింపబడుతూ ఉండేవి. బ్రాహ్మణాధిక్యతను నిలపాలని తాపత్రయపడే ఆయన తండ్రి అనుయాయులు, అభిమానులు అవి రాసి ప్రచురించేవారు. శ్రీధర్ పంత్ తిలక్ పై బంధువుల, తండ్రి స్నేహితుల ఒత్తిడి విపరీతంగా ఉండేది. అభ్యుదయవాది అయినందుకు ఆయనను ఘోరంగా అవమానిస్తూ తండ్రి ప్రారంభించిన పత్రికలోనే వ్యాసాలు రావడం బాధాకరంగా ఉండేది.

ఇంటా బయటా ఇన్ని రకాల ఒత్తిళ్ళు భరించలేకనే శ్రీధర్ పంత్ తిలక్ ఆత్మహత్య చేసుకోవలసి వచ్చిందని అతి సన్నిహితంగా ఉండి పరిశీలించిన అంబేద్కర్ ధృవీకరించారు. ఆ మరునాడు 26 మే 1928న జరిగిన సంతాప సభలో శ్రీధర్ తిలక్ సేవలను కొనియాడుతూ తీర్మానం చేశారు. సమతా పత్రిక ఎడిటోరియల్లో "శ్రీధర్ పంత్ తిలక్ నుండి నేనెంతో ఆశించాను. కానీ, ఆయన ఇప్పుడు మన మధ్య లేకపోవడం గొప్ప విషాదం" అంటూ డా.బి.ఆర్. అంబేద్కర్ శ్రద్ధాంజలి ఘటించారు.

బ్రాహ్మణ సమాజంలోని పిడివాదులు, సనాతన వాదులు, కేసరి మరాఠా ట్రస్ట్ సభ్యులు మూకుమ్మడిగా పెట్టిన మానసిక హింస వల్ల, కోర్టు కేసుల వల్ల, ఏడేళ్ళు కోర్టుల చుట్టూ తిరిగి వేసారి పోవడం వల్ల శ్రీధర్ తిలక్ ఆత్మహత్యకు పూనుకుని ఉంటారు. ఒక ఛాందసుడిగా తన తండ్రి దారిలో నడిచి ఉంటే ఆయనకు ఆ పరిస్థితి వచ్చేది కాదు. ప్రవాహానికి ఎదురీదడం ఎప్పుడైనా కష్టమైన పనే, ధైర్యమైన పనే, తన ప్రత్యర్థులతో వీలైనంత వరకు పోరాడారు కానీ. ఏదో ఒక బలహీన క్షణాన ఆత్మహత్య చేసుకుందామన్న నిర్ణయానికి వచ్చారు. అలా జరగకుండా ఉండాల్సింది. సమాజం అందించిన అన్ని అర్హతలూ ఉండి, అగ్రవర్ణం వాడై ఉండి నిమ్న జాతుల గురించి, అంటరానితనం గురించి, అభ్యుదయ కాంక్షతో పని చేయడమే ఆయన ప్రాణం మీది కొచ్చింది.

బాల గంగాధర తిలక్ అంటరాని వాడిగా పుట్టి ఉంటే "అంటరానితనం నిర్మూలనే నా జన్మహక్కు" అని అని ఉండేవారేమోనని అన్నారు అంబేద్కర్. 'స్వరాజ్యం నా జన్మహక్కు" అన్న బాల గంగాధర తిలక్ 1918లో మహారాష్ట్రలోని బెలగావ్ దగ్గర 'అథేవ్' అనే ఊళ్ళో జరిగిన బహిరంగసభలో మాట్లాడుతూ నిమ్నకులాల వారిని ఎలా ఎగతాళి చేశారో చూడండి. "నూనె తీసేవారు, కల్లు గీసేవారు, కుండలు చేసేవారు చట్ట సభల్లోకి వచ్చి నూనె తీస్తారా? కల్లు గీస్తారా? కుండలు చేస్తారా? అని శ్రామిక కులాలను అవమాన పరిచారు. బ్రాహ్మణులు చట్ట సభల్లోకి వచ్చి ఏం చేస్తారు? పూజా కార్యక్రమాలు, శ్రార్ధకర్మలు నిర్వహిస్తారా? అని ప్రశ్నించే వాతావరణం ఆనాడు లేదు. అందుకని ఆయనను ఎవరూ ప్రశ్నించలేక పోయ్యారు. ఒక వైపు స్వాతంత్ర్య సమరంలో పాల్గొంటూ, మరొక వైపు స్వదేశీయులను సోదర భావంతో చూడలేని కుత్సిత బుద్ధి గల సంప్రదాయ ఛాందసవాది లోకమాన్య బాల గంగాధర తిలక్ అనే విషయం అందరూ గ్రహించాల్సి ఉంది. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్ర ఏపాటిదైనా, స్వదేశీయుల్ని విభజించి చూసే మనువాద భావజాలాన్ని ఆధునిక అభ్యుదయ వాదులందరూ ఖండిస్తారు. స్వయంగా ఆయన కుమారుడైన శ్రీధర్ పంత్ తిలకే సహించలేక పోయారు. వెనక్కి నడిచే తన తండ్రి ఆలోచనా విధానాన్ని త్యజించి, భావితరాలకు ముందుకు నడిపించే మార్గాల్ని ఎన్నుకున్నాడు.

మతం, దేవుడు వంటి వ్యక్తిగత విషయాల్ని రాజకీయాల్లోకి తెచ్చి, ఈ రోజు గణపతి విగ్రహాల్ని చెత్తకుండీల పక్కన పెట్టించి, ఐటమ్ సాంగ్స్‌కు డాన్సులు చేయిస్తున్న లోకమాన్యుడు ఈ తరానికి మాన్యుడేమీ కాదు. ఆయన కుమారుడు శ్రీధర్ తిలకే

> సంఘ సంస్కరణకు పూనుకున్నప్పుడు సమాజం తన రాతి గుండెతో స్పందిస్తుంది. దాని ఫలితాలు ఎంత తీవ్రంగా ఉంటాయంటే - మళ్ళీ ఎవరూ సంస్కరణ గురించి నోరెత్తడానికి కూడా వీల్లేనంతగా భయపెడతాయి. మనిషిని రాచి, రంపాన పెట్టి, హింసించే విషయంలో ప్రభుత్వాని కంటే సంఘానికే ఎక్కువ అవకాశాలు, ఎక్కువ మార్గాలూ ఉన్నాయి. అలాంటి మార్గాలు ఉపయోగించే ఈ సమాజం శ్రీధర్ తిలక్‌ను బలితీసుకుంది. అని అన్నారు అంబేద్కర్. తరతరాలుగా సమాజం మీద ఆధిపత్యం గల కులాలు తమ తోటి మానవుల మీద చేస్తున్న దౌర్జన్యాలను ఒక సామాజిక వైకల్యంగా చూడకుండా - ఒక గొప్ప సంప్రదాయంగా పరిగణిస్తూ దాన్నే తమ వారసులకు అందిస్తున్నారని- ఒక నిగూఢమైన, సున్నితమైన అంశాన్ని కూడా అంబేద్కర్ తన సంతాపంలో పొందుపరచారు.


మాన్యుడు! కాలం పెట్టిన పరీక్షలో తండ్రి బాల గంగాధర తిలక్ అపజయుడయితే - కొడుకు శ్రీధర్ తిలకే విజయుడయ్యాడు "లోకమాన్య" అనే బిరుదుకు అర్హులైన వారు ఎవరైనా ఉన్నారంటే - అది శ్రీధర్ పంత్ (బల్వంత్) తిలకే" అని అన్నారు. డా.బి.ఆర్. అంబేద్కర్. నిజమే! ప్రజా వ్యతిరేక విధానాలున్న వారికి ఇచ్చే బిరుదులు అనర్థదాయకం.-

శ్రీధర్ తిలక్ బ్రాహ్మణ వ్యతిరేకోద్యమాన్ని నడుపుతూ, బాల్య వివాహాల్ని ఆపడంలో, వైధవ్యంలో మగ్గుతున్న మహిళల సంక్షేమం చూడడంలో విశేషంగా కృషి చేశారు. ఆ విషయాల్లో ప్రబోధాంకర్ థాకరే, కేశవరావు జేధే ఆయనకు సహకరించారు. మరాఠా పత్రికలకు శ్రీధర్ తిలక్ సామాజిక అంశాల మీద చాలా వ్యాసాలు రాశారు. అవి 'మాజావ్యాసంగ్' శీర్షికతో పుస్తకంగా వచ్చింది. శ్రీధర్ పంత్ (బల్వంత్) తిలక్ కు శ్రీకాంత్ శ్రీధర్ తిలక్, జయంత్ శ్రీధర్ తిలక్ అని ఇద్దరు కొడుకులు వారిలో జయంత్ (1921-2001) రాజకీయాల్లోకి వచ్చారు. రాజ్యసభ మెంబర్‌గా, యం.ఎల్.సిగా కూడా ఉన్నారు. మహారాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ ఛైర్మన్‌గా పదహారేళ్ళ పాటు పనిచేశారు.

సంఘ సంస్కరణకు పూనుకున్నప్పుడు సమాజం తన రాతి గుండెతో స్పందిస్తుంది. దాని ఫలితాలు ఎంత తీవ్రంగా ఉంటాయంటే - మళ్ళీ ఎవరూ సంస్కరణ గురించి నోరెత్తడానికి కూడా వీల్లేనంతగా భయపెడతాయి. మనిషిని రాచి, రంపాన పెట్టి, హింసించే విషయంలో ప్రభుత్వాని కంటే సంఘానికే ఎక్కువ అవకాశాలు, ఎక్కువ మార్గాలూ ఉన్నాయి. అలాంటి మార్గాలు ఉపయోగించే ఈ సమాజం శ్రీధర్ తిలక్‌ను బలితీసుకుంది. అని అన్నారు అంబేద్కర్. తరతరాలుగా సమాజం మీద ఆధిపత్యం గల కులాలు తమ తోటి మానవుల మీద చేస్తున్న దౌర్జన్యాలను ఒక సామాజిక వైకల్యంగా చూడకుండా - ఒక గొప్ప సంప్రదాయంగా పరిగణిస్తూ దాన్నే తమ వారసులకు అందిస్తున్నారని- ఒక నిగూఢమైన, సున్నితమైన అంశాన్ని కూడా అంబేద్కర్ తన సంతాపంలో పొందుపరచారు.

ఈ అంశం నేటి సమకాలీన పరిస్థితులకు కూడా అన్వయించుకోవచ్చు. సనాతన ధర్మం - సంప్రదాయం - దేశభక్తి - హిందుత్వ- అంటూ దేశ ప్రజల్ని విభజిస్తున్న నేటి కేంద్ర ప్రభుత్వ చర్యల్ని వివేకవంతులు నిరసించాల్సి ఉంది. పనికొచ్చే మాట ఎవరు ఎప్పుడు ఏ సందర్భంలో చెప్పినా, దాన్ని స్వీకరించి ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉంటుంది. శ్రీధర్ పంత్ తిలక్ ను ఆదర్శంగా తీసుకుని, ఆధిపత్య కులాలలో ఉన్న విద్యావంతులు, మేధావులు - మనుషులందరూ సమానమే అన్న విషయం గ్రహించాలి! అదే విషయం ప్రచారం చేయాలి!! అంతే గానీ, అనవసరంగా మనోభావాలు దెబ్బతీసుకోగూడదు. ▪

- సుప్రసిద్ధ సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్ (మెల్బోర్న్ నుంచి)



> బ్రాహ్మణ సమాజంలోని పిడివాదులు, సనాతన వాదులు, కేసరి మరాఠా ట్రస్ట్ సభ్యులు మూకుమ్మడిగా పెట్టిన మానసిక హింస వల్ల, కోర్టు కేసుల వల్ల, ఏడేళ్ళు కోర్టుల చుట్టూ తిరిగి వేసారి పోవడం వల్ల శ్రీధర్ తిలక్ ఆత్మహత్యకు పూనుకుని ఉంటారు. ఒక ఛాందసుడిగా తన తండ్రి దారిలో నడిచి ఉంటే ఆయనకు ఆ పరిస్థితి వచ్చేది కాదు. ప్రవాహానికి ఎదురీదడం ఎప్పుడైనా కష్టమైన పనే, ధైర్యమైన పనే, తన ప్రత్యర్థులతో వీలైనంత వరకు పోరాడారు కానీ. ఏదో ఒక బలహీన క్షణాన ఆత్మహత్య చేసుకుందామన్న నిర్ణయానికి వచ్చారు. అలా జరగకుండా ఉండాల్సింది. సమాజం అందించిన అన్ని అర్హతలూ ఉండి, అగ్రవర్ణం వాడై ఉండి నిమ్న జాతుల గురించి, అంటరానితనం గురించి, అభ్యుదయ కాంక్షతో పని చేయడమే ఆయన ప్రాణం మీది కొచ్చింది.



భారత్ పరువు మంట కలిసింది

అవును భారత్ పరువు మంట గలిసింది. ఇదేదో నేను ప్రపంచకప్ క్రికెట్లో భారత్ ఓడిందని చెప్పడం లేదు. దేశ పరువు అంతర్జాతీయంగా మట్టి పాలైంది. ఒక వైపు టీవీ ఛానెల్స్ మోడీ మహాన్ అని ఊదరగొడుతుంటాయి. ఒకరేమో పలానా అధ్యక్షుడు మోడీ కాళ్ళ మొక్కాడని, ఇంకొకరేమో అమెరికా అధ్యక్షుడు మోడీతో చేయి కలపడానికి పరితపించి పోతున్నాడని, ఉక్రెయిన్, రష్యా యుద్ధం, మోడీ ఫోన్‌తో కొన్ని గంటల పాటు ఆగిందని (అక్కడ ఇరుక్కున్న భారతీయులని తేవడానికి) చెబుతాయి. అయితే ఆ తరువాత విదేశీ మంత్రాలయమే అలాంటిదేమీ లేదని వివరణ కూడా ఇచ్చింది. మరొకరేమో మోడీ ఉంటే ఏదైనా సాధ్యమే అనిచెవులు చిల్లులు పడేలా చెబుతుంటారు. కానీ అది వాస్తమేనా? కాదని వార్తలు చెబుతున్నాయి. నిజానికి జరిగిన దేమిటంటే నవంబర్ 23న రాజస్థాన్‌కు ఎన్నికలు జరిగాయి. అదే రోజు మన గౌరవనీయ ప్రధాని యుద్ధ విమా నం 'తేజస్' లో విహరించడానికి బెంగళూరులో ఉన్నారు. మన చానెల్స్ మాత్రం మోడీ 'తేజస్' ని నడుపుతారని పేర్కొన్నాయి. అసలు విమానం నడపడమే కష్టతరం. ఎంతో శిక్షణ ఉంటేనే అది సాధ్యమవుతుంది. అలాంటిది ఒక యుద్ధ విమానాన్ని నడపమంటే మాటలా? సరిగ్గా అదే రోజు శత్రువుల దాడికి గురై వీరమరణం పొందిన సైనికుల్లో ఒక కెప్టెన్‌కి బెంగళూరులోనే అంత్యక్రియలు జరుగుతున్నాయి. బెంగుళూరులోనే ఉన్న ప్రధానికి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఆ వీరుడి కుటుంబానికి, సాంత్వన పలకటానికి సమయం లేదు. కానీ తేజస్‌లో విహరించండానికి సమయముంది..

సరే అదంటుంచితే అదే రోజు అంతర్జాతీయంగా ఒక సంఘటన జరిగింది. ఐక్య రాజ్య సమితిలో ఒక భాగమైన యునెస్కోలో వోటింగ్ జరిగింది యునెస్కో అంటే ఐక్యరాజ్య విద్య, శాస్త్ర, సాంస్కృతిక సంస్థ. ఇది విద్య శాస్త్ర రంగాలతో పాటు సాంస్కృతిక రంగాలలో పని చేస్తుంది. ముఖ్యంగా పాత కట్టడాలు, దేవాలయాల గుర్తింపు. ఆగ్రా తాజ్‌మహల్, వరంగల్‌లోని రామప్ప దేవాలయం, తంజావూర్‌లోని బృహదీశ్వర ఆలయం, గుజరాత్‌లోని మెట్ల బావి, ఇవన్నీ కూడా యునెస్కో గుర్తింపు పొందినవే. ఇందులో 58 మంది సభ్యులుంటారు. ఒక అధ్యక్షుడితో పాటు వివిధ ప్రాంతాలను పర్యవేక్షించడానికి ఉపాధ్యక్షులు ఉంటారు. ఆసియా పసిఫిక్ ప్రాంతాల ఉపాధ్యక్షుడి కోసం 23 నవంబర్ 2023 నాడు ఓటింగ్ జరిగింది. పోటీలో ఇద్దరే ఉన్నారు ఒకరు భారత అభ్యర్థి అయితే మరొకరు పాకిస్తాన్ అభ్యర్థి. ఆసియా, పసిఫిక్ ప్రాంతాల పూర్తి బాధ్యత ఆ ఉపాధ్యక్షుడిదే. మీరేం అనుకుంటున్నారు... భారత్ గెలిచిందనుకుంటున్నారా?' అయితే పప్పులో కాలేసినట్లే. ఆ ఓటింగ్‌లో భారత్ ఓడిపోయింది. ఏదో మామూలుగా ఒకటి రెండు ఓట్లతో కాదు. అత్యంత ఘోరంగా 20 ఓట్ల తేడాతో ఓడిపోయింది. యునెస్కో వున్నా 58 మంది సభ్యుల్లో ఈ ఇద్దరు పోతే మిగిలిన ఓట్లు ఈ 56గురు ఓటేస్తే భారత దేశానికి 18 ఓట్లు ఒస్తే పాకిస్తాన్‌కి ఏకంగా 38 ఓట్లు పడ్డాయి. అంటే 20 ఓట్ల తేడా! ఇదీ మన భారత్ ప్రతిభ. ఈ విషయం ఏ మెయిన్ స్ట్రీమ్ న్యూస్ ఛానెల్‌లో లేదు. ఒకవేళ పత్రికల్లో వచ్చివుంటే మెయిన్ పేజీలో మాత్రం వచ్చి ఉండదు, లోపలి పేజీల్లో ఎక్కడో నాలుగైదు లైన్ల వార్తగా వచ్చి వుంటుంది.

తిండికి కూడా గతిలేని స్థితిలో ఉంది పాకిస్తాన్ అని మనం ఊదరగొడుతుంటాం. కానీ తిండిలేని పాకిస్తానే అంతర్జాతీయంగా మేనేజ్ చేసి ఏకంగా 38 ఓట్లు, మన కంటే 20 ఓట్లు ఎక్కువ పొందింది. దీన్నేమంటారు? మరో విషయం కూడా చెప్పుకోవాలి. నేపాల్, భూటాన్లు భారత్‌కి మిత్ర దేశాలుగా ఉండేవి. వాటికి భారతదేశం ఎంతో సహాయ సహకారాలు అందించింది. ఆదేశాలకి విద్యుత్తుని సప్లై చేసింది. ఆ దేశాల్లోని పర్వత ప్రాంతాల్లో (హిమాలయాల్లో) డ్యాంల నిర్మాణానికి ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని అందించింది. వాటికి కావాల్సిన నిత్యావసరాల వస్తువులు భారతదేశం నుండి వెళ్ళేవి. అలాంటి దేశాలు నేడు చైనా అంటకాగుతున్నాయి. అంతెందుకు వేలెడంత లేని దేశం మాల్దీవులకి, ఆహారధాన్యాలతో పాటు ఆదేశ రక్షణ కూడా భారతదేశానిదే. మాల్దీవులను ఆ చుట్టుపక్కల దీవులను రక్షించడానికి భారత్ సైన్యాలు అక్కడ ఉంటున్నాయి. ఈ మధ్యే అక్కడ ఎన్నికలు జరిగాయి. అయితే అక్కడ ఎన్నికలు జరిగిన తరువాత ఎన్నికైన అధ్యక్షుడు త్వరలోనే భారత సైన్యాలను వెనక్కి పంపే ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పాడు. ఇది దేనికి నిదర్శనం. భారత పరువు పెరిగిందా.. లేక తరిగిందా?

ఈ మధ్య ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ప్రశ్న వైరల్ అయింది. అదేమిటంటే... మోడీ చేయలేనిది ఏమిటీ అని... దానికి జవాబుగా ఓ పెద్ద లిస్టే ఉంది. అందులో కొన్ని... మోడీ ప్రెస్ కాన్ఫరెన్స్ చేయలేరు, భారత ఆర్థిక వ్యవస్థని సరిదిద్ద లేరు. ధరలు తగ్గించలేరు, ఇజ్రాయెల్ పాలస్తీనా యుద్ధం ఆపలేరు. ఇలాంటివే ఒక చాంతాడంత ఉంది. ఇదీ మన మోడీ మహాన్ మహిమ. ▪

సేకరణ: జయప్రకాష్
8374851426

ప్రజల్ని చూడండి- అంకెలను కాదు

- అరుణ్ మైరా

భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొనేది అభివృద్ధి సమస్య కాదు, ఆదాయాల సమస్య. తగినంతగా ఆదాయాలు పెరగడం లేదు. అధిక సంఖ్యాకులకు అవి నిలకడగా లేవు. మొత్తం మీద స్థూల జాతీయ ఆదాయ అభివృద్ధి జరుగుతున్నా కూడా కులం, మతంతో సంబంధం లేకుండా ఆర్థిక బలహీనులకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఉండాలని ఒత్తిడి పెరుగుతోంది. ప్రభుత్వానికి అనుకూలంగా, వ్యతిరేకంగా ఉన్న ఆర్థికవేత్తలు ఆర్థిక వ్యవస్థ సరిపోయినన్ని ఉద్యోగాలు సృష్టిస్తున్నదా లేదా అని చర్చిస్తున్నారు. ప్రభుత్వ గణాంకాల్లో వున్న వాస్తవాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇంతకు ముందున్న ప్రభుత్వం కాకుండా ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగానే అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో తగినన్ని ఉద్యోగాలు సృష్టి కావడం లేదని ప్రభుత్వ వ్యతిరేక ఆర్థికవేత్తలు చెప్తున్నారు. గణాంకాలు సమస్యను వివరించలేవని, సరైన పరిష్కారాలు చూపించలేవని అంటున్నారు.

అమెరికా ఆర్థిక వ్యవస్థ

అమెరికా ఆర్థిక వ్యవస్థ గణాంకాలను చూస్తే అంతా బాగున్నట్లు అనిపిస్తుంది. కానీ అత్యధిక మంది ప్రజానీకం ఆర్థిక వ్యవస్థ పట్ల అసంతృప్తితో ఉన్నారు. వచ్చే సంవత్సరం నవంబర్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల సందర్భంలో ఇదో పెద్ద సమస్య కానుంది. తమ యజమానుల నుండి సరైన వేతన సవరణ కావాలంటూ సమ్మెలో ఉన్న మోటారు రంగ కార్మికుల దగ్గరకెళ్ళి అమెరికా అధ్యక్షుడు సంఘీభావం తెలపాల్సిన పరిస్థితి వచ్చింది. కార్మికులు తమకు న్యాయమైన ఒప్పందం కావాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమ ఆదాయాలకు రక్షణ కావా లన్నారు. మోటారు కంపెనీల అధిపతులు అత్యధిక స్థాయిలో వేతనాలు తీసుకుంటూ పోటీని తట్టుకునేందుకు తాము త్యాగాలు చేయాలని చెప్పటాన్ని విమర్శించిన కార్మికులతో అధ్యక్షుడు ఏకీభవించారు.

అవి మంచి ఉద్యోగాలు కావు

ఆర్థికవేత్తల ప్రకారం భారతదేశంలో ఉన్న ఆదాయాల సమస్య ఏమంటే వ్యవసాయం నుండి పారిశ్రామిక రంగం వైపు సరిపడినంతగా ప్రజలు తరల లేదు. భారతదేశ విధానకర్తలు 1990వ దశకంలో దగ్గర దారి కనిపెట్టామని భావించారు. వ్యవసాయ రంగం నుండి నేరుగా సర్వీసు రంగాన్ని అభివృద్ధి చేయాలనుకున్నారు. అమెరికా, చైనాల మాదిరిగా నిలకడైన అభివృద్ధి వైపు ఆలోచించలేదు. సమాచార సాంకేతిక రంగం నుండి ఎగుమతుల ద్వారా ఆర్థిక వ్యవస్థకు ఊపును తెచ్చారు. ఈ దగ్గర దారి విఫలమైంది. భారతదేశంలో వున్న అత్యధిక యువతను ఈ అత్యున్నత స్థాయి రంగం తనలో ఇముడ్చుకోలేదు. ఈ రంగంలో పని చేయాలంటే అధిక స్థాయి విద్య ఉండాలి. ఇది గ్రామీణ ప్రజలకు లేదు. వ్యవసాయం నుండి బయటకు వచ్చినపుడు వారి శక్తి సామర్థ్యాలకు తగిన ఉపాధి కావాలి. అక్కడి నుండి నిచ్చెన మెట్లు ఎక్కాలంటే అధిక నైపుణ్యాలను నేర్చుకుని అధిక ఆదాయం సంపాదించగలిగే ఉద్యోగాలు వారికి కావాలి. మొదటి అంచెలో శ్రమ తీవ్రత ఉండే ఉత్పాదక, సర్వీసు, నిర్మాణ రంగాలు ఆ అవకాశం కల్పిస్తాయి. వ్యవసాయ రంగం నుండి బయటకు వచ్చిన లక్షల మంది అటువంటి ఉద్యోగాల్లోకి ప్రవేశించారు. సమస్య ఏమంటే రంగంతో సంబంధం లేకుండా వారికి దొరికిన ఉద్యోగాలు అంత మంచివి కావు. వేతనాలు సరిగా ఉండవు. పైగా వారికి దొరికేది తాత్కాలిక లేదా కాంట్రాక్ట్ ఉద్యోగాలు మాత్రమే. సామాజిక భద్రత ఉండదు. నైపుణ్యాలు పెంచుకునేందుకు సహాయం ఉండదు. భారీ, ఆధునిక మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమల్లో కూడా కాంట్రాక్టర్ల ద్వారానే నియామకాలు జరుగుతున్నాయి. యజమానులు తమ ఖర్చును తగ్గించుకుంటున్నారు. పర్మినెంట్ కార్మికుల కంటే చాలా తక్కువగా వేతనాలు చెల్లిస్తున్నారు. వారి ఉపాధికి రక్షణ లేదు. ప్రపంచం ఒక మూల మలుపులో ఉంది. ఆర్థిక రంగంలో కొత్త ఆలోచనలు రావాలి. పర్యావరణ సహితమైన, సామాజిక సామరస్యమైన భవిష్యత్తును సృష్టించాలి. ఆ ఆలోచనల ప్రకారం అభివృద్ధిని, ఉద్యోగితను లెక్కించాలి. పనికి సంబంధించిన కొత్త భావాలు కావాలి. పని చేసే సంస్థల రూపకల్పన కూడా జరగాలి. ఈ సంస్థల్లో భాగస్వాముల మధ్య ఉండాల్సిన ఆర్థిక, సామాజిక సంబంధాలను కూడా మదింపు చేయాలి. పర్యావరణం పట్ల శ్రద్ధ పెరిగితే మరలా చిన్న సంస్థల అభివృద్ధి జరుగుతుంది.స్థిర పెట్టుబడిని పెంచి వేతనాల ఖర్చును తగ్గించుకునే భారీ సంస్థలకు బదులుగా వివిధ సంస్థలు తమ అభివృద్ధి కోసం ఒక దానికి మరోటి సహాయపడేవి నిలకడగా అభివృద్ధి చెందాలి. ప్రపంచంలోని దూరపు ప్రాంతాల వినిమయదారుల కోసం జరిగే ఉత్పత్తులకు బదులుగా స్థానిక వినిమయానికి, మార్కెట్లకు ఉత్పత్తి జరిగితే స్థానిక పరిశ్రమలు అభివృద్ధి అవుతాయి.

> ఆర్థిక సామర్థ్యాలు, మిగులును సష్టించే కార్పొరేట్ సంస్థ లకు బదులుగా వాస్తవ సామాజిక సంస్థలను సష్టించే వైపు దష్టి మరల్చాలి. సహాయకులు చేసే పనికి ఆర్థికవేత్తలు అధిక విలువ కట్టాలి. సాంప్రదాయకంగా కుటంబ సేవలో ఉన్న మహిళలు పరిశ్రమలు, కార్యాలయాలు, మాల్స్ వైపు తరలించబడుతున్నారు. వేతనాల కోసం సంఘటిత రంగంలో పనిచేసే మహిళల పనికి మాత్రమే ఆర్థికవేత్తలు విలువ కడుతున్నారు. సంపాదన కోసం ఇతరుల ఇళ్లల్లో సహాయకులు చేసే పని లేదా కుటుంబ వ్యవసాయ క్షేత్రాల్లో చేసే అసంఘటిత పనికి విలువ లెక్కించడం లేదు. తమ కుటుంబీకుల సేవలో ఉన్న మహిళల పనిలో ఉన్న విలువను చూడటం లేదు.



సహాయకుల సేవలకు విలువ కట్టాలి

ఆర్థిక సామర్థ్యాలు, మిగులును సృష్టించే కార్పొరేట్ సంస్థలకు బదులుగా వాస్తవ సామాజిక సంస్థలను సృష్టించే వైపు దృష్టి మరల్చాలి. సహాయకులు చేసే పనికి ఆర్థికవేత్తలు అధిక విలువకట్టాలి. సాంప్రదాయకంగా కుటుంబ సేవలో ఉన్న మహిళలు పరిశ్రమలు, కార్యాలయాలు, మాల్స్ వైపు తరలించబడుతున్నారు. వేతనాల కోసం సంఘటిత రంగంలో పనిచేసే మహిళల పనికి మాత్రమే ఆర్థికవేత్తలు విలువ కడుతున్నారు. సంపాదన కోసం ఇతరుల ఇళ్లల్లో సహాయకులు చేసే పని లేదా కుటుంబ వ్యవసాయ క్షేత్రాల్లో చేసే అసంఘటిత పనికి విలువ లెక్కించడం లేదు. తమ కుటుంబీకుల సేవలో ఉన్న మహిళల పనిలో ఉన్న విలువను చూడటం లేదు. సంఘటిత ఆర్థిక సంస్థలుగా ఉన్న కార్పొరేట్ సంస్థలకు అనుకూలించే విధంగా సామాజిక సంస్థలను వక్రీకరించే ఆర్థిక సిద్ధాంతాలు ప్రస్తుతం చలామణిలో ఉన్నాయి. మానవులు ఒకరికొకరు సహాయపడటం తగ్గిపోయి డబ్బు ప్రధానంగా ఉన్న ఆర్థిక వ్యవస్థ పెరుగుతోంది. ఇరవయ్యవ శతాబ్దపు ఆర్థికాభివృద్ధి భావనలోకి మరింత కాలం పాటు ఆర్థికాభి వృద్ధి, ఉద్యోగిత కొలమానాలు కూరుకుపోకూడదు. మనకు భవిష్యత్తులో అవసరమయ్యే పని రూపాలు సంస్థల్లో ప్రతిబింబించే విధంగా వాటిని సంస్కరించాలి. కార్మికులు, చిన్నరైతులు, చిన్న పెట్టుబడిదారులు, మహిళలకు ప్రస్తుత ఆర్థిక నమూనా విలువ ఇవ్వడం లేదు. వారు చెప్పేది వినే విధంగా విధాన రూప ప్రక్రియ వైపు మరలాలి. ప్రస్తుతం అధి కారంలో ఉన్న ఆర్థిక నిపుణులు, పెద్ద ఆర్థిక సంస్థలు, బడా వ్యాపార కార్పొరేషన్లు వారి భావాలను కొట్టివేస్తున్నాయి. భవిష్యత్తులో మంచి విధానం కోసం చారిత్రక గణాంకాలకు బదులుగా తాము ఎదుర్కొనే సమస్యల గురించి ప్రజలు చెప్పే వాటిని వినాలి. ▪

('ది హిందూ' సౌజన్యంతో స్వేచ్ఛానుసరణ)

రాష్ట్రంలో పోలింగ్ 63.94 శాతం

గురువారం సాయంత్రం 5 గంటల వరకు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



గురువారం సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రంలో 63.94 శాతం నమోదయింది. అత్యధికంగా మెదక్ జిల్లాలో 80.28 శాతం, అత్యల్పంగా హైదరాబాద్‌లో 39.97 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఉన్నవారిని ఓటు వేసేందుకు అధికారులు అనుమతించారు. దీంతో పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. అందువల్ల పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశమున్నది.

జిల్లాల వారీగా ...పోలింగ్ శాతం ఇలా..

ఆదిలాబాద్ - 73.58 శాతం	భద్రాద్రి - 66.37
హనుమకొండ - 62.46	హైదరాబాద్ - 39.97
జగిత్యాల -74.87	జనగామ - 80.23
భూపాలపల్లి - 76.10	గద్వాల - 73.60
కామారెడ్డి - 71.00	కరీంనగర్ - 69.22
ఖమ్మం - 73.77	కుమురం భీం - 71.63
మహబూబాబాద్ - 77.50	మహబూబ్ నగర్ - 73.70
మంచిర్యాల - 70.71	మెదక్ - 80.28
మేడ్చల్ మల్కాజిగిరి - 49.25	ములుగు - 75.02
నాగర్ కర్నూల్ - 70.83	నల్లగొండ -75.72
నారాయణపేట - 67.70	నిర్మల్ - 71.47
నిజామాబాద్ - 68.30	పెద్దపల్లి 69.83
రాజన్న సిరిసిల్ల - 71.87	రంగారెడ్డి - 53.03
సంగారెడ్డి 73.83	సిద్ధిపేట - 77.19
సూర్యాపేట - 74.88	వికారాబాద్ - 69.79
వనపర్తి - 72.60	వరంగల్ - 73.04
యాదాద్రి భువనగిరి -78.31 శాతం	

ఓటేసిన ప్రజలందరికీ ధన్యవాదాలు

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కోడ్‌ను ఉల్లంఘించాయి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల్లో ఓటేసిన ప్రజలందరికీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన ఆ పార్టీ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఎన్నికల అనంతరం గురువారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు విశేషంగా కృషి చేశారని తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కోడ్ ఉల్లంఘించి మరీ డబ్బులు, మద్యం పంచాయని ఆరోపించారు. ఈ విషయంలో ఎన్నికల సంఘం మరింత కఠినంగా వ్యవహరించాల్సి ఉండేదని అభిప్రాయపడ్డారు. పోలీసులు బీఆర్ఎస్‌కు అనుకూలంగా పనిచేశారని ఆరోపించారు. వారి ముందే విచ్చల విడిగా మద్యం, డబ్బు పంపిణీ జరిగినా చూసీచూడనట్టు వ్యవహరించారని విమర్శించారు. అనేక నియోజకవర్గాల్లో బీజేపీ కార్యకర్తలపై దాడులు జరిగాయనీ, అయినా ధైర్యంగా ఎదుర్కొని, ఎన్నికల్లో ముందుకు వెళ్లారని చెప్పారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద జరిగిన ఘటనను ఖండించారు. దుందుడుకు విధానంతో ఏపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు సరికాదన్నారు. ఏకపక్షంగా ప్రాజెక్టు గేట్లు ఎత్తి సాగర్ నీళ్ల తరలించడం సరైన పద్ధతికాదని చెప్పారు. ఎన్నికల వేళ రాజకీయ లబ్ది కోసం బీఆర్ఎస్, వైసీపీ పార్టీలు కుట్రతో చేశాయని ఆరోపించారు. శాంతి భద్రత సమస్య రాకుండా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకునేలా లేఖ రాయాలని అనుకుంటున్నానని చెప్పారు.

నిర్మాణ కార్మికుల భద్రతే ముఖ్యం

ఉత్తరాఖండ్ టన్నెల్ ప్రమాదంపై విచారణ జరపాలి

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ప్రధాని, సీఎంలకు సీడబ్ల్యూఎఫ్ఐ లేఖ

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో టన్నెల్ కూలిపోయిన ప్రమాదం నుంచి 41 మంది కార్మికులు సురక్షితంగా బయటపడటంపై సిఐటియు, కనస్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సిడబ్ల్యూఎఫ్ఐ) హర్షం వ్యక్తం చేశాయి. ప్రమాద ఘటనలో భద్రతా ఉల్లంఘనలను ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి ధామికి సిడబ్ల్యూఎఫ్ఐ లేఖ రాసింది. ఈ ప్రమాదంపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని, ప్రమాదానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. అవసరమైన భద్రతా చర్యలు తీసుకోకుండా ఎలాంటి నిర్మాణ పనులను అనుమతించవద్దని పేర్కొంది. తమ డిమాండ్లపై డిసెంబర్, జనవరిల్లో దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని సిడబ్ల్యూఎఫ్ఐ నిర్ణయించింది. ఈ ప్రచారంలో భాగంగా సిడబ్ల్యూఎఫ్ఐ అన్ని అనుబంధ సంఘాలు కూడా శుక్రవారం ప్రధాని, ముఖ్యమంత్రికి లేఖలు పంపనున్నాయి.

కార్మికులను రక్షించడంలో ర్యాట్ మైనర్ల చిత్తశుద్ధిని సిఐటియు, సిడబ్ల్యూఎఫ్ఐ అభినందించాయి. టన్నెల్ ప్రమాద ఘటన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు సరైన రక్షిత చర్యలు తీసుకోవడంలో వైఫల్యంపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతుందని పేర్కొన్నాయి.

అధికారుల, నిర్మాణ సంస్థల నిర్లక్ష్యం కారణంగా జరుగుతున్న ప్రమాదాల జాబితాలో ఈ టన్నెల్ కూలిపోయిన ప్రమాదం ఒకటని తెలిపాయి. ప్రభుత్వ మౌలిక సదుపాయాల నిర్వహణను ప్రైవేట్ కార్పొరేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడం వల్ల కలిగే వినాశకరమైన పరిణామాలను ఈ ప్రమాదం మరోసారి బహిర్గతం చేసిందని పేర్కొన్నాయి.

నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ నిర్మిస్తున్న కొన్ని ప్రాజెక్టుల్లో ఇటీవల ప్రమాదాలు చోటుచేసుకోవడంతో ఆ సంస్థపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినా, ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించాయి.

దీనిని బట్టి అదానీ గ్రూప్ మాదిరిగానే నవయుగ కూడా మోడీ ప్రభుత్వానికి అభిమాన సంస్థగా మారిందని అర్థమవుతోందని తెలిపింది.ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నష్టపరిహార నిధి ప్రారంభం !

తొలి రోజునే ఆమోదించిన కాప్ 28 సదస్సు



దుబాయ్ : గ్లోబల్ వార్మింగ్ కారణంగా సంభవిస్తున్న ప్రకృతి విపత్తులతో తీవ్ర నష్టాలను, కష్టాలను ఎదుర్కొంటున్న పేద దేశాలు ఎన్నాళ్ళగానో డిమాండ్ చేస్తున్న 'నష్టపరిహార నిధి'ని ఇక్కడ జరుగుతున్న కాప్ 28 సదస్సు లాంఛనప్రాయంగా ప్రారంభించింది.

"ఈనాడు మనం చరిత్రను సృష్టించాం." అని యుఎఇ కాప్ 28 అధ్యక్షుడు సుల్తాన్ అల్ జబర్ ప్రతినిధులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ నిధికి తమ దేశం 100మిలియన్ల డాలర్లను అందచేస్తుందని ప్రకటించారు. జర్మనీ కూడా వంద మిలియన్ల డాలర్లను ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ అంశంపై ఏళ్ళ తరబడి వెనుకడుగు వేస్తూ వచ్చిన సంపన్న దేశాలు గతేడాది ఈజిప్టులో జరిగిన కాప్27 సదస్సులో చారిత్రాత్మకమైన ఒప్పందాన్ని కుదుర్చుకుని నిధికి మద్దతిచ్చారు.

గురువారం సదస్సు ప్రారంభమైన వెంటనే, నిధి రూపురేఖలు, అనుసరించాల్సిన పద్ధతులు వంటి అంశాలపై చర్చలు జరిగాయి. తాత్కాలికంగా ఈ మొత్తాన్ని ప్రపంచ బ్యాంక్‌లో వుంచాలని నిర్ణయించారు. "ఇది యావత్ ప్రపంచానికి, మన కృషికి సానుకూలమైన సంకేతాలను పంపిస్తోంది.' అని జబర్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు జరిగిన కాప్ సదస్సులో మొదటి రోజు సమావేశాల్లోనే ఇంత వేగంగా నిర్ణయాన్ని ఆమోదించడం ఇదే మొదటిసారని అన్నారు.

ఇదొక విశిష్టతను సంతరించుకుందని అన్నారు. మనం, కాప్ 28 సదస్సు అవసరమైన చర్యలు తీసుకోగలదనడానికి ఇదే నిదర్శనమని అన్నారు.

వర్ధమాన దేశాలకు ఆర్థిక, సాంకేతిక తోడ్పాటు అందాలి : ప్రధాని మోడీ

వాతావరణ మార్పులపై కార్యాచరణ, సుస్థిర అభివృద్ధిపై తీసుకోవాల్సిన పలు నిర్దిష్టమైన చర్యలు న్యూఢిల్లీ లీడర్స్ డిక్లరేషన్‌లో వున్నాయని, ఈ అంశాలపై కాప్ 28లో ఏకాభిప్రాయం కోసం ఎదురుచూస్తున్నట్లు ప్రధాని మోడీ పేర్కొన్నారు. కాప్ 28 సదస్సులో పాల్గొనేందుకు ఆయన దుబాయ్‌కు బయలుదేరే ముందు మాట్లాడారు. పారిస్ ఒప్పందం పరిధిలో జరిగిన పురోగతిని సమీక్షించే అవకాశం ఈ సదస్సు కల్పిస్తుందని అన్నారు. వాతావరణ మార్పులపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు మార్గనిర్దేశనం చేస్తుందన్నారు.

భారత్ ఏర్పాటు చేసిన గ్లోబల్ సౌత్ సమ్మిట్‌లో సమానత్వం, వాతావరణ న్యాయం, ఉమ్మడి బాధ్యతలు వంటి సూత్రాల ప్రాతిపదికన కార్యాచరణను రూపొందించాల్సిన అవసరం గురించి వర్ధమాన, పేద దేశాలు నొక్కి చెప్పాయని మోడీ పేర్కొన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు వర్ధమాన దేశాలు చేసే కృషికి తగిన తోడ్పాటు అందడం ముఖ్యమని, ఆర్థిక వనరులను కల్పించడం, సాంకేతికత బదిలీ వంటి అంశాల్లో చేయూతనివ్వాల్సి వుందన్నారు.

బిజినెస్

జీడీపీ 7.6 శాతం పెరుగుదల

- తయారీ, నిర్మాణ రంగాల మద్దతు
- సెప్టెంబర్ త్రైమాసికం గణాంకాల వెల్లడి



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో భారత స్థూల దేశీయోత్పత్తి (జీడిపి) 7.6 శాతం పెరిగింది. ఆర్‌బిఐ వేసిన 6.5 శాతం అంచనా కంటే ఎక్కువ. తయారీ, నిర్మాణ రంగాలు మెరుగైన ప్రగతిని కనబర్చాయని కేంద్ర గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఒ) గురువారం వెల్లడించిన రిపోర్టులో పేర్కొంది. గతేడాది ఇదే త్రైమాసికంలో 6.2 శాతం వృద్ధి చోటు చేసుకోగా.. గడిచిన ఏప్రిల్ - జూన్ త్రైమాసికంలో 7.8 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. దీంతో పోల్చితే స్వల్పంగా తగ్గినట్లయ్యింది. 2011-12 స్థిర ధరల ప్రకారం.. గడిచిన క్యూ2లో స్థూల దేశీయోత్పత్తి రూ.41.74 లక్షల కోట్లుగా నమోదయ్యింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.38.78 లక్షల కోట్లుగా ఉంది.

సెప్టెంబర్ త్రైమాసికంలో భారత జిడిపి 6.5 శాతం చోటు చేసుకోవచ్చని అక్టోబర్‌లో జరిగిన మానిటరీ పాలసీలో ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అంచనా వేశారు. ఏడాదికేడాదితో పోల్చితే తయారీ రంగం 13.9 శాతం వృద్ధిని కనబర్చింది. ఇంతక్రితం త్రైమాసికంలో రంగం 4.7 శాతం పెరుగుదలను నమోదు చేసింది. ఇదే సమయంలో 7.9 శాతం పెరుగదల చూపిన నిర్మాణ రంగం.. గడిచిన క్యూ2లో 13.2 శాతం వృద్ధిని సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థంలో వాస్తవ జిడిపి 7.7 శాతం వృద్ధితో రూ.82.11 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది. గతేడాది ఇదే కాలంలో రూ.76.22 లక్షల కోట్ల వాస్తవ జిడిపి నమోదయ్యింది.

టాటా టెక్ బంఫర్ లిస్టింగ్

140 శాతం ప్రీమియంతో ప్రవేశం



ముంబయి : టాటా గ్రూపు నుంచి దాదాపు 19 ఏళ్ళ తర్వాత లిస్టింగ్‌కు వచ్చిన టాటా టెక్నాలజీస్ లిస్టింగ్ తొలి రోజే అదరగొట్టింది. గురువారం ఉదయం 140 శాతం ప్రీమియంతో స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించింది. తుదకు 165 శాతం లాభంతో రూ.1,325 వద్ద ముగిసింది. టాటా టెక్నాలజీ ఇష్యూ ధర రూ.500గా నిర్ణయించింది. లిస్టింగ్‌కు వచ్చిన తొలి రోజే రూ.1,200 వద్ద ప్రారంభమయ్యింది. దీంతో ఒక్కో షేరుపై లిస్టింగ్‌లోనే ఇన్వెస్టర్లకు రూ.700 రాబడిని ఇచ్చింది. ఇష్యూలో షేర్లు దక్కిన వారు 30 షేర్లు కలిగిన ఒక్కో లాట్‌పై రూ.21వేల లాభాన్ని పొందారు. ఒక్క లాట్ కోసం రూ.15వేలు పెట్టుబడి పెట్టారు. దీంతో లిస్టింగ్ రోజున అత్యధిక రాబడులు ఇచ్చిన సంస్థల జాబితాలో ఏడో స్థానంలో నిలిచింది. ఈ ఇష్యూలో ద్వారా రూ.3042.5 కోట్లు సమీకరించాలని ఆ కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. కాగా రూ.1.5 లక్షల కోట్ల విలువ చేసే బిడ్డింగ్‌లు రావడం విశేషం. టాటా మోటార్స్‌కు చెందిన టాటా టెక్నాలజీస్ ఇంజినీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ డిజిటల్ సర్వీసెస్ సంస్థ, జాగ్వార్ ల్యాండ్‌రోవర్ సహా టాటా గ్రూప్‌లోని పలు సంస్థలకు ఇది ప్రధానంగా సేవలందిస్తోంది. ఈ ఐపిఒలో భాగంగా టాటా మోటార్స్ 11.4 శాతం వాటాకు సమానమైన షేర్లను విక్రయించింది.

యుపిఐ చెల్లింపుల్లోకి ఓలా

బెంగళూరు : ప్రముఖ క్యాబ్ అగ్రిగేటర్ ఓలా కొత్తగా యుపిఐ చెల్లింపుల్లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. తమ వినియోగదారులు ఇకపై ఓలా యాప్‌లోనే డిజిటల్ చెల్లింపులు చేయవచ్చని ఓలా సహ వ్యవస్థాపకుడు భవీష్ అగర్వాల్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. యాప్‌లో యుపిఐ పేమెంట్స్ ఫీచర్‌ని ఆ సంస్థ జత చేసింది. దీంతో యాప్ ద్వారానే క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి నగదు చెల్లించవచ్చని ఓలా పేర్కొంది. ఈ ఫీచర్ మొదట బెంగళూరులో అందుబాటులో తీసుకురానున్నట్లు ప్రకటించింది. ఈ ఏడాది ముగిసే నాటికి దేశ వ్యాప్తంగా అన్ని నగరాలకు విస్తరించనున్నట్లు వెల్లడించింది.

టొయమ్ స్పోర్ట్స్‌కు రూ.1.92 కోట్ల రెవెన్యూ

హైదరాబాద్ : స్పోర్ట్స్ ప్రమోషన్, మేనేజ్‌మెంట్ సంస్థ టోయమ్ స్పోర్ట్స్ 2023-24 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో రూ.1.92 కోట్ల నికర ఆదాయాన్ని ఆర్జించినట్లు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.8.4 లక్షల రెవెన్యూతో పోల్చితే 2195.71 శాతం వృద్ధిని సాధించినట్లు తెలిపింది. క్రితం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.1.40 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. గడిచిన క్యూ2లో కంపెనీ నికర లాభాలు రూ.1.39 కోట్లకు చేరాయి.. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.8.88 కోట్ల నికర నష్టాలు చవి చూసింది. ఈ సంస్థ రూ.50 కోట్ల నిధుల సమీకరణ చేయనున్నట్లు ఇటీవల ఆ సంస్థ ప్రకటించింది.

నాగార్జునసాగర్ 'రాజకీయం'

మార్గదర్శకాలకు విరుద్ధంగా కృష్ణాజలాల తరలింపు

- గేట్ల ఆక్రమణ
- చప్పుడులేని తెలంగాణ సర్కారు
- నోరుమెదపని కేంద్రం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నాగార్జునసాగర్‌లోని కృష్ణాజలాలను మార్గదర్శకాలకు విరుద్ధంగా ఏపీ సర్కారు తరలించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారీగా పోలీసులను మోహరించి బలప్రయోగం చేయడం చర్చనీయాంశమవుతున్నది. ఇంత జరుగుతున్నా ఇటు తెలంగాణ ప్రభుత్వం స్పందించలేదు. సాగునీటి శాఖ నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నది. అటు కేంద్రం సైతం అలాగే ఉంది. 1969లో ఇచ్చిన జీవో 69 ప్రకారం ఒక ఒప్పందం జరిగింది. దాని ప్రకారం నాగార్జునసాగర్‌లోని కృష్ణాజలాలను తెలుగురాష్ట్రాలు వాడుకోవాలి. కానీ ప్రస్తుతం అందుకు భిన్నంగా ఏపీ ప్రభుత్వం దూకుడుగా వ్యవహరించడం సరికాదని సాగునీటిరంగ నిపుణులు చెబుతున్నారు. నాగార్జునసాగర్ డ్యాం నిర్వహణ అధికారాలు తెలంగాణ ప్రభుత్వానివే. అయితే రెండేండ్ల క్రితం కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) తెలుగు రాష్ట్రాల్లోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను కృష్ణా నదీజలాల యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి అప్పగించాలని ఆదేశించింది. తాగునీటి పేర వ్యవసాయభూములకు నీటిని తరలించేందుకు ఏపీ సర్కారు ప్రయత్నించిందనేది ప్రధాన అరోపణ. ఇందుకు తెలంగాణ ప్రభుత్వం సహకరించిందనేది ఇంకో విమర్శ. డ్యాం గేట్లను ఆక్రమించేందుకు ఏపీ సర్కారు పోలీసులతో దాడి చేయడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకుంది. తెలంగాణ అధికారులు డ్యామ్‌పై విద్యుత్ సరఫరాను నిలిపిస్తే, ఏపీ వైపు ఉన్న ప్రాంతంలో కరెంటు అందుబాటులో ఉంది. అంటే అప్పటికే విద్యుత్ సరఫరా ఆగిపోతే సమస్యలు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం వెనుక పెద్ద కుట్రే ఉందనే విమర్శలు ఉన్నాయి. హెచ్‌టీ లైన్ల ద్వారా అక్కడ కరెంటు సరఫరా జరుగుతున్నది. ముందస్తు ప్లాన్ ప్రకారమే ఈ వ్యవహారం నడిచిందని అంటున్నారు. ఈ ఘటన జరిగి దాదాపు ఒక రోజు గడుస్తున్నా ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచిగానీ, సాగునీటి శాఖ ఉన్నతాధికారులు గాని స్పందించలేదు. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆదేశాలు ఇవ్వలేదు. అలాగే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన సీడబ్ల్యూసీ, ఎన్‌డీఎస్ఏ గానీ స్పందించలేదు. నిజానికి ఈ సంవత్సరంలో వర్షాలు సరిగ్గా రాకపోవడంతో నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లోకి నీరు రాలేదు. 510 అడుగులపైన నీరుంటేనే వాడుకోవడానికి ఉంటుంది. ఇందులో 130 అడుగులు డెడ్‌స్టోరేజీ. వీటిని వాడుకోవడానికి వీలుకాదు.

కేవలం తాగునీట కోసం పరిస్థితులను బట్టి కేఆర్ఎంబీ అనుమతితో మాత్రమే తీసుకోవాలి. . సున్నితమైన విషయాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు వాడుకోవడం ఎంతమాత్రం సహించరాదనే మాటలు వినిపిస్తున్నాయి. భారీగా పోలీసులను మోహరించి గురువారం 2000 క్యూసెక్కుల నీటిని ఏపీ ప్రభుత్వం తరలించిందని అంటున్నారు. ఇలా ఆరు రోజులపాటు నీళ్లు వదిలితే, ఒక్క టీఎంసీని వాడుకున్నట్టు అవుతుందని చెబుతున్నారు. ఇప్పటికే 11 గేట్లను ఆక్రమించడం. 13వ గేటు కూడా మా పరిధిలోకి వస్తుందనడం మార్గదర్శకాలను ఉల్లంఘించడమే అవుతుందని సమాచారం. గతంలో తెలంగాణ కూడా తాగునీటి అవసరాల కోసం సాగర్ నుంచి తీసుకుంది. కానీ, కేఆర్ఎంబీ అనుమతితోనే. ఈ తరహా ఘటనే 2015, ఫిబ్రవరి 13న చోటుచేసుకున్న సంగతి అందరికి తెలిసిందే. ఈ విషయమై సాగునీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్‌ను, నాగార్జునసాగర్ సీఈ అజయ్‌కుమార్‌ను ఫోన్లో వివరణ కోరే ప్రయత్నం చేయగా, అందుబాటులో లేరు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు

3వ తేదీ వరకు మూడంచెల భద్రత

- పోలింగ్‌ను ప్రశాంతంగా ముగించినందుకు పోలీసులకు డీజీపీ అభినందనలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో అసెంబ్లీ పోలింగ్ పర్వం ముగియటంతో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 35,655 పోలింగ్ స్టేషన్లలో ఓటింగ్ పర్వం గురువారం సాయంత్రం వరకు ముగియటంతో సీల్ వేసిన ఈవీఎంలను ముందు నిర్ణయించిన ఆయా జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లలోని స్ట్రాంగ్‌రూమ్‌లకు సాయుధ ఎస్కార్ట్‌తో పోలీసు అధికారులు తరలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24 గంటల పాటు కేంద్ర బలగాలతో కూడిన సెక్యూరిటీని అధికారులు ఏర్పాటు చేశారు.

ఆ ప్రాంతంలో చీమ చిటుక్కుమన్నా పసిగట్టేలా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు అనుసంధానం చేశారు. ఈ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కూడా ఓట్ల లెక్కింపు జరిగే డిసెంబర్ 3వ తేదీ వరకు మూడంచెల భద్రతా వ్యూహాన్ని అమలు చేస్తున్నారు.

పోలీసు కమిషనర్లు, ఎస్పీలతో డీజీపీ సమీక్ష

స్ట్రాంగ్ రూమ్‌ల పరిధులలో 24 గంటల పాటు పోలీసు గస్తీని కూడా ఏర్పాటు చేసి పోలీసున్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ వ్యవస్థను రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మొదలుకొని అన్ని జిల్లాల హెడ్‌క్వార్టర్స్‌లలో ఏర్పాటు చేశారు. ఈ బందోబస్తును రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్, నగర పోలీసు కమిషనర్లు, జిల్లాల ఎస్పీలతో రాత్రి సమీక్షించారు. కౌంటింగ్ తేదీ వరకు ఈవీఎంల భద్రతకు ఎలాంటి భంగం వాటిల్లకుండా ప్రతిరోజు ప్రత్యేక టీంలతో కన్నేసి ఉంచాలని ఆయన ఆదేశించారు. 49 కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించేంత వరకు అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

'ఇదే స్ఫూర్తిని ప్రదర్శించండి'

రాష్ట్రంలో పోలింగ్ ప్రక్రియ చెదురుమొదురు ఘటనలు తప్ప ప్రశాంతంగా ముగిసేలా చేయటంలో పోలీసు అధికారులు, సిబ్బంది చేసిన కృషి ఎనలేనిదని ఆయన అభినందించారు. ముఖ్యంగా, ఒక్కచోట కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడటం, ఒక్క సెంటర్ వద్ద కూడా రీపోలింగ్ జరిగే అవసరం రాకుండా చూశారని అన్నారు. చివరకు కౌంటింగ్ జరిగే 3వ తేదీ వరకు కూడా ఈ స్ఫూర్తిని ప్రదర్శించాలని ఆయన అధికారులను కోరారు.

ఇతర రాష్ట్రాల హోంగార్డులు వెనక్కి

పోలింగ్ ముగియటంతో ఇతర రాష్ట్రాల నుంచి రప్పించిన దాదాపు 23వేల మంది హోంగార్డులను రాష్ట్రం నుంచి వెనక్కి పంపించారు. అలాగే, బందోబస్తు కోసం వచ్చిన 374 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలలో దాదాపు వంద వరకు తమ హెడ్‌క్వార్టర్స్‌కు తరలి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో నువ్వానేనా అన్నట్టుగా జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియటంతో పోలీసు ఉన్నతాధికారులు సైతం ఊపిరి పీల్చుకున్నారు.

డబ్బుల పంపిణీ... నిబంధనల ఉల్లంఘనలు

కమ్యూనిస్టులు మినహా.. అన్ని పార్టీలది అదే దారి

- పలు చోట్ల బాహాబాహికి దిగిన కార్యకర్తలు
- ప్రహసనంగా మారిన ఎన్నికలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ సందర్భంగా విచ్చల విడిగా డబ్బుల పంపిణీ జరగ్గా, యధేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘలను చోటు చేసుకున్నాయి. అధికార బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, బీజేపీ వరకు అన్ని పార్టీల నేతలు అదే దారి పట్టారు. బీఆర్ఎస్ డబ్బు పంచుతుందంటూ పలు నియోజక వర్గాల్లో కాంగ్రెస్ ఆరోపణలు చేయగా, కొన్ని చోట్ల ఇరు పార్టీల కార్యకర్తలు బాహాబాహికి దిగారు. నేతల తీరుతో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఘట్టం ప్రహసనంగా మారింది.

గురువారం జరిగిన ఎన్నికల పోలింగ్ ఉత్కంఠగా మారింది. సానుకూల ఓటింగ్ కోసం చివరి వరకు అన్ని పార్టీలు సర్వశక్తులు ఒడ్డాయి. అభ్యర్థులు మొదలుకుని నాయకులు, కార్యకర్తల వరకు పలు చోట్ల అత్యుత్సాహం ప్రదర్శించడంతో పాటు యధేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించారు. పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీల కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఓటింగ్‌లో పాల్గొన్న తర్వాత పోలింగ్ బూత్ వద్ద టీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరింది. కాంగ్రెస్ ఫిర్యాదుతో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదైంది. నిర్మల్ అభ్యర్థి అల్లోల్ల ఇంద్రకరణ్ రెడ్డి ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ఎల్లపల్లిలో ఓటేసేందుకు గులాబి కండువాతో పోలింగ్ బూత్‌లోకి వెళ్లారు. దాంతో ఆయనపై నిర్మల్ రూరల్ పీఎస్‌లో కేసు నమోదైంది. పటాన్ చెరు కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్ గౌడ్ సతీమణి సుధ నలుగురు కార్యకర్తలను వెంటబెట్టుకొని పోలింగ్ బూతులోకి వెళ్లి హల్ చల్ చేసింది. బీఆర్ఎస్, బీఎస్పీ కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను చెదర గొట్టారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఆలేరు నియోజక వర్గ బీఆర్ఎస్ అభ్యర్థి గొంగడి సునిత భర్త మహేందర్ రెడ్డి ఓటేసేందుకు కారుతో పాటు పోలింగ్ బూతులోకి వెళ్లడానికి చేసిన ప్రయత్నం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది.. కాంగ్రెస్ కార్యకర్తలు మహేందర్ రెడ్డి కారుపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. పోలీసులు ఇరు వర్గాలకు నచ్చ చెప్పడంతో గొడవ సద్దు మణిగింది. రాష్ట్ర వ్యాప్తంగా విచ్చల విడిగా డబ్బులు, మద్యం తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. కొన్ని చోట్ల డబ్బుల కోసం మహిళలు ఆందోళనకు దిగారు.

ముషీరాబాద్ నియోజక వర్గంలో డబ్బుల కోసం మహిళా సంఘాల నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గ్రూపు లీడర్లు సభ్యుల పేరున అభ్యర్థుల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు తెచ్చుకుని తమకు ఇవ్వలేదని నిరసన చేపట్టారు.. ఇల్లందు నియోజక వర్గంలో మహిళలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్పొరేటర్లు తమకు డబ్బులు ఇవ్వకుండా సొంతానికి వాడుకున్నారని పలు ప్రాంతాలకు చెందిన మహిళలు నిరసన చేపట్టడంతో కొద్ది సేపు ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాగజ్ నగర్‌లో బీఎస్పీ నాయకులపై బీఆర్ఎస్ నేతలు దాడులకు పాల్పడ్డారని ఆందోళనకు దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి చెదర గొట్టారు. జనగామ పట్టణంలోని 244 బూత్ వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో పోలింగ్ బూత్ దగ్గర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు బాహాబాహికి దిగారు. పోలీసుల రంగ ప్రవేశంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఖానాపూర్‌లో పోలింగ్ బూత్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. పోలీసులు లాఠీఛార్జ్ చేసారు.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్ గూడెంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ తలెత్తింది. పలువురు కాంగ్రెస్ కార్యకర్తలకు గాయాలు కాగా.. పోలీసులు నిరసనకారులను చెదరగొట్టారు.

ఢిల్లీలో కనిష్టానికి పడిపోయిన ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ : ఢిల్లీలో ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోయాయి. గురువారం ఉదయం ఉష్ణోగ్రత 12.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, ఇది సీజన్ సగటు కంటే రెండు నాచ్‌లు ఎక్కువగా ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. గరిష్ట ఉష్ణోగ్రత 24 డిగ్రీల సెల్సియస్‌గా ఉండవచ్చని అంచనా వేసింది. వాతావారణం మేఘావతమై ఉందని, చిరు జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉదయం 8.30 గంటలకు తేమశాతం 96 శాతంగా ఉంది. వాయు నాణ్యతా ప్రమాణం (ఏక్యూఐ) 366గా నమోదైందని, చాలా పేలవంగా ఉన్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) వెల్లడించింది. ఢిల్లీతో పాటు పంజాబ్ భాఘ్, బవానా, నెహ్రూ నగర్ , జహంగీర్ పురీలలోనూ ఏక్యూఐ పేలవంగానే ఉన్నట్టు తెలిపింది.

చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

న్యూఢిల్లీ : ఫైబర్ నెట్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా పడింది. చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేది ధర్మాసనం విచారించింది. తదుపరి విచారణను డిసెంబరు 12కి వాయిదా వేసింది. గత నెల 13, 17, 20, నవంబరు 9 తేదీల్లో ఇదే పిటిషన్ ధర్మాసనం ముందుకు వచ్చింది. అయితే స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు క్వాష్ పిటిషన్ దాఖలు చేయడంతో అందులో తీర్పు ఇచ్చిన తర్వాత దీన్ని పరిశీలిస్తామని న్యాయమూర్తులు గత విచారణ సమయంలో స్పష్టం చేశారు. 17ఏ అంశంపై తీర్పు వచ్చాకే ఫైబర్ నెట్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విచారిస్తామని ధర్మాసనం మరోసారి స్పష్టం చేసింది. అప్పటి వరకు అరెస్టు చేయవద్దన్న నిబంధన కొనసాగుతుందని తెలిపింది.

అందర్నీ మెప్పిస్తుంది

'పూర్తి వినోదం, మాస్ అంశాలతో ఆద్యంతం ప్రేక్షకులను సమ్మోహన పరిచే విధంగా 'ఉపేంద్ర గాడి అడ్డా' చిత్రం రూపొందింది' అని నిర్మాత కంచర్ల అచ్యుతరావు తెలిపారు.

కంచర్ల ఉపేంద్ర హీరోగా, సావిత్రి కృష్ణ హీరోయిన్‌గా ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో ఎస్.ఎస్.ఎల్.ఎస్. క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ సందర్భంగా నిర్మాత కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, 'మొదట్నుంచి నాకు సినిమా పిచ్చి ఉండేది. విడుదలైన అన్ని సినిమాలు చూస్తూండే వాడ్ని. అయితే నేను ఇతర వ్యాపార రంగాలలో బిజీ కావడంతో ఇంతకాలం సినిమా రంగంలోనికి ప్రవేశించలేదు. సినీ హీరో కావాలన్న మా అబ్బాయి ఉపేంద్ర తృష్ణను గమనించి, అతనిని హీరోగా పరిచయం చేస్తూ ఐదు సినిమాలను మొదలు పెట్టాం. అవన్నీ వివిధ దశలలో ఉన్నాయి. ఐదవ సినిమాగా మొదలు పెట్టిన ఈ సినిమా చాలా వేగంగా పూర్తయ్యింది. అంతేకాదు మొదటి సినిమాగా మీముందుకు వస్తోంది. మేము తీస్తున్న మిగిలిన సినిమాలను ప్రతీ నెలా ఒక సినిమా చొప్పున విడుదల చేస్తాం' అని చెప్పారు.


కంచర్ల ఉపేంద్ర , సావిత్రి కృష్ణ

'థియేటర్ సీట్లో కూర్చున్న ప్రేక్షకుడు నవ్వు ఆపుకోలేక పొట్ట చెక్కలయ్యే విధంగా వినోదం ఉంటుంది. అలాగే మాస్ అంశాలు యువ హృదయాలను అద్భుతంగా అలరింపజేస్తాయి. సోషల్ మీడియా నేటి సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తుందో తెలియంది కాదు. దానివల్ల చెడు మార్గాన్ని ఎంచుకోకుండా, మంచిని పెంపొందింపజేస్తే సమాజం మరింత వికాస వంతం అవుతుందన్న సందేశాత్మక పాయింట్‌ను కూడా ఇందులో ఆవిష్కరించాం. నిర్మాత, హీరో ఇచ్చిన సంపూర్ణ స్వేచ్ఛ, సహకారంతో సినిమాని అనుకున్న విధంగా తెరకెక్కించాను' అని దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కె. అన్నారు.


హీరో కంచర్ల ఉపేంద్ర మాట్లాడుతూ, 'నా జిజ్ఞాసను గమనించి, మా నాన్న నన్ను హీరోగా పెట్టి ఒక సినిమా కాదు, ఐదు సినిమాలు తీస్తుండటాన్ని నేను అదృష్టంగా భావిస్తున్నాను. తప్పకుండా ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది. కంటెంట్ బాగుంటే చిన్న సినిమానా లేక పెద్ద సినిమానా అని ప్రేక్షకులు చూడటం లేదు. బాగా ఆదరిస్తున్నారు. ఆ కోవలో ఉండే సినిమా ఇది' అని అన్నారు. హీరోయిన్ సావిత్రి కృష్ణ మాట్లాడుతూ, 'ఇలాంటి చక్కటి చిత్రంలో నటించటం ఆనందంగా ఉంది' అని అన్నారు.

నవచిత్రం థ్రిల్ చేసే ట్విస్టులు

నాగ చైతన్య 'దూత' వెబ్ సిరిస్‌తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యారు. నాగచైతన్య నటించిన తొలి వెబ్ సిరీస్ కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో చాలా ఆసక్తి నెలకొంది. సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ వెబ్ సిరీస్‌కి విక్రమ్ కె కుమార్ దర్శకత్వం వహించారు. ప్రియా భవానీ శంకర్, పార్వతి తిరువోతు, ప్రాచీ దేశాయ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పై నిర్మాత శరత్ మరార్ ఈ వెబ్ సిరీస్‌ని నిర్మించారు. నేటి నుంచి (శుక్రవారం) నుంచి ప్రైమ్ వీడియోలో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంలో ఈ సిరీస్ ప్రసారం కానుంది.


విక్రమ్ కె కుమార్

ఈ నేపథ్యంలో దర్శకుడు విక్రమ్ కె కుమార్ మీడియాతో మాట్లాడుతూ, "13బి' తర్వాత నేను సూపర్ నేచురల్ జోనర్‌లో సినిమాలు చేయలేదు. 'దూత' ఆలోచన ఎప్పట్నుంచో ఉంది. నాగ చైతన్యకి చెప్పాను. ఆయనకి చాలా నచ్చింది. ఇదొక సూపర్ నేచురల్ థ్రిల్లర్. చాలా మలుపులు ఉంటాయి. లాంగర్ ఫార్మెట్‌లో ప్రతి ఎపిసోడ్‌కి ఒక మలుపు ఉండాలి. కథతో పాటు ప్రేక్షకుడిని చివరి వరకూ తీసుకెళ్ళాలి. ఇదొక పెద్ద సవాల్. రైటింగ్ ప్రాసెస్‌ని చాలా ఎంజాయ్ చేశాను. ఈ షో పై ప్రేక్షకుల స్పందన తెలుసుకోవడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. దూత అంటే మెసేంజర్. ఒక సంఘటనని ప్రజల వద్దకు చేరవేసే జర్నలిస్ట్ కూడా దూతనే. ఇదొక జర్నలిస్ట్ నేపథ్యంలో జరుగుతుంది. ఓటీటీకి ఓ గొప్ప సౌలభ్యం ఉంది. ఇప్పుడు విడుదలౌతున్న దూత దాదాపు 240 దేశాల్లో ప్రసారం కానుంది. ప్రపంచంలో నలుమూలల ప్రేక్షకులు చూస్తారు. దూత సూపర్ నేచురల్ జోనర్ కాబట్టి ఇలాంటి జోనర్‌కి ప్రపంచవ్యాప్తంగా ఫ్యాన్స్ ఉన్నారు. మన షోని కూడా వాళ్ళు ఎంజాయ్ చేయడం మంచి అనుభూతి. జర్నలిస్ట్ అంటే చాలా పవర్‌ఫుల్ రోల్. ప్రజాస్వామ్యంలో జర్నలిజం ఒక మూలస్థంబం. అందులోనూ ఇన్వెస్టిగేటివ్ జర్నలిజంలో చాలా రిస్క్ ఉంటుంది. ఆ వృత్తిలో ఉండాలంటే చాలా గట్స్ కావాలి. అందరూ ఆ పని చేయలేరు. ఈ కథలో అలాంటి పాత్రని చాలా అద్భుతంగా చిత్రీకరించాం. ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్‌లో చాలా లేయర్లు ఉన్నాయి. అవి ప్రేక్షకులకు చాలా థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇస్తాయి. దూతని గోవా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శించడం చాలా ఆనందంగా ఉంది. ఒక ఎపిసోడ్‌ని స్క్రీన్ చేశాం. నిర్మాణం పరంగా ఇది చాలా ప్యాషన్‌తో కూడుకున్న సిరీస్. శరత్ మరార్‌లాంటి ప్యాషనేట్ నిర్మాత వలనే ఇది సాధ్యమైంది. మూడు సినిమాల నిడివి ఉన్న కంటెంట్ ఇది. దాదాపు సన్నివేశాలన్నీ వర్షంలోనే చిత్రీకరించాం' అని చెప్పారు.



ఓటీటీలో తెలుగు 'ధూమం'

ఫహద్ ఫాజిల్ నటించిన 'ధూమం' చిత్రం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. కన్నడం, మలయాళంతో పాటు తెలుగు, తమిళ భాషల్లో ఓటీటీ రిలీజ్ చేశారు. పవన్ కుమార్ దర్శకత్వం వహించారు. హొంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. పాన్ ఇండియన్ లెవెల్‌లో అన్ని దక్షిణాది భాషల్లో ధూమం సినిమాను రిలీజ్ చేయాలని మేకర్స్ మొదట అనుకున్నారు. కానీ తెలుగు వెర్షన్ డబ్బింగ్ పనులు ఆలస్యం కావడం వల్ల థియేటర్లలో రిలీజ్ కాలేకపోయింది. తాజాగా డైరెక్ట్‌గా ఓటీటీలో తెలుగు వెర్షన్‌ను రిలీజ్ చేశారు. ఈ సినిమాలో ఫహద్ ఫాజిల్‌తో పాటు అపర్ణ బాలమురళి, రోషన్ మాథ్యూ ప్రధాన పాత్రలను పోషించారు. సిగరెట్ తాగడం వల్ల తలెత్తే అనర్థాల్ని యాక్షన్ థ్రిల్లర్ కథతో ధూమం సినిమాలో చూపించారు.

హృతిక్, ఎన్టీఆర్‌ల 'వార్ 2'



హృతిక్‌రోషన్, ఎన్టీఆర్‌లు కలిసి నటిస్తున్న చిత్రం వార్ 2. అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. కియారా అడ్వాణీ కథానాయిక. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. 2025 ఆగస్టు 14న ఈ సినిమా విడుదల చేయబోతున్నామని చిత్రబందం ప్రకటించింది. యశ్‌రాజ్ ఫిల్మ్స్ ద్వారా ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్ ప్రతినాయక ఛాయలున్న పాత్రలో కనిపించనున్నారు. 'దేవర' చిత్రీకరణతో బిజీగా ఉన్న ఆయన 'వార్ 2' కోసం సంక్రాంతి తర్వాత సెట్లోకి అడుగు పెట్టనున్నట్టు సమాచారం.

కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం : తిరుమలరావు



'ఈ మధ్యకాలంలో చిన్నారుల నుంచి ఇంటికి పెద్ద దిక్కు వరకు..అన్ని వయస్సుల వారు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం 'పల్లెగూటికి పండగొచ్చింది'. శ్రీకాకుళం జిల్లా ప్రాముఖ్యతను చాటిచెబుతుంది. ఆ జిల్లాలోని అందమైన ప్రదేశాల్లో ఈ సినిమా చిత్రీకరణ జరిగింది. సత్యవరం అనే గ్రామంలో బాధ్యతారాహిత్యంగా తిరిగే యువత ఆ తర్వాత బాధ్యతను తెలుసుకుని ఆ గ్రామాన్ని స్మార్ట్ విలేజ్‌గా ఎలా మార్చారు' అనే కథాంశంతో ఈ సినిమాను తీశాం' అని దర్శకులు తిరుమలరావు కంచరాన పేర్కొన్నారు. .ప్రవీణ్ సమర్పణలో ఈశ్వర్ మెమోరియల్ లక్ష్మి ఫిల్మ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై కంచరాన రాజ్యలక్ష్మి నిర్మించిన చిత్రం ఇది.

శుక్రవారంనాడు ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా దర్శకుడు తిరుమలరావు సినిమా వివరాలు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రంగా పేర్కొన్నారు.



ఆటలు



చరిత్ర సృష్టించిన ఉగాండా..

ఉగాండా : ఆఫ్రికా దేశం ఉగాండా చరిత్ర సృష్టించింది. ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ ఆఫ్రికా రీజియన్ క్వాలిఫయర్ - 2023 పోటీలలో ఆ జట్టు గురువారం రువాండాను ఓడించింది.

ఓఅంచనాలను తలకిందులు చేస్తూ ఉగాండా క్రికెట్ జట్టు.. వచ్చే ఏడాది అమెరికా, వెస్టిండీస్ వేదికగా జరగాల్సి ఉన్న టీ20 వరల్డ్ కప్‌కు అర్హత సాధించింది. ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ ఆఫ్రికా రీజియన్ క్వాలిఫయర్ 2023 పోటీలలో ఆ జట్టు గురువారం రువాండాను ఓడించడంతో పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచి ప్రపంచకప్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ఐసీసీ మెగా టోర్నీలో ఉగాండా ఆడనుండటం ఇదే ప్రథమం.

ఆఫ్రికన్ రీజియన్ క్వాలిఫయర్స్‌లో భాగంగా ఏడు దేశాలతో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో ఇదివరకే నమీబియా ఆడిన ఐదు మ్యాచ్‌లకూ ఐదింటిని గెలుచుకుని పది పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఉగాండా జట్టు ఆరు మ్యాచ్‌లలో ఏకంగా ఐదు గెలిచి పది పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈ టోర్నీలో అగ్రస్థానంలో ఉన్న రెండు జట్లు వరల్డ్ కప్‌కు క్వాలిఫై అవుతాయని ఇదివరకే ఐసీసీ వెల్లడించిన విషయం తెలిసిందే.

తొలుత బ్యాటింగ్ చేసిన రువాండా.. 18.5 ఓవర్లలో 65 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులో ఎరిక్ దుసిన్ (19) టాప్ స్కోరర్. ఉగాండా బౌలర్లలో అల్పేష్ రంజానీ , దినేశ్ నక్రానీ, సెనెయోందొ , కెప్టెన్ మసాబా తలా రెండు వికెట్లు తీశారు.

అనంతరం లక్ష్యాన్ని ఉగాండా.. 8.1 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. నమీబియా, ఉగాండాలు క్వాలిఫై అవడంతో జింబాబ్వే, కెన్యా, నైజీరియా, టాంజానియా, రువాండాలు నిష్క్రమించాయి.

ప్రపంచకప్‌కు అర్హత సాధించిన జట్లు

ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, ఇండియా, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్తాన్, సౌతాఫ్రికా, శ్రీలంక, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్, కెనడా (అమెరికా క్వాలిఫయర్), నేపాల్, ఓమన్ (ఆసియా క్వాలిఫయర్), పపువా న్యూ గినియా ((ఈస్ట్ ఆసియా పసిఫిక్), ఐర్లాండ్, స్కాట్లాండ్ (యూరప్ క్వాలిఫయర్), నమీబియా, ఉగాండా (ఆఫ్రికా క్వాలిఫయర్) జట్లు అర్హత సాధించాయి. ఆతిథ్య హోదాలో విండీస్, అమెరికాలు ఆడనున్నాయి.

ఇది సరైన నిర్ణయం

కోచ్‌గా ద్రవిడ్ కొనసాగింపుపై గంభీర్

న్యూఢిల్లీ : టీమ్‌ఇండియా ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ కాంట్రాక్ట్‌ను పొడిగిస్తున్నట్టు బీసీసీఐ తీసుకున్న నిర్ణయాన్ని మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ స్వాగతించాడు. త్వరలో టీ20 ప్రపంచ కప్ జరగనున్న వేళ ఇది సరైన నిర్ణయమని అభిప్రాయపడ్డాడు. ప్రపంచకప్ ఫైనల్లో భారత్ పరాజయం పాలైనప్పటికీ.. జట్టు అద్భుత ప్రదర్శన నేపథ్యంలో ద్రవిడ్‌పై బీసీసీఐ విశ్వాసముంచి కోచ్‌గా అతడి కాంట్రాక్ట్‌ను పొడిగించిన విషయం తెలిసిందే. బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్, బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే, ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌లను కూడా పొడిగించింది.

'త్వరలో టీ20 ప్రపంచకప్ జరగనున్న ఈ తరుణంలో మొత్తం కోచింగ్ స్టాఫ్‌ను కొనసాగించాలనుకోవడం మంచి నిర్ణయం. రాహుల్ ద్రవిడ్ అందుకు అంగీకరించడం ప్రశంసించదగిన విషయం. టీమ్‌ఇండియా అద్భుత ప్రదర్శన కొనసాగుతుందని ఆశిస్తున్నా. టీ20 ఫార్మాట్ చాలా భిన్నమైంది. సవాళ్లతో కూడుకొన్నది.

ఇందులోనూ ద్రవిడ్ సహా అతని బందం అద్భుత ఫలితాలు సాధిస్తుందని ఆశిస్తున్నా. వారందరికీ శుభాకాంక్షలు" అని గంభీర్ మీడియాతో చెప్పారు.



మూడు ఫార్మాట్లకు ముగ్గురు సారథులు

దక్షిణాఫ్రికా పర్యటనకు జట్లను ప్రకటించిన బిసిసిఐ



ముంబయి: ఆస్ట్రేలియా టి20 సిరీస్ ముగిసిన వెంటనే భారతజట్టు 10నుంచి దక్షిణాఫ్రికా పర్యటనకు బయల్దేరి వెళ్లనుంది. ఆ పర్యటనలో భాగంగా దక్షిణాఫ్రికాతో టి20, వన్డే, టెస్టుల్లో భారత్ తలపడనుంది. ఈ క్రమంలో మూడు ఫార్మాట్‌లకు ముగ్గురు కెప్టెన్లను ప్రకటించిన బిసిసిఐ అందరికీ ఒక్కసారిగా షాక్ ఇచ్చింది. రోహిత్ శర్మకు వన్డే, టి20లకు విశ్రాంతి తీసుకొని, టెస్టుల్లో సారథ్యం వహించనున్నాడు. అలాగే విరాట్ కోహ్లీకి బిసిసిఐ విశ్రాంతి ఇచ్చింది. టెస్టు సిరీస్‌కు రోహిత్.. వన్డే సిరీస్‌కు కేఎల్ రాహుల్.. టి20లకు సూర్యకుమార్ యాదవ్ నాయకత్వ బాధ్యతలను అప్పగించింది. ఓ విదేశీ టూర్‌కు మూడు ఫార్మాట్లకు ముగ్గురిని కెప్టెన్లుగా బిసిసిఐ నియమించడం ఇదే తొలిసారి.

దక్షిణాఫ్రికాతో సిరీస్...

డిసెంబర్ 10 : తొలి టి20
డిసెంబర్ 12 : రెండో టి20
డిసెంబర్ 14 : మూడో టి20
డిసెంబర్ 17 : తొలి వన్డే
డిసెంబర్ 19 : రెండో వన్డే
డిసెంబర్ 21 : మూడో వన్డే
డిసెంబర్ 26-30 : తొలి టెస్టు
జనవరి 3-7 : రెండో టెస్టు

టి20 జట్టు

సూర్యకుమార్(కెప్టెన్), జైస్వాల్, శుభ్‌మన్, గైక్వాడ్, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), తిలక్ వర్మ, రింకు సింగ్, శ్రేయస్, జితేశ్ శర్మ(వికెట్ కీపర్), జడేజా (వైస్ కెప్టెన్), సుందర్, బిష్ణోయ్, అర్ష్‌దీప్, సిరాజ్, ముకేశ్, దీపక్ చాహర్, కుల్దీప్.

వన్డే జట్టు

కెఎల్ రాహుల్ (కెప్టెన్/వికెట్ కీపర్), గైక్వాడ్, సాయి సుదర్శన్, తిలక్ వర్మ, పటీదార్, రింకు సింగ్, శ్రేయస్, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్, సుందర్, కుల్దీప్, చాహల్, ముకేశ్ కుమార్, అవేశ్ ఖాన్, అర్ష్‌దీప్, చాహర్.

టెస్టు జట్టు

రోహిత్ శర్మ(కెప్టెన్), శుభ్‌మన్, జైస్వాల్,కోహ్లీ, శ్రేయస్, గైక్వాడ్, ఇషాన్ కిషన్, కెఎల్ రాహుల్(వికెట్ కీపర్లు), అశ్విన్, జడేజా, శార్దూల్, సిరాజ్, షమీ, బుమ్రా(వైస్ కెప్టెన్), ప్రసిధ్ కృష్ణ

ఇక్కడే ముగించాలి

ఆస్ట్రేలియా నాల్గో టి20 నేడు రాత్రి 7.00గం॥లకు



రాయ్‌పూర్: తొలి రెండు టి20ల్లో నెగ్గిన టీమిండియా.. మూడో టి20లో భారీ స్కోర్ చేసినా చేజేతులా పరాజయాన్ని చవి చూసింది. ఈ క్రమంలో ఆసీస్‌తో శుక్రవారం జరిగే నాల్గో టి20లో గెలిచి సిరీస్‌ను ఇక్కడే ముగించాలని భారత్ భావిస్తోంది. బ్యాటర్స్ అద్భుత ఫామ్‌లో ఉన్నా.. బౌలర్లు ఆసీస్ బ్యాటర్లను కట్టడి చేయలేకపోతున్నారు. ముఖ్యంగా మూడో టి20లో 222పరుగుల భారీ స్కోర్‌ను ఆసీస్ జట్టు ఛేదించకుండా భారత బౌలర్లు నిరోధించలేకపోయారు. చివరి 12 బంతుల్లో ఆసీస్ జట్టు 43పరుగులు రాబట్టి గెలిచిన తీరు వర్ణణాతీతం. మరోవైపు ఆస్ట్రేలియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మూడో టి20 ముగిసాయ ఆసీస్ స్టార్ ఆటగాళ్ల స్టీవ్ స్మిత్, ఆడం జంపా, మ్యాక్స్‌వెల్, స్టొయినీస్, ఇంగ్లిస్, అబట్ స్వదేశానికి బయల్దేరారు. గౌహతి వేదికగా జరిగిన మూడో టి20లో ఆసీస్‌ను గెలిపించిన మ్యాక్స్‌వెల్ జట్టుకు దూరం కావడం ఆసీస్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లే.

జట్లు(అంచనా)..

భారత్: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), జైస్వాల్, గైక్వాడ్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రింకు సింగ్, అక్షర్ పటేల్, శ్రేయస్ అయ్యర్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, ఆవేశ్ ఖాన్, ముఖేశ్ కుమార్.

ఆస్ట్రేలియా: మాథ్యూ వేడ్(కెప్టెన్, వికెట్ కీపర్), హెడ్, షార్ట్, హార్డి, డెర్మాట్, టిమ్ డేవిడ్, గ్రీన్, డ్వార్షిస్/రిచర్డుసన్, ఎల్లిస్, బెహ్రెన్‌డార్ఫ్, సంఘా.

నజ్మల్ సెంచరీ

భారీ ఆధిక్యత దిశగా బంగ్లాదేశ్ న్యూజిలాండ్‌తో తొలిటెస్ట్

చిట్టోగ్రామ్ (బంగ్లాదేశ్): న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ భారీ ఆధిక్యత దిశగా దూసుకెళ్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ జట్టు 317పరుగులకు ఆలౌట్ కావడంతో ఆ జట్టుకు 7పరుగుల స్వల్ప ఆధిక్యత లభించింది. గురువారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లా జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 68 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. మహ్మదల్ హసన్ జాయ్(8) వికెట్‌ను ఆదిలోనే కోల్పోయింది. మరో ఓపెనర్ జకీర్ హసన్(17) అజాజ్ పటేల్ వేసిన 14వ ఓవర్లో ఎల్బీగా నిష్క్రమించాడు. 26 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన బంగ్లాను శాంతో, మోమినుల్ హక్(40) ఆదుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 90 పరుగులు జోడించారు. ఈ క్రమంలో మోమినుల్.. రనౌట్ కావడంతో ఆ జట్టు మూడో వికెట్ కోల్పోయింది. మోమినుల్ నిష్క్రమించినా.. ముష్ఫికర్ రహీమ్‌తో కలిసి శాంతో బంగ్లా ఇన్నింగ్స్‌ను నడిపిస్తున్నాడు. వీరిద్దరూ నాల్గో వికెట్‌కు అజేయంగా 96 పరుగులు జోడించారు.



మన దేశంలో లైంగిక విషయాలు, శుభ్రత, ఆరోగ్యం గురించి మాట్లాడటమంటే అదొక పెద్ద తప్పుగా భావిస్తారు. అందునా మహిళలు మాట్లాడితే ఏదో ఘోరం చేసినట్టు అనుకుంటారు. అటువంటి సమాజంలో ఓ మహిళ లైంగిక ఆరోగ్యానికి సంబంధించిన ఉత్పత్తులను తయారు చేస్తుందంటే మరింత ఆశ్చర్యంగా చూడటం సహజం. కానీ ఆమె మాత్రం అలా అనుకోలేదు. మహిళల ఆరోగ్యం గురించి అలోచించి, లైంగిక జీవితంలో తాను స్వయంగా ఎదుర్కొన్న సమస్యలు మరే మహిళా ఎదుర్కోకూడదనుకున్నారు **కోమల్ బల్వా**. ఆ సమస్యలకు పరిష్కారంగా కండోమ్స్ తయారు చేయాలనుకున్నారు. అయితే ఈ బిజినెస్ ప్రారంభించాలనే ఆలోచన వచ్చినపుడు ఆమె ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నారో, వాటి నుండి ఎలా బయట పడ్డారా, వ్యాపారాన్ని ఎలా ముందుకు తీసుకెళ్ళారో తెలుసుకుందాం...

ముందు అందరూ షాక్ అయ్యారు

కోమల్‌కు బిజినెస్ ఆలోచన వచ్చిన వెంటనే ముందుగా తన భర్త నమిత్‌తో పంచుకున్నారు. ముందు ఆయన కాస్త ఆలోచించారు. కుటుంబ సభ్యులు కూడా షాక్ అయ్యారు. అందరినీ ఒప్పిం చటం ఆమెకు ఓ సవాలుగా నిలిచింది. అయినా ఎలాగా ఇంట్లో వారందినీ ఒప్పించగలిగారు. భార్య ఆలోచనకు మొదట షాక్ అయినప్పటికి నమిత్ ప్రోత్సహించాడు. ఆయన ప్రోత్సా హంతో బ్లూ పేరుతో కంపెనీని ప్రారంభిం చారు కోమల. ఇప్పుడు నమిత్ ఆ కంపెనీకి ఫౌండర్‌గా వున్నారు.

అవగాహన కల్పిస్తూ...

మహిళలు పలకడానికి ఇష్టపడని పదాన్ని తన వ్యాపారంగా మలచుకున్నారు కోమల్. వ్యాపారం ప్రారంభించడమే కాదు ఓ పారిశ్రా మికవేత్తల ఎదిగి మంచి గుర్తింపు తెచ్చు కున్నారు. ఎదురైన సవాళ్ళని ధైర్యంగా ఎదు ర్కొంటూ ముందడుగు వేసి ఎందరో మహిళలకు ఆదర్శవంతురాలిగా నిలిచారు. మహిళా లోకానికి మనం ఏదైనా సాధించగలం అని నిరూపించారు. లైంగిక విషయాల గురించి మాట్లాడుకోవడం తప్పు కాదని, గర్భ నిరోధక మాత్రలకంటే కండోమ్స్ ఆరోగ్యానికి ఎంతో మంచిదనే అవగాహన కల్పిస్తున్నారు.



షాకింగ్ స్టెప్ తీసుకుని

బ్లూ కంపెనీ స్థాపించక ముందు కోమల్ కన్స్ట్రక్షన్ బిజినెస్ చేశారు. ఆమె ఐఐఎమ్‌లో ఎగ్జిక్యూటివ్ మేనేజ్‌మెంట్ చదివారు. తర్వాత యుకే గ్రౌండ్ ఫీల్డ్‌లో మార్కెటింగ్ పూర్తి చేశారు. పురుషాధిక్య సమాజంలో కంపెనీ ప్రారంభించిన కొత్తలో ఎన్నో సవాళ్ళు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ తాను ఎంచుకున్న బిజినెస్‌లో నాణ్యత వుండాలని బలంగా కోరుకున్నారు. ఆరోగ్యమే లక్ష్యంగా వ్యాపారంలో ఎన్నో నిబంధనలను కచ్చితంగా పాటిస్తున్నారు. 2019లో 'బ్లూ కండోమ్' పేరిట స్టార్ట్ అప్ కంపెనీని స్థాపించి షాకింగ్ స్టెప్ తీసుకుని ఎన్నో ఇబ్బందులను అధిగమించి విజయం సాధించారు. ఇండియాలో మొదటి స్పిరల్ కండోమ్‌ను తయారు చేస్తున్న సంస్థ తమది అని ఆమె గర్వంగా చెబుతున్నారు. అంతే కాదు దేశం మొత్తంలో మొదటి 'వేగన్ కండోమ్' బ్రాండ్‌గా కూడా ఆమె కంపెనీ గుర్తింపు పొందింది. ప్రస్తుతం తన కంపెనీలో నాలుగు రకాల కండోమ్స్ అందుబాటులో ఉన్నాయని ఆమె చెబుతున్నారు.

ఉపాధి కల్పిస్తూ...

వి హబ్ తోడ్పాటుతో ఆమె మార్కెటింగ్‌లో మంచి ఫలితాలను సాధిస్తున్నారు. తాను వ్యాపారం ప్రారంభించి ఓ పారిశ్రామిక వేత్తగా మంచి గుర్తింపు తెచ్చుకోవడమే కాకుండా ఎంతో మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఈ ప్రొడక్ట్స్ అంతర్జాతీయ స్టాండడ్స్‌తో, గ్రీన్ అండ్ బయోడిగ్రిడబుల్ ప్యాకేజింగ్‌తో ఆన్‌లైన్‌లో మాత్రమే విక్రయి స్తున్నారు. అమ్మ కాలు ఆన్‌లైన్‌లో అయినప్పటికి వ్యాపారం మంచి స్థాయిలో ఉందని ఆమె ఆనందంగా చెబుతున్నారు.

ఉపాధి కల్పిస్తూ...

వి హబ్ తోడ్పాటుతో ఆమె మార్కెటింగ్‌లో మంచి ఫలితాలను సాధిస్తున్నారు. తాను వ్యాపారం ప్రారంభించి ఓ పారిశ్రామిక వేత్తగా మంచి గుర్తింపు తెచ్చుకోవడమే కాకుండా ఎంతో మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఈ ప్రొడక్ట్స్ అంతర్జాతీయ స్టాండడ్స్‌తో, గ్రీన్ అండ్ బయోడిగ్రిడబుల్ ప్యాకేజింగ్‌తో ఆన్‌లైన్‌లో మాత్రమే విక్రయిస్తున్నారు. అమ్మకాలు ఆన్‌లైన్‌లో అయినప్పటికి వ్యాపారం మంచి స్థాయిలో ఉందని ఆమె ఆనందంగా చెబుతున్నారు.

- పి. విశాలాక్షి

ప్లాస్టిక్ కవర్లు వాడము

'సాధారణంగా కండోమ్స్ ప్యాకెట్‌పై ఇంగ్రీడియన్స్ రాయరు. మేము మాత్రం తన ప్రొడక్ట్ ప్యాకెట్ పైన ఇంగ్రీడి యంట్స్ వివరాలు అందిస్తాము. మా ప్యాకేజింగ్‌లో ప్లాస్టిక్ కవర్లు అస్సలు వాడము. బాయోడిగ్రెడబుల్ మెటీరియల్‌తో మేము ఈ ఉత్పత్తులను తయారు చేయిస్తున్నాం. ఎటువంటి రసాయనాలను వాడకుండా కండోమ్‌లను తయారు చేయ డంతో పాటు కర్బన వినియోగాన్ని కూడా ఉత్పత్తులో తగ్గించాము. ప్రపంచం లో స్పైరల్ కండోమ్‌లను అందిస్తోంది కూడా మా 'బ్లూ' కంపెనీ మాత్రమే' అంటున్నారు కోమల్.

బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత మహిళలు ఎదుర్కొనే పోస్ట్ పార్టమ్ డిప్రెషన్ ప్రభావం మూడేండ్ల వరకు ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా కొత్తగా తల్లి అయిన వారు పోస్ట్ పార్టమ్ డిప్రెషన్‌ను ఎదుర్కొంటారు. కానీ దీన్ని మన దేశంలో చాలా మంది పట్టించుకోరు. దీని ప్రభావం గతంలో ఊహించిన దానికంటే చాలా ఎక్కువ కాలం ఉండవచ్చని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. ప్రసవమైన తర్వాత ప్రతి నలుగురు తల్లుల్లో ఒకరు మూడేండ్ల వరకు తీవ్రమైన డిప్రెషన్‌తో బాధపడుతున్నట్టు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (యుఎస్‌ఎ) నిర్వహించిన ఓ అధ్యయనం వెల్లడించింది. దీని ఫ్రీక్వెన్సీ అందరిలో ఒకేలా ఉండనప్పటికీ లక్షణాలు మూడేండ్ల పాటు కొనసాగడం తీవ్రమైన విషయమే. ఈ పరిశోధనలో 5,000 మంది మహిళల నుంచి సమాచారం సేకరించారు. ఇతర వాలంటీర్లలో కొంతమంది మూడేండ్ల వరకు తక్కువ స్థాయిలో డిప్రెషన్‌ను ఎదుర్కొన్నామని చెప్పారు. ఈ సమస్యను అధిగమించేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటంటే...

ప్రసవం తర్వాత...

పరీక్షలు చేయించుకోవాలి : యునిస్ కెన్నెడీ శ్రివర్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ (NICHD) ఆధ్వర్యంలో చేసిన ఈ పరిశోధనను పీడియాట్రిక్స్ జర్నల్‌లో ప్రచురించారు. ప్రసవించిన అనంతరం మొదటి నెలలో ఒకసారి, రెండు, నాలుగు, ఆరు నెలల్లో ఒకసారి డిప్రెషన్ పరీక్షలు చేయించుకోవాలని అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సూచిస్తోంది. సాధారణంగా ఈ నెలల్లోనే పుట్టిన పిల్లలను చెకప్ కోసం హాస్పిటళ్లకు తీసుకురావాలని సూచిస్తారు. ఆ సమయంలోనే పిల్లలతో పాటు తల్లులు కూడా పరీక్షలు చేయించుకోవడం మంచిదని ఆ సంస్థ చెబుతోంది. పోస్ట్ పార్టమ్ డిప్రెషన్ లక్షణాలు నాలుగు విధాలుగా ఉంటాయని పరిశోధకులు చెబుతున్నారు. లక్షణాలు ఎక్కువయ్యే కొద్దీ ప్రమాద తీవ్రత కూడా పెరుగుతుందని వారు తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రసవానంతరం రెండేండ్ల వరకు దీనికి సంబంధించిన స్క్రీనింగ్ టెస్టు చేయించుకుంటూ సురక్షితంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

తల్లి మానసిక ఆరోగ్యమే పిల్లలకు కీలకం : డిప్రెషన్ లక్షణాలను అంచనా వేయడానికి ప్రసవం తర్వాత ఆరు నెలలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం సరికాదని తమ అధ్యయనం ద్వారా తెలిసిందని (NICHD) ఎపిడెమియాలజీ బ్రాంచ్‌కు చెందిన శాస్త్ర వేత్త పేర్కొన్నారు. ఆమె ఆధ్వర్యంలోనే పరిశోధన కొనసాగింది. తల్లి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, అర్థం చేసుకోవ డానికి దీర్ఘకాలిక డేటా అవసరమని ఆమె అన్నారు. తల్లి మానసిక ఆరోగ్యమే ఆమె ఆరోగ్యానికి, పిల్లల శ్రేయస్సుకు, అభివృద్ధికి కీలకమైందని వివరించారు.

సమస్యలు ఎక్కువ : న్యూయార్క్ రాష్ట్రంలోని 57 కౌంటీల్లో 2008- 2010 మధ్య జన్మించిన శిశువులపై చేసిన స్టడీ ఆధారంగా తాజా అధ్యయనానికి సంబంధించిన వివరాలు సేకరించారు. కొత్త అధ్యయనంలో ప్రసవం తర్వాత మూడేండ్ల గడువులోపు ఉండే 5,000 మంది మహిళలపై సర్వే చేశారు.



వారిని డిప్రెషన్ స్క్రీనింగ్‌కు సంబంధించిన ఐదు ప్రశ్నలు అడిగారు. సర్వే కోసం క్లినికల్ విధానంలో పరీక్షలు చేయలేదు. ముందు నుంచే మానసిక సమస్యలు ఉన్నవారు, జెస్టేషనల్ డయాబెటీస్ బారిన పడిన మహిళలు ఎక్కువ కాలం హయ్యర్ లెవల్ డిప్రెషన్ బారిన పడే అవకాశం ఉందని అధ్యయనంలో కనుగొన్నారు.

కాపాడుకోండిలా...

వయసు పెరుగుతున్న కొద్దీ మీ చర్మంలో మార్పులు వస్తాయి. ఆ మార్పులకు తగినట్టుగా మీరు మీ చర్మాన్ని సంరక్షించుకోవాలి.

○ మంచి ఆరోగ్యకరమైన చర్మం కోసం నాలుగు పద్ధతులను ఎల్లప్పుడూ అనుసరించండి. మొదటిది.. నీరు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకోండి. రెండవది.. వ్యాయామం ద్వారా శరీరాన్ని ఆరోగ్య వంతంగా చేసుకోండి. మూడవది.. ఒత్తిడి, శ్రమను తగ్గించడం ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచుకోండి. ఇక చివరిది.. మీ చర్మానికి అవసరమైనపుడు ట్రీట్మెంట్ చేయించి చర్మాన్ని కాపాడండి. ఆరోగ్యకరమైన చర్మం కావాలంటే ఇవన్నీ పాటించాలి.



○ నీరు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు అన్నీ చర్మానికి మేలు చేస్తాయి. నీటితో కూడిన ఆహారాన్ని తీసుకున్నప్పుడు చర్మం లోపలి నుండి ఎక్కువసేపు హైడ్రేట్‌గా ఉంటుంది. మీ ఆహారాలలో ఆపిల్, కీర దోసకాయలు, ద్రాక్ష మొదలైనవి చేర్చాలి. సూర్యరశ్మిలో చర్మాన్ని కాపాడే లక్షణాలు ఉంటాయి.

○ ఎలక్ట్రానిక్స్‌ని ఎక్కువసేపు ఉపయోగించినప్పుడు వాటి నుండి వెలువడే నీలి రంగు లైట్ మీపై పడకుండా ఉండటం కోసం అద్దాలు ధరించడం వంటి చిన్న మార్పులు చేయండి. ఎలక్ట్రానిక్స్ నుండి విశ్రాంతి తీసుకోవడానికి టైమర్‌లను సెట్ చేసుకోండి. విశ్రాంతి తీసుకునే సమయాన్ని పెంచడానికి ప్రయత్నించండి.

4 నుంచి పార్లమెంట్

న్యూఢిల్లీ : పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 4 నుంచి ప్రారంభమై.. 22వ తేదీ వరకూ కొనసాగుతాయి. ఈ సమావేశాలలో మోడీ ప్రభుత్వం 18 బిల్లులను ప్రవేశపెడుతుంది. మహిళా రిజర్వేషన్ చట్టంలోని నిబంధనలను జమ్మూకాశ్మీర్, పాండిచ్చేరికి కూడా వర్తింపజేసేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులు, క్రిమినల్ చట్టాల స్థానంలో తీసుకొస్తున్న మూడు బిల్లులు కూడా వీటిలో ఉన్నాయి. ఈ మేరకు లోక్‌సభ సచివాలయం ఓ బులెటిన్ విడుదల చేసింది.

జమ్మూకాశ్మీర్ శాసనసభ స్థానాల సంఖ్యను 107 నుంచి 114కు పెంచేందుకు ఉద్దేశించిన బిల్లును కూడా ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెడుతుంది. కాశ్మీర్ వలసవాదులు, పాక్ ఆక్రమిత జమ్మూకాశ్మీర్ నుండి వచ్చిన వారు, షెడ్యూల్డ్ తెగల వారికి ప్రాతినిధ్యం కల్పించేందుకు ఈ బిల్లును తీసుకొస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. ఈ బిల్లులతో పాటు 2023-24 సంవత్సరపు గ్రాంట్లకు సంబంధించి తొలి విడత అనుబంధ డిమాండ్లను కూడా సభ ముందు ఉంచుతారు. ఈ డిమాండ్లపై శీతాకాల సమావేశాలలోనే చర్చించి ఆమోదిస్తారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును వర్షాకాల సమావేశాలలోనే ఆమోదించారు. అయితే ఈ బిల్లును జమ్మూకాశ్మీర్, పాండిచ్చేరికి వర్తింపజేయలేదు. ఆయా కేంద్రపాలిత ప్రాంతాల పాలనా వ్యవహారాలకు సంబంధించిన ఆర్టికల్ 239ఎ, 239ని అందులో చేర్చకపోవడంతో ఆయా ప్రాంతాలకు మహిళా రిజర్వేషన్ బిల్లును వర్తింపజేయలేదు. ఐపీసీ (1860), ఇండియన్ ఎవిడెన్స్ చట్టం (1872), సీఆర్‌పీసీ (1898) స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత బిల్లులను ప్రవేశపెడతారు. ఇటీవల బీజేపీ ఎంపీ బ్రిజ్‌లాల్ నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ ఈ బిల్లులకు 50కి పైగా సవరణలు సూచించిన విషయం తెలిసిందే.

హస్తం వైపే ఎగ్జిట్‌పోల్స్

(మొదటిపేజి తరువాయి)

నిర్వహించిన సర్వే సంస్థలెన్ని చెబుతున్నప్పటికీ ఈవీఎంలలోనే అభ్యర్థుల భవితవ్యాలు దాగి ఉన్నాయి. కొత్తగా కొలువు దీరే ప్రభుత్వమేదనేది తెలుసుకోవాలంటే మూడో తేదీ దాకా ఎదురుచూడాల్సిందే.

'ఆరా'..గుబులు పుట్టించేరా..

సీఎం కేసీఆర్ గజ్వేల్‌లో, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో గట్టిపోటీ ఎదుర్కొంటున్నప్పటికీ వారే విజయం సాధిస్తారని ఆరా సంస్థ వెల్లడించింది. అయితే, కామారెడ్డిలో మాత్రం వారిద్దరూ ఓడిపోతారంటూ బాంబ్ పేల్చేసింది. అక్కడ బీజేపీ వెంకటరమణారెడ్డి గెలవబోతున్నారంటూ సంచలన ప్రకటన చేసింది. కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కామారెడ్డిలో ఓటమి అనే అంశం బీఆర్‌ఎస్‌లో గుబులు పుట్టిస్తున్నది. ఐదుగురు మంత్రులు తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నారనీ, వారిలో పలువురు ఓడిపోనున్నారని చెప్పింది. కొల్లాపూర్‌లో పోటీచేసిన ఇండిపెండెంట్ అభ్యర్థి శిరీష(బర్రెలక్క)కు పదివేలకుపైగా ఓట్లు రాబోతున్నాయని వెల్లడించింది. ఈటల రాజేందర్ ఇటు గజ్వేల్‌లోనూ, అటు హుజురాబాద్‌లోనూ నెక్ టు నెక్ ఫైట్ ఎదుర్కొంటున్నారని ప్రకటించింది. గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ గెలుస్తారనీ, హుజురాబాద్‌లో ఈటలకు 50-50 అవకాశాలున్నాయని చెప్పింది.

బీజేపీకి ఎదురుగాలి

(మొదటిపేజి తరువాయి)

పక్కనబెట్టి బీజేపీని గెలిపిస్తారని పేర్కొన్నాయి.

అదే సమయంలో, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్, బీజేపీల మధ్య నువ్వా నేనా అన్నట్టు గట్టి పోటీ వుందని ఎగ్జిట్ పోల్స్ పేర్కొంటున్నాయి. అయితే ఎక్కువ ఒపీనియన్ పోల్స్ వివరాలు చూసినట్టైతే కాంగ్రెస్‌కు మంచి విజయం అందుతుందని అంచనా వేశాయి.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్, బీజేపీల మధ్య హోరాహోరీగా పోరు నెలకొన్నా..కాంగ్రెస్‌కు కొద్దిగా ఎక్కువ అవకాశాలు ఉన్నాయని పోల్స్ వివరాలు తెలియచేస్తున్నాయి.

మిజోరంలో ముఖ్యమంత్రి జోరమ్‌తంగా నేతృత్వంలోని మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్‌ఎఫ్), మరో ప్రాంతీయ పార్టీ అయిన జోరామ్ నేషనలిస్ట్ పార్టీ (జెడ్ఎన్‌ఎఫ్)కి మధ్య గట్టి పోటీ వుందని వెల్లడైంది. ఒకవేళ హంగ్ అసెంబ్లీ ఏర్పడితే ప్రభుత్వ ఏర్పాటులో కాంగ్రెస్ పాత్ర వుంటుందని భావిస్తున్నారు. బీజేపీ ఎలాంటి ప్రభావాన్ని చూపకపోవచ్చు.

విద్వేష ప్రసంగాల కట్టడికి యంత్రాంగం : సుప్రీం యోచన

న్యూఢిల్లీ : దేశంలో కొందరు వ్యక్తులు చేస్తున్న విద్వేషపూరిత ప్రసంగాలను పరిశీలించేందుకు పాలనాపరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు సుప్రీంకోర్టు తెలిపింది. ఒక్కో కేసును వ్యక్తిగతంగా పరిశీలించడం సాధ్యం కాదని, దీనివల్ల కేసుల ప్రవాహం పెరుగుతుందని వ్యాఖ్యానించింది. విద్వేష ప్రసంగాలను న్యాయస్థానం నిర్వచిస్తోందని అంటూ అయితే దీనిని ఎలా అమలు చేయాలి, ఎలా వర్తింపజేయాలి అనేదే ప్రశ్న అని జస్టిస్ సంజీవ్ ఖన్నా, ఎస్‌వీఎన్ భట్టితో కూడిన బెంచ్ పేర్కొంది. 'ఒక్కో కేసును వ్యక్తిగతంగా పరిష్కరించలేము. ఒకవేళ అలా చేయడం మొదలుపెడితే కేసుల సంఖ్య పెరుగుతుంది. దానికి బదులు మౌలిక సదుపాయాన్ని లేదా



పాలనాపరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. ఒకవేళ అక్కడ ఏదైనా ఉల్లంఘన జరిగితే మీరు సంబంధిత హైకోర్టును ఆశ్రయించవచ్చు' అని సుప్రీం బెంచ్ వివరించింది. పాన్ ఇండియా కేసులు చేపట్టడం సాధ్యం కాదని, వాటిని పరిష్కరించడం అసంభవమని తెలిపింది. 'భారత్ వంటి పెద్ద దేశంలో సమస్యలు ఉంటాయి. అవసరమైనప్పుడు చర్య తీసుకునే పాలనా యంత్రాంగం మన వద్ద ఉన్నదా అనేదే ఇక్కడ ప్రశ్న. విద్వేష ప్రసంగం చేస్తే ప్రభుత్వం చర్య తీసుకుంటుందన్న విషయం సమాజానికి తెలియాలి' అని వ్యాఖ్యానించింది. కాగా నోడల్ అధికారులను నియమించని తమిళనాడు, కేరళ, నాగాలాండ్, గుజరాత్ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

సాగర్ డ్యాంపై ఉద్రిక్తత

(మొదటిపేజి తరువాయి)

రాష్ట్ర పోలీసులు, తెలంగాణ పోలీసులు, ఎస్పీఎఫ్ కానిస్టేబుల్స్ మధ్య తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గతంలో ఇరు రాష్ట్రాల డీఎస్పీల మధ్య జరిగిన వాగ్వాదం తిరిగి సీన్ రిపీటైంది. అయితే, గొడవ జరుగుతున్న క్రమంలోనే కుడి కాలువకు నీటిని దిగువకు విడుదల చేయడం గమనార్హం.

గురువారం అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో నాగార్జున సాగర్ డ్యామ్‌పై ఆంధ్ర పోలీసులు రైట్ బ్యాంక్ ప్రధాన గేటు నుంచి చొచ్చుకొచ్చారు. వారిని అడ్డుకున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుళ్లను గాయపరిచి 13వ గేటు మా ఆధీనంలో ఉంటుందని దాదాపు ఏఎస్పీ 700 మంది పోలీస్ జవాన్లు 13వ గేటు వరకు దూసుకొచ్చారు. 13వ గేట్ వరకు చేరుకున్న ఆంధ్ర పోలీసులను తెలంగాణ పోలీసులు అడ్డుకున్నారు.

ఇరువురు మధ్య ఘర్షణ

డ్యాం భద్రత దృష్ట్యా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ సెల్‌ఫోన్లను ఆంధ్రప్రదేశ్ పోలీసులు ధ్వంసం చేశారని వార్తలు వచ్చాయి. దీనితో అప్రమత్తమైన తెలంగాణ పోలీసులు ఆంధ్ర పోలీసులను అడ్డుకోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. డ్యామ్ పైకి ప్రాజెక్టు అధికారులు తప్ప ఇతరులు ఎవరికీ అనుమతి ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అనంతరం ఇరు రాష్ట్రాల పోలీసులు తమ ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశారు.

2015లో జల వివాదం

2015 ఫిబ్రవరి 13న నాగార్జున సాగర్‌లో ఏపీ, తెలంగాణ పోలీసుల మధ్య పెద్ద గొడవే జరిగింది. ఇరు రాష్ట్రాల మధ్య జల వివాదం రాగా, రెండు ప్రభుత్వాలు పంతానికి పోవడంతో డ్యామ్ దగ్గర ఆ సమయంలో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. తెలంగాణ నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడంతో ఏపీ అధికారులు కుడిగట్టు క్రస్ట్ గేట్ల స్విచ్ రూమ్ తలుపులు పగలగొట్టారు. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణ పోలీసులు పరసర్పం దాడులు చేసుకున్నారు. అప్పుడు సద్దిమణిగినా.. ఇప్పుడు తెలంగాణలో ఎన్నికల వేళ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దు భద్రత దళాల మధ్య గొడవలు, లైట్లు, కెమెరాలు ధ్వంసం చేయడంపై రాజకీయ కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో బీఆర్‌ఎస్ ఈసారి ఓటమి దిశగా ఉన్నట్టు పలు సర్వేలు తేల్చాయి. ఈ క్రమంలో సాగర్ సరిహద్దు వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకోవడం చూస్తుంటే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డ్యామ్‌పై కంచె ఏర్పాటు

నాగార్జున సాగర్ డ్యామ్‌పై ఎవరినీ అనుమతించకుండా కంచె ఏర్పాటు చేశారు. తెలంగాణ ఐడి కార్డు ఉంటే అనుమతించడం లేదు కానీ ఆంధ్ర ఐడి కార్డు ఉంటే డ్యాం పైకి అనుమతిస్తున్నారు. అక్కడి పరిస్థితులను తెలుసుకోవడానికి విలేకరులను సైతం అనుమతించడం లేదు. ఇరు రాష్ట్రాల పోలీసుల గొడవ జరుగుతుండగానే.. నాగార్జున సాగర్ కుడి కాలువకు గురువారం ఒంగోలు చీఫ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో 2000వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అయితే, తెలంగాణ పోలీసులు కరెంట్ కట్ చేయడంతో.. వాళ్లు ఆంధ్రప్రదేశ్ నుంచి కరెంట్ కనెక్షన్ తీసుకుని నీటి విడుదల చేసుకుంటున్నారు.

మరోసారి హైటెన్షన్

నాగార్జున సాగర్ డ్యామ్ వద్ద మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డ్యామ్ వద్దకు తెలంగాణ పోలీసులు పెద్దఎత్తున చేరుకున్నారు. సాయంత్రం వరకు ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసులు భద్రత దృష్ట్యా రాత్రికి డ్యామ్ వద్దకు చేరుకున్నారు. ఇప్పటికే డ్యామ్‌పై కంచె వేసి పెద్ద ఎత్తున అక్కడ ఏపీ పోలీసులు పహారా కాస్తున్నారు. డ్యామ్ వద్ద అటు ఏపీ పోలీసులు, ఇటు తెలంగాణ పోలీసులు భారీగా బలగాలను మోహరించారు. అయితే, ఏపీ పోలీసుల తీరుపై నాగార్జున సాగర్ ప్రాజెక్టు అధికారులు తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాశారు.

గుజరాత్‌లో మాజీ ఐఏఎస్ అధికారి అరెస్టు

- రూ.18.6 కోట్ల ప్రభుత్వ గ్రాంట్లను దారి మళ్లించిన కుంభకోణంలో తాజా చర్య

గాంధీనగర్ : రూ. 18.6 కోట్ల విలువైన ప్రభుత్వ గ్రాంట్‌లను ఆరు నకిలీ కార్యాలయాల బ్యాంకు ఖాతాలకు మళ్లించే కుంభకోణంలో భాగమైనందుకు గానూ గుజరాత్‌లోని దాహోద్ జిల్లాలో మాజీ ఐఏఎస్ అరెస్టయ్యారు. గుజరాత్-క్యాడర్ మాజీ అధికారి బి.డి నిమానాకు జిల్లా కోర్టు 4 వరకు పోలీసు కస్టడీకి రిమాండ్ విధించింది. "ఆయన 2019 నుంచి 2022 మధ్య దాహోద్‌లో రాష్ట్ర ప్రభుత్వ గిరిజన ప్రాంత సబ్ ప్లాన్ ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా ఉన్నప్పుడు కుంభకోణంలో ఇతర నిందితులకు సహాయం చేశాడని ఆరోపణలున్నాయి. దీంతో అతన్ని అరెస్టు చేశారు" అని పోలీసు సూపరింటెండెంట్ రాజ్‌దీప్‌సింగ్ జాలా తెలిపారు. అక్టోబరు 26న గుజరాత్‌లోని ఛోటా ఉదేపూర్ జిల్లాలో ఇదే విధమైన కుంభకోణం ఛేదించిన దాదాపు నెల తర్వాత నిమనా అరెస్టు జరిగింది. కనీసం రూ. 4.16 కోట్ల ప్రభుత్వ గ్రాంట్లు రాకెట్‌దారులకు మళ్లించబడ్డాయని ఆరోపణలు ఉన్నాయి.

గ్రామీణ వినియోగంలో నెమ్మదిగా వృద్ధి

- కేవలం 0.5 శాతంగా నమోదు
- ఎనిమిది త్రైమాసికాల్లో జులై-సెప్టెంబర్‌లోనే ఇలా : నివేదిక

న్యూఢిల్లీ : 2024 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో గ్రామీణ వినియోగం కేవలం 0.5శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది. ఇది ఎనిమిది త్రైమాసికాల్లో అత్యంత నెమ్మదిగా నమోదైందని కొత్త నివేదిక పేర్కొన్నది. ఇది పట్టణ వినియోగంతో విభేదిస్తున్నది. ఇది జులై-సెప్టెంబర్‌లో 7.4 శాతం పెరిగింది. ఇది నాలుగు త్రైమాసికాల్లో అత్యధిక రేటు కావటం గమనార్హం.

మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఎంఓఎఫ్‌ఎస్‌ఎల్) విశ్లేషణ ప్రకారం.. గ్రామీణ ప్రాంతాలలో ప్రధానంగా జలాశయాల స్థాయి బాగా క్షీణించడం, ఆరు త్రైమాసికాల్లో ద్విచక్ర వాహనాల అమ్మకాలలో మొదటి పతనం, ఏడు త్రైమాసికాల్లో ఎరువుల విక్రయాలలో మొదటి సంకోచం వంటివి జరిగాయి. ట్రాక్టర్ అమ్మకాలు వరుసగా రెండో త్రైమాసికంలో కూడా తగ్గుముఖం పట్టాయి. దీనితో పాటుగా నాలుగో త్రైమాసికంలో నిజమైన వ్యవసాయ ఎగుమతులు క్షీణించాయని ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ నివేదికను ఉటంకిస్తూ పేర్కొన్నది. మా విశ్లేషణకు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) డేటా కూడా మద్దతు ఇస్తుందని వివరించింది.

ఎండుగడ్డి కొరత... పెరగనున్న పాల ధరలు ?



న్యూఢిల్లీ : దేశంలో ఎండుగడ్డికి తీవ్రమైన కొరత ఏర్పడుతోంది. దీంతో పాల ధరలు పెరిగే అవకాశం ఉంది. వివిధ ప్రాంతాల్లో ఎండుగడ్డికి 25% నుండి 90% వరకూ కొరత ఉంటోంది. పశువుల సంఖ్య పెరగడం, గడ్డి లభించే విస్తీర్ణం తగ్గిపోవడం, పంట పొలాల్లో వరి కోతల తర్వాత అవశేషాలను తగలబెట్టడం వంటి కారణాలతో పశుగ్రాసానికి కొరత ఏర్పడుతోందని ఇండియన్ గ్రాస్‌లాండ్ అండ్ ఫాడర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్ (ఐజీఎఫ్ఆర్ఐ)కు చెందిన శాస్త్రవేత్తలు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా దేశంలో పాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పశుగ్రాసం మరింత ఖరీదైపోయింది. గత సంవత్సరం నవంబరులో దేశంలో పాల సగటు చిల్లర ధర లీటరుకు రూ.54.90 ఉండగా ఈ సంవత్సరం నవంబరులో అది రూ.57.52కు పెరిగింది. పశుగ్రాసం లభించకపోవడం పాడి పరిశ్రమకు ప్రధాన సమస్యగా మారింది. ఎందుకంటే పశు పోషణకు పెట్టే ఖర్చులో పశు గ్రాసం వాటా 70% వరకూ ఉంది. తాజా అంచనాల ప్రకారం దేశంలో పచ్చిగడ్డికి 11.24%, ఎండుగడ్డికి 23.1 శాతం కొరత ఉంది.

మనదే విజయం

(మొదటిపేజి తరువాయి)

ధీమా వ్యక్తం చేశారు. 70కి పైగా స్థానాల్లో విజయం సాధించి హాట్రిక్ కొడతామని స్పష్టం చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు చూసి కంగారు పడాల్సిన పని లేదని చెప్పారు. 'ఈరకమైన ఎగ్జిట్ పోల్స్‌ను గతంలోనూ చూశాం. ఎగ్జిట్ పోల్స్ తప్పు అని నిరూపించడం మాకు కొత్తేమీ కాదు. డిసెంబర్ 3న 70కి పైగా స్థానాలతో విజయం సాధిస్తాం. ఎగ్జిట్ పోల్స్‌ను చూసి కంగారు పడాల్సిన అవసరం లేదు. కొన్ని మీడియా సంస్థలు సర్వేలు చేయకుండా.. ఏదో 200 మందిని అడిగినదాన్నే గొప్పగా చేసి చూపిస్తాయి. గతంలో 5 మీడియా సంస్థలు సర్వేలు చేస్తే.. అందులో ఒక్కటే నిజమైంది' అని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజలు ఇంకా లైన్‌లో ఉండి ఓట్లు వేస్తుంటే.. అప్పుడే ఎగ్జిట్ పోల్స్ వెల్లడించడటమేంటని ప్రశ్నించారు. అస్సలు ఏ లాజిక్‌తో ఎగ్జిట్ పోల్స్ ఇస్తున్నారో అర్థం కావట్లేదన్నారు. ఇది హాస్యాస్పదంగా అనిపిస్తుందని చెప్పారు. ఒకవేళ డిసెంబర్ 3న ఎగ్జిట్ పోల్స్ తప్పు అయితే.. తప్పు జరిగిందని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెబుతారా? అని ఎగ్జిట్ పోల్స్ ప్రచురించిన మీడియా సంస్థలను ప్రశ్నించారు. ఎవ్వరూ అయోమయానికి గురికావద్దని విజ్ఞప్తి చేశారు. వందకు వంద శాతం అధికారంలోకి వస్తామని స్పష్టం చేశారు. గత 90 రోజులుగా కష్టపడ్డ కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా పోలింగ్ శాతం తేలలేదని.. ఫైనల్ పోలింగ్ ఎంత జరిగిందనేది శుక్రవారం ఉదయం తేలుతుందని తెలిపారు. ఎంత పోలింగ్ అయ్యింది? ఎక్కడ ఎంత అయ్యింది? ఏ నియోజకవర్గంలో ఎంత అయ్యిందనేదాన్ని బట్టి అనాలసిస్ చేసుకోవచ్చన్నారు. దుష్ప్రచారాలు, అబద్ధాలు, నకిలీ వీడియోలతో ప్రజలను ప్రభావితం చేసేలా పని చేస్తున్న పార్టీలపైన ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోవడంపై ఆలోచించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

జనగామలో హైటెన్షన్

పలు చోట్ల ఘర్షణ వాతావరణం • ఈవీఎంల మొరాయింపు



నవతెలంగాణ-జనగామ/వరంగల్ డెస్క్

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. జనగామ జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 244 పోలింగ్ కేంద్రానికి బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి రాగా.. ఆయన వెంట వచ్చిన కార్యకర్తలు బూత్ బయటే ఉన్నారు. పల్లా ఈవీఎంలను పరిశీలిస్తుండగా కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాపరెడ్డి కుమారుడు ప్రశాంత్ రెడ్డి బూత్ దగ్గరికి వచ్చి.. ఇంతమంది పోలింగ్ బూత్ వద్దకు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. దాంతో ఓ బీఆర్ఎస్ కార్యకర్త శ్రీను.. వస్తే మీకేం ఇబ్బంది అనడంతో అక్కడే ఉన్న బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంత రెడ్డి సహా మరికొందరు కలిసి శ్రీనుపై దాడి చేశారు. దాంతో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో అరగంటకు పైగా పోలింగ్ నిలిచిపోయింది. వెంటనే జనగామ సీఐ శ్రీనివాస్ యాదవ్, టాస్క్‌ఫోర్స్ సీఐ బాబూలాల్ తదితర సిబ్బంది అక్కడున్న వారిని చెదరగొట్టారు. బీఆర్ఎస్ కార్యకర్త శ్రీనుని పోలీస్ స్టేషన్‌కు తరలించగా.. పల్లా రాజేశ్వర్ రెడ్డి విడిపించుకుని వెళ్ళిపోయాడు. జనగామ వ్యవసాయ మార్కెట్ సమీపంలోని మరో బూత్‌లోనూ అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు గొడవకు దిగారు. దాంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు.

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పెరికాడలో పోలింగ్ మరికొద్దిసేపట్లో ముగుస్తుందనే సమయానికి ప్రజలు, యువకులు పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దాంతో పోలీసులు లాఠీలను ప్రయోగించారు. ఈ దాడిలో 33వ డివిజన్‌కు చెందిన యువకులు అవినాష్, సతీష్ తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స కోసం ఆస్పత్రులకు తరలించారు. కాశీబుగ్గ పరిధి 20వ డివిజన్‌లోని శాంతినగర్ పోలింగ్ బూత్ వద్ద వరంగల్ తూర్పు బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపనేని నరేందర్‌కు.. ఇటీవలే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన స్థానిక కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ ఎదురుపడి.. 'బాయ్ బాయ్ నరేందర్' అంటూ చేతులు ఊపడంతో ఎమ్మెల్యే వెంటనే కారు దిగి అతనిపై దుర్భాషలాడారు. "ఎన్నికల అనంతరం నిన్ను చౌరస్తాలో నిలబెడతా" అంటూ కార్పొరేటర్ ఎదురుదాడికి దిగారు.

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం మరిపెడలోని 219 పోలింగ్ కేంద్రంలో ఉదయం ఏడు గంటలకు ఓటు వేయడానికి వెళ్లిన యువకులు ఓటు వేయకుండా క్యూలో నిలబడి కారు గుర్తుకే ఓటేయాలని ప్రచారం చేస్తుండగా ఓటర్లు అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. దాంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. డీఎస్పీ వెంకటేశ్వర బాబు, ఎస్ఐ పవన్ కుమార్ ఆందోళనకారులను చెదరగొట్టారు. అనంతరం ఎమ్మెల్యే కొడుకు రవిచంద్ర పోలింగ్ కేంద్రంలోకి రావడంతో కాంగ్రెస్ కార్యకర్తలు అభ్యంతరాన్ని తెలుపుతూ ఆందోళన చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు సైతం పోలింగ్ కేంద్రంలోకి వెళ్ళడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డగించారు. దాంతో మాజీ ఎంపీటీసీ గంధసిరి అంబరీష, డీఎస్పీ వెంకటేశ్వర బాబు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. స్థానిక జర్నలిస్టులు, మీడియా కవరేజ్ కోసం వెళ్ళి ఫోటోలు తీసిన విలేఖరి సెల్ లాక్కొని ఫొటోలు డిలీట్ చేశారు. ములుగు జిల్లా పరిధి కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటర్లు అధిక సంఖ్యలో రాగా వారిని నివారించాల్సిన సీఆర్పీఎఫ్ పోలీసులు ఓటర్లను చితకబాదారు. గమనించిన స్థానికులు క్యూలైన్లో ఉన్న ఓటర్లందరూ పోలీసులపై తిరగబడ్డారు.

ఈవీఎంల మొరాయింపు

జనగామ జిల్లా నర్మెట్ట మండలంలోని పలు గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించాయి. ఒక్క ఓటు వేయడానికి 20 సెకన్లు పడుతుందని ఓటర్లన్నారు. దాంతో సాయంత్రం 5 గంటలు దాటినా ఓటర్లు ఓటు వినియోగించుకోవడానికి క్యూలైన్‌లో ఉన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం వెలికట్ల, నాంచారి మడూరులో వీవీప్యాడ్లు మొరాయించాయి. దాంతో గంటల కొద్దీ లైన్‌లో ఉన్న మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.

ఎన్నికలను బహిష్కరించిన ఏజెన్సీ గ్రామం

నవతెలంగాణ-ఏటూరు నాగారం ఐటీడీఏ

ములుగు జిల్లా ఏటూర్‌నాగారం మండలంలోని అల్లవారి గణపురం గ్రామపంచాయతీ పరిధి మారుమూల ఏజెన్సీ గ్రామమైన ఎలిసెట్టిపల్లిలో ఓటర్లు గురువారం ఎన్నికలను బహిష్కరించారు .ఎన్నో ఏళ్ల నుంచి జంపన్నవాగులో బ్రిడ్జిలేక నానతంటాలు పడుతున్నా ఏ ఒక్క అధికారి, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులు పట్టించుకోలేదన్నారు. తమకు బ్రిడ్జి, రోడ్డు, తాగునీరు, విద్యుత్ సరఫరా, నిరంతరమైన విద్య సేవలను అందించాలని ఓటు హక్కును వినియోగించుకోకుండా వారి గ్రామాలోనే ఉండిపోయారు. ఉదయం 7 గంటల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించిన ఎవరు పట్టించుకోలేదు. దీంతో 186 మందిలో కేవలం 40 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకోగా 146 మంది ఓటు హక్కును వినియోగించుకోకుండా మిగిలిపోయారు. దీంతో పోలింగ్‌శాతం తగ్గిపోయింది అతి తక్కువ పోలింగ్ శాతంగా గ్రామం చోటుచేసుకుంది.



రోడ్డు వేయడంలేదని

పోలింగ్ బహిష్కరణ

తహసీల్దార్ హామీతో ఓటు వేసిన గ్రామస్తులు

నవతెలంగాణ-జూలూరుపాడు

"ఎలక్షన్లు వస్తున్నాయి, పోతున్నాయి కానీ మా గ్రామం తలరాత మారడం లేదు. ఎలక్షనప్పుడు ఓట్లు అడగడానికి మాత్రమే నాయకులు మా ఊరు వస్తున్నారు, ఆ తర్వాత మమ్మల్ని పట్టించుకునే నాథుడే ఉండడు. 30 ఏండ్లుగా ఇదే జరుగుతోంది. మండలంలోని నల్ల బండబోడు నుంచి అనంతారం వరకు రోడ్డు సౌకర్యం లేదని, రోడ్డు మార్గం కల్పించాలని ఎన్నిసార్లు నాయకులకు చెప్పినా, ఎన్నికలు అయ్యేవరకు సరే అంటూ, గెలిచిన తర్వాత, తమ ఊరినే పట్టించుకోవడం లేదని, రోడ్డు సౌకర్యం కల్పించే వరకు ఓట్లను బహిష్కరిస్తున్నామని నల్లబండ బోడు గ్రామస్తులు భీష్మించుకు కూర్చున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శారద, వైరా ఏసీపీ సాంబరాజు, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామానికి చేరుకుని ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గం జూలూరుపాడు మండలం నల్లబండబోడు గ్రామంలో వందేండ్ల నుంచి తమ ముత్తాతల దగ్గర నుంచి సుమారు 60 కుటుంబాలు నివాసముంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ఎన్నికలు వస్తేనే అధికారులకు, నాయకులకు తమ గ్రామం గుర్తుకొస్తుందని, లేకపోతే మా గ్రామాన్ని పట్టించుకునే నాథుడే లేరని అధికారుల ముందు వాపోయారు.

ఎన్నో దఫాలుగా దరఖాస్తుల రూపంలో అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఓట్ల బహిష్కరణకు సిద్ధమయ్యామని తెలిపారు. రోడ్డు లేకపోవడంతో మహిళలు, విద్యార్థులు, గర్భిణీలు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ఈ క్రమంలో జూలూరుపాడు తహసీల్దార్ శారద గ్రామస్తులతో మాట్లాడుతూ.. మీ ఊరికి రోడ్డు వేయించడానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఓటు వేసేందుకు కదిలారు.



ఖమ్మంలో తగ్గిన పోలింగ్

రాత్రి 8 తర్వాతా కొనసాగుతున్న పోలింగ్

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఓటర్లు పెరిగినా పోలింగ్ తగ్గడంపై చర్చ కొనసాగుతోంది. గతంతో పోల్చితే సుమారు పదిశాతానికి పైగా పోలింగ్ తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాత్రి పొద్దుపోయే వరకు క్యూలైన్‌ల్లో పలుచోట్ల ఓటర్లు బారులు తీరి ఉన్నారు. రాత్రి 8.30 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 70శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాయంత్రం 5 గంటల వరకు 66.40 శాతం మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఖమ్మం జిల్లాలో 73.77 శాతం పోలింగ్ నమోదు అయింది. కాగా, 2018లో ఉమ్మడి జిల్లాలో 91.6శాతం పోలింగ్ నమోదు కాగా, ఇప్పుడు 70 శాతం మాత్రమే నమోదైంది. అంటే 15శాతం వరకు ఓటింగ్ తగ్గే అవకాశం ఉంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎన్నికల అధికారులు వీపీ గౌతమ్, ప్రియాంకా అలా, సీపీ విష్ణుఎస్ వారియర్, ఎస్పీ డాక్టర్ వినీత్ పర్యవేక్షణలో చెదురుమదురు ఘటనల మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. తిరుమలాయపాలెం మండలం బీరోలు సెక్రటరీ వెంకటరమణ ఓటర్లను ఓ పార్టీకి ఓటేయాల్సిందిగా చెబుతున్నారని ఓటర్లు ఆరోపించడం వివాదానికి దారితీసింది. సత్తుపల్లి మండలం సత్యంపేట గ్రామంలో ఓటు వేయకుండా గ్రామస్తులు బహిష్కరించారు.

ఖమ్మం రూరల్ మండలం ఆరెంపులలో ఈవీఎం కింద పడి మొరాయించింది. కారేపల్లి మండలం సీతారాంపురంలో వీవీ ప్యాట్ మొరాయించింది. కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించిన వెంటనే ఈసీఐఎల్ పర్యవేక్షక ఇంజినీర్లు వాటిని సరిచేసి పోలింగ్ కొనసాగించారు. కాగా, పలుచోట్ల ఎన్నికల సమయంలోనూ నగదు పంపకాలు కొనసాగాయి. పోలీసులు చూసీచూడనట్లే వ్యవహరించారు.

ఎన్నికలు ఆపడానికి విఫలయత్నాలు

రెండు గ్రామాల మధ్య మందు పాతర పెట్టిన మావోయిస్టులు

నవతెలంగాణ-చర్ల

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరించాలని పిలుపునిచ్చిన మావోయిస్టులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో ఓటర్లను భయపెట్టే చర్యలకు దిగారు. గురువారం మండలంలోని చినముడిసిలేరు, బి.కొత్తూరు గ్రామాల మధ్యలో ఉన్న కల్వర్టు వద్ద ఈ మందు పాతర అమర్చారు. మందు పాతరను గుర్తించిన పోలీసులు వెలికితీసేందుకు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దింపి నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మావోయిస్టులు బాంబు ఏర్పాటు చేసిన రహదారి గుండా ఓటర్లను పోనీయకుండా జాగ్రత్తలు చేపట్టారు. అంజనాపురం, చినముడిసిలేరు ఓటర్లను కాల్వ గట్టు వెంట పెద్ద ముడిసిలేరు పోలింగ్ బూత్‌కు తరలించారు.

ఎన్నికల బహిష్కరణ



ఓట్లు వేసేందుకు నిరాకరణ

- పోలింగ్ కేంద్రాన్ని తరలించడంపై ఆగ్రహం
- రోడ్డు, తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్
- కలెక్టర్ రావాలని పట్టుబడిన జనం
- తహసీల్దార్‌తో రాతపూర్వకంగా రాయించుకున్న కొత్తపల్లి వాసులు

నవతెలంగాణ-నార్నూర్/ తాంసి/బజార్‌హత్నూర్

గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడం.. రోడ్డు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని.. వంతెనలు ఏర్పాటు చేయాలంటూ ఆదిలాబాద్ జిల్లాలో పలు గ్రామాల్లో ఓట్లు వేయడానికి జనం నిరాకరించారు. అధికారులు ఎంత సర్దిచెప్పినా వినలేదు. కలెక్టర్ గ్రామానికొచ్చి హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. సమస్యను పరిష్కరిస్తామంటూ తహసీల్దార్‌తో రాతపూర్వకంగా రాయించుకున్నాక బజార్‌హత్నూర్ మండలం కొత్తపల్లి గ్రామ ఆదివాసీ గిరిజనులు ఓట్లు వేశారు.

గాదిగూడ మండలం కుండి గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఈసారి షేకుగూడకు మార్చారని చెప్పారు. దీంతో తాము ఓటింగ్‌ను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. 2018 నుంచి ఇప్పటి వరకు తమ గ్రామాన్ని అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఐదు సంవత్సరాలుగా ఒక్క గ్రామసభ కూడా పెట్టలేదని కె.లక్ష్మణ్, టి.భీము, ఉప సర్పంచ్ కె.రాము, వార్డు మెంబర్ కె.అయ్యు, మారు, జైతు, ఎం.సోనేరావ్, యూత్ సభ్యులు దుర్గారావ్, జాదు, ఆకాష్, ఆయ్యు తెలిపారు.

భీంపూర్ మండలం గొల్లఘాట్ గ్రామానికి రోడ్డు సౌకర్యంతో పాటు తాగు నీటి సమస్య తీరిస్తేనే ఓట్లు వేస్తామని గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. ఉదయాన్నే అధికారులు పోలింగ్ సామాగ్రితో గ్రామానికి వెళ్లారు. పోలింగ్ కేంద్రానికి గ్రామస్తులెవరూ రాకపోవడంతో అధికారులు వెంటనే తహసీల్దార్ నారాయణకు, సీఐ నరేష్‌కుమార్, ఎస్ఐ లాల్‌సింగ్ నాయక్‌కు సమాచారం చేరవేశారు. వారు వచ్చి యువకులను, గ్రామస్తులకు సర్దిచెప్పినప్పటికీ వారు వినలేదు. కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి సమస్యను త్వరలో పరిష్కరిస్తానని చెప్పినప్పటికీ ససేమిరా అన్నారు. కలెక్టర్ గ్రామానికి వచ్చి హామీ ఇస్తేనే ఓట్లు వేస్తామని తెగేసి చెప్పారు. గ్రామానికి రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అనారోగ్యం బారిన పడి చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తీసుకుపోవడానికి 108 కూడా రాలేక ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయని చెప్పారు. ఎన్నికల కోసమే అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తుంటారు తప్ప తమ గోడును విన్నవారు లేరని, అందుకే ఈసారి పోలింగ్‌ను బహిష్కరించాలని తీర్మానించుకున్నామని గ్రామస్తులు చెప్పారు. తహసీల్దార్, అధికారులు ఏమీ చేయలేక వెనుదిరిగారు.

గ్రామానికి దశాబ్దాల తరబడి రోడ్డు, వంతెనలు లేక వర్షాకాలంలో బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని బోథ్ నియోజకవర్గంలోని బజార్‌హత్నూర్ మండలం కొత్తపల్లి గ్రామ ఆదివాసీ గిరిజనులు ఓటు వేయడానికి మొండికేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శంకర్, బజార్‌హత్నూర్ ఎస్ఐ బి.నరేష్ గ్రామానికి చేరుకొని సమస్య పరిష్కారానికి యత్నించారు. తాను ఎన్నికల అనంతరం గ్రామాన్ని సందర్శించి సమస్యలు పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ గ్రామానికి వచ్చి బాధ్యత తీసుకోవాలని తహసీల్దార్‌ను పట్టుబట్టారు. కలెక్టర్‌ను తీసుకొచ్చే బాధ్యత తనదని, కాగితం మీద రాత పూర్వకంగా గ్రామ పటేల్ రాయించుకొని పోలింగ్‌ను ప్రారంభించారు. 11.30గంటల సమయంలో పోలింగ్ ప్రారంభమైంది. అనంతరం గ్రామస్తులు మీడియాతో మాట్లాడుతూ.. అధికారులు ఒకవేళ ఇచ్చిన హామీ నెరవేర్చని ఎడల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

ఓటేయడానికి వచ్చి ఇద్దరు వృద్ధులు మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఓటేసేందుకు వచ్చి ఇద్దరు వృద్ధులు అస్వస్థతకు గురై మృతిచెందారు. ఈ ఘటనలు ఆదిలాబాద్ జిల్లాలో గురువారం జరిగాయి. మావల మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్ నెం.140లో తోకల గంగమ్మ(78) ఓటేసేందుకు వచ్చింది. మధ్యాహ్నం 12.30 గంటలకు లైన్‌లో నిల్చున్న క్రమంలో ఫిట్స్ రావడంతో కింద పడిపోయింది. పోలింగ్ ఏజెంట్‌గా ఉన్న ఉమకాంత్‌రెడ్డి గమనించి స్థానికుల సాయంతో రిమ్స్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్టు ధ్రువీకరించారు. జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ కాలనీకి చెందిన చంద్రగిరి రాజన్న(65) బాలికల హైస్కూళ్లో ఓటు వేసేందుకు వచ్చాడు. క్యూలో నిలబడి ఉండగా కండ్లు తిరిగి పడిపోయాడు. గమనించిన సిబ్బంది ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు రాజన్న అప్పటికే మృతిచెందినట్టు చెప్పారు.



చెంచుపెంటల్లో తొలిసారి పోలింగ్

75శాతం ఓటు హక్కును వినియోగించుకున్న చెంచులు

నవతెలంగాణ- అచ్చంపేట రూరల్


నల్లమల్ల అటవీ ప్రాంతంలోని చెంచుపెంటల్లో తొలిసారి పోలింగ్ జరిగింది. 9 పోలింగ్ కేంద్రాల్లో చెంచులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అక్కడ ఎన్నికలు విధులు నిర్వహించిన సిబ్బందికి కలెక్టర్ ఉదయ్ కుమార్ అభినందనలు తెలిపారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై చెంచు ఓటర్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 9 పోలింగ్ కేంద్రాల్లో 290 మంది ఓటర్లు ఉన్నారు. 75శాతం ఓటు హక్కును చెంచులు వినియోగించుకున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో జీవనం గడుపుతున్న చెంచు గిరిజనులు తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోవడానికి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఉదయ్‌కుమార్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గతంలో పోలింగ్ కేంద్రాలకు 25 కి.మీ. దూరం వరకు కాలినడకన వెళ్లాల్సి రావడంతో ఓటు వేసేందుకు అంతగా ఆసక్తి చూపేవారం కాదని చెంచులు తెలిపారు. ఈసారి ఇక్కడే కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల ఓటు వేశామన్నారు.

ఎలక్షన్ ఏజెంట్‌గా వెళ్తే దాడి చేస్తారా..

డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఎలక్షన్ ఏజెంట్‌గా వెళ్తే.. కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లతో దాడి చేశార ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో గురువారం డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి పోలింగ్ బూత్‌లో పరిశీలనకు వెళ్లారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన కారుపై రాళ్లతో దాడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు పర్యాయాలు శాసనసభ ఎన్నికల్లో ఏజెంట్‌గా పని చేశానన్నారు. మాజీ శాసనసభ్యులు డాక్టర్, కుడుదుల నగేష్‌కి సైతం ఎన్నికల ఏజెంట్‌గా పని చేశానని, కొత్తగా ఎన్నికల ఏజెంట్‌గా పనిచేయడం లేదని గుర్తు చేశారు. నాకు ఎన్నికల ఏజెంట్‌గా అన్ని అనుమతులు ఉన్నాయని గుర్తింపు పత్రాలను విలేకరులకు చూపించారు. పోలీసుల అనుమతితో తాను పోలింగ్ బూత్ లోపలికి వెళ్తుండగా.. కాంగ్రెస్ పార్టీకి చెందిన 30 మంది తనపై దాడికి యత్నించారని, కారు అద్దాలు పగలగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. 30ఏండ్లుగా ప్రశాంత వాతావరణంలో ఆలేరు నియోజకవర్గ రాజకీయాలు నడుస్తున్నాయని చెప్పారు. గుండాయిజాన్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులు ఎమ్మెల్యే అయితే ఏ విధంగా ఉంటుందో ప్రజలు



ఆలోచించాలన్నారు. 40 ఏండ్లుగా రాజకీయాల్లో ఉన్నానని తనపై ఒక్క కేసు కూడా లేదని చెప్పారు. ఏసీపీ శివరాం రెడ్డి, సీఐ సురేందర్ రెడ్డి, ఎస్ఐ వెంకట శ్రీను పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గుంపులను చెదరగొట్టారు. బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గొంగిడి మహేందర్ రెడ్డిని బందోబస్తు మధ్య అక్కడి నుంచి పోలీసులు తీసుకెళ్లారు.

నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి వాహనంపై దాడి

నవతెలంగాణ-కౌడిపల్లి

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి కొడుకు శశిధర్‌రెడ్డి కౌడిపల్లి మండలం లింగంపల్లి గ్రామ పంచాయతీ బిట్ల తండాలో పోలింగ్ రోజు కూడా ప్రచారం చేయడానికి వచ్చాడని తెలుసుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు కారును అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. దాంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ పెరిగి సునీతారెడ్డి కుమారుడి వాహనంపై బండరాయితో దాడి చేసి అద్దం పగులగొట్టారు. ఓట్లు వేసేటప్పుడు తండాలో తిరగటం ఏంటని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. ఓట్ల సమయంలో ప్రచారం చేయొద్దని కారును, బీఆర్ఎస్ నాయకులను వెనక్కి పంపించారు. సమాచారం అందుకున్న పోలీసులు తండాకు చేరుకొని శశిధర్‌రెడ్డిని పోలీస్ స్టేషన్ తీసుకువచ్చారు. అనంతరం శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు ఓటమి భయంతోనే గొడవలకు దిగుతున్నారని తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుస్తుందన్న దురాలోచనతోనే గొడవలకు దిగుతూ లేనిపోని గొడవలు సృష్టిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధైర్య పడొద్దని, గెలిచేది మనమే అంటూ ధీమా వ్యక్తం చేశారు. అనంతరం దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బీఆర్ఎస్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డిపై కేసు

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిపై గురువారం కేసు నమోదైంది. నిబంధనలకు వ్యతిరేకంగా తన స్వగ్రామమైన నిర్మల్ మండలంలోని ఎల్లపల్లి గ్రామంలో పోలింగ్ బూత్‌లో పార్టీ కండువా కప్పుకొని ఇంద్రకరణ్‌రెడ్డి ఓటు వేశారని నిర్మల్ రూరల్ ఎస్ఐ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఇతర పార్టీల అభ్యంతరం మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

గువ్వల బాలరాజును అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు

నవతెలంగాణ -బల్మూరు



బల్మూరు మండల కేంద్రంలో 169 పోలింగ్ కేంద్రం వద్ద బీఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజును కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలింగ్ బూత్‌లో ఓటు వేస్తున్న ఓటరుతో ఎలా వేస్తున్నావ్ అంటూ ప్రశ్నించడం ఏమిటని కాంగ్రెస్ కార్యకర్తలు నిలదీశారు. దీంతో టీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాదోప వాదాలు జరిగాయి.

సంబంధిత ఎన్నికల అధికారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఓటు వేసే చోటికి వెళ్లి ఓటర్‌తో ఇలా వేయాలని చెప్పి ప్రలోభాలకు గురిచేశారని ఆరోపించారు. తోపులాట జరగడంతో ఎన్నికల సిబ్బంది, పోలీసులు గువ్వల బాలరాజుకు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot No. 8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Published At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot.8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2015/60815